www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బైడెన్ వర్సెస్ జిన్ పింగ్ 2

ఫోన్‌లో అమెరికా, చైనా అధ్యక్షుల సంవాదం..!

హైటెక్ టెక్నాలజీ గురించి మాటల తూటాలు

మీ విధానాలు ఆర్థిక ముప్పు పెంచేలా ఉన్నాయ్

తైవాన్‌పై గీత దాటొద్దు.. డ్రాగన్ హెచ్చరిక

రష్యాకు మీ తోడ్పాటు యావత్ ఐరోపాకు చేటు

టిక్‌టాక్ విషయంలో వెనక్కుతగ్గం: అమెరికా



గురువారం | 4-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 350 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: దశమి సా. 4.16 తదుపరి ఏకాదశి; నక్షత్రం: శ్రవణం రా. 8.13 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: రా.11.52-1.19, దుర్ముహూర్తం: ఉ.10.16-11.05, మ.3.10-3.59, అమృతఘడియలు: ఉ.10.30-11.59, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.11, సూర్యాస్తమయం: 6.26 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పేలుడు ధాటికి నేలమట్టమైన పరిశ్రమ

రియాక్టర్లు బద్దలై

శరీరాలు ఛిద్రమై

సంగారెడ్డి జిల్లా హత్నూర ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో భారీ పేలుడు

పరిశ్రమ డైరెక్టర్ సహా ఐదుగురి దుర్మరణం

ఎగిసిన మంటలు.. మరో నలుగురు మృతిచెంది ఉంటారని అనుమానం

20 మందికి గాయాలు.. నలుగురు విషమం.. భయంతో పరుగులు తీసిన కార్మికులు

గవర్నర్ రాధాకృష్ణన్, సీఎం రేవంత్ దిగ్భ్రాంతి.. మంత్రులు దామోదర, సురేఖ సంతాపం



ఎస్‌బీ ఆర్గానిక్స్ డైరెక్టర్ రవికుమార్(ఫైల్)

హత్నూర, ఏప్రిల్ 3: బల్క్ డ్రగ్స్ పరిశ్రమలో రియాక్టర్లు పేలిన ఘటనలో ఐదుగురు దుర్మరణం పాలవ్వగా.. 20 మంది కార్మికులు తీవ్ర గాయాలపాయ్యారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో చోటుచేసుకుంది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం.. ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో బుధవారం జనరల్ షిఫ్ట్ (ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30)లో అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సహా.. మొత్తం సుమారు 60 మంది విధులకు హాజరయ్యారు. ఈ పరిశ్రమలో బల్క్ డ్రగ్స్, ఫార్మా కంపెనీలకు కావాల్సిన గ్రాన్యూల్స్/పెల్లెట్స్ తయారు చేస్తారు. సాయంత్రం షిఫ్ట్ ముగిసే సమయంలో.. పరిశ్రమలోని రియాక్టర్లు ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోయాయి. ఆయిల్ బాయిలర్ వద్ద ఈ ఘటన జరగడంతో.. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. చూస్తుండగానే మంటలు వ్యాపించి దట్టమైన పొగ

మిగతా 3వ పేజీలో...

తాగునీటి ట్యాంకులో..

30 కోతుల కళేబరాలు

నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్‌లో ఘటన

నీరు తాగడానికెళ్లి ట్యాంకులో పడిన కోతులు

10 రోజులుగా 150 ఇళ్లకు ఆ నీరే సరఫరా

అందులో కోతుల వెంట్రుకలు, అవశేషాలు

కలుషిత నీరు చూసి యువకుల ఫిర్యాదు

మూడేళ్ల కిందట ఇక్కడే ఇదే తరహా ఘటన



నాగార్జునసాగర్, ఏప్రిల్ 3: మనం తాగే నీటిలో చిన్న నలక కనిపిస్తే.. వెంటనే పారబోస్తాం. కాస్త తేడా అనిపిస్తే.. వాడే నీటిని తక్షణమే ఆపేస్తాం..! కానీ, వారు రోజుల తరబడి అదే నీటిని వినియోగించారు. చివరకు అనుమానంతో స్థానిక యువకులు పరిశీలన చేయగా విస్తుపోయే విషయం వెలుగులోకి వచ్చింది. ఎండల తాకిడితో.. దాహం తీర్చుకోవడానికి ఒకదాని వెంట ఒకటి మినీ ట్యాంకులోకి దిగిన కోతులు అందులోనే ప్రాణాలొదిలిన వైనం

మిగతా 3వ పేజీలో...

తాగునీటి సరఫరాపై పర్యవేక్షణకు

10 మంది ఐఏఎస్‌లు

సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు

ఆ అధికారులకు జూలై చివరివరకూ సెలవుల్లేవ్.. ఉత్తర్వుల్లో స్పష్టం 12



సీటి కష్టాలపై 'ఆంధ్రజ్యోతి' క్లిప్పింగ్‌ను చూపుతున్న కేటీఆర్

ఫోన్ ట్యాపింగ్ కేసు..

పోలీసుల అదుపులో 14

వేణుగోపాల్‌రావు

11 గంటల పాటు సుదీర్ఘ విచారణ

నేడోరేపో అరెస్టు ప్రకటించే చాన్స్

ఏడేళ్లుగా ఎస్‌ఐబీలో ఓఎస్డీగా..

వారంపాటు కస్టడీకి రాధాకిషన్

ఆయనపై కూకట్‌పల్లిలో కేసు

ట్యాపింగ్ జరిగి ఉంటే..

కేసీఆరే బాధ్యుడా?

పోలీసు అధికారులు రవిగుప్తా, శివధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డిల ప్రమేయం ఉండదా?

ట్యాపింగ్ చేయాల్సిన అగత్యం మాకు లేదు

హీరోయిన్లను బెదిరించాల్సిన అవసరం లేదు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ లీకువీరుడు

ఆధారాలు బయటపెట్టే దమ్ములేక లీకులు

అడ్డదిడ్డంగా మాట్లాడితే సీఎంనూ వదల

తప్పుడు ప్రచారాలను లీగల్‌గా ఎదుర్కొంటా

కడియం, దానం పదవులు పోవడం ఖాయం

రేవంత్ మగాడైతే రుణమాఫీ చేయాలి

రాముడికి మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం

రాష్ట్రానికి ఏంచేశారని బీజేపీకి ఓటెయ్యాలి?

రేవంత్ గుంపు మేస్త్రీ.. మోదీ తాపీ మేస్త్రీ

బీఆర్‌ఎస్‌కు బీజేపీతోనే పోటీ: కేటీఆర్

సురేఖ, యెన్నం, మహేందర్‌రెడ్డికి నోటీసులు

హైదరాబాద్/వికారాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ లీకువీరుడు అని, ఫోన్ ట్యాపింగ్‌లో వాళ్లున్నారు, వీళ్లున్నారంటూ లీకులిస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. లీక వీరునికి ప్రెస్‌మీట్ పెట్టి చెప్పే దమ్ము లేదని, నేరుగా ప్రజల ముందు ఆధారాలు బయటపెట్టే ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. విచారణలో ఏముందో విషయం ఎవరికీ తెలియదని, కానీ.. పోలీస్ రిమాండ్ ఉన్నవారి విషయాలు కూడా మీడియాకు లీకులు వస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఒకవేళ నిజంగా ట్యాపింగ్ జరిగి ఉంటే.. దానికి కేసీఆర్‌ను

మిగతా 12వ పేజీలో...

రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి: లక్ష్మణ్

కేంద్రం సుమోటోగా తీసుకోవాలి: దుద్దిళ్ల

తురుమ్‌ఖాన్లున్నా వదలం: పొంగులేటి

పోలీస్ వాహనాల్లో డబ్బు తరలింపుపై ఈసీ విచారణ చేయాలి: చాడ 12

మందకు దూరమై.. వెర్రెత్తి..

రైతును తొక్కి చంపిన ఏనుగు 3

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బూరెపల్లిలో ఘటన

మహారాష్ట్రలో మంద నుంచి విడిపోయి వచ్చిన ఏనుగు

మృతుడి కుటుంబానికి సర్కార్ 10 లక్షల పరిహారం



తైవాన్‌లో భారీ భూకంపం

తొమ్మిది మంది దుర్మరణం

1000 మందికి గాయాలు

రిక్టర్ స్కేలుపై తీవ్రత 7.2

కూలిన వంతెనలు 2

ఒరిగిపోయిన భవనాలు

శిథిలాల కింద 127 మంది

హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్

శివబాలకృష్ణకు బెయిల్ 14

సాగర్‌పై కేంద్రమే తేల్చాలి! 3

ఏం చేయాలో చెప్పాలంటూ కృష్ణాబోర్డు లేఖ

4న త్రిసభ్య కమిటీ భేటీ..

రాలేమన్న తెలుగు రాష్ట్రాలు

8వ తేదీ నుంచి 5 టీఎంసీలు ఇవ్వాలని కోరిన ఏపీ

ఎడమకాల్వ నుంచి నీటిని విడుదల చేసిన తెలంగాణ

నిలిపివేయాలన్న బోర్డు

తుక్కు రవాణా బంద్!

కేటీపీఎస్ స్క్రాప్ స్కామ్‌పై కదిలిన యంత్రాంగం.. టెండర్‌పై సీఎండీ రిజ్వీ ఆరా



పాల్వంచలోని కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారం

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 3: కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్(కేటీపీఎస్)లోని తుక్కు తరలింపును అధికారులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. కేటీపీఎస్‌లో స్క్రాప్ గోల్‌మాల్ వ్యవహారంపై 'రూ100కోట్లు హంఫట్, తుక్కు పేరుతో తినేశారు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనం సంచలనమైంది. రాష్ట్రంలోని జెన్‌కో కర్మాగారాల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కేటీపీఎస్ తన పాతప్లాంట్లను మూసివేసి తుక్కు పేరుతో విక్రయించాలని

మిగతా 12వ పేజీలో...

భద్రాచలం వద్ద

రెండో వారధి సిద్ధం

శ్రీరామ నవమి నాటికి ప్రారంభం

నాడు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి.. పట్టుదలతో సాకారం చేసిన మంత్రి తుమ్మల

భద్రాచలం, ఏప్రిల్ 3: పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం వద్ద గోదావరిపై రెండో అంతర్రాష్ట్ర వారధి... ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. శ్రీరామనవమిలోగా వంతెనను ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రాచలం వద్ద ప్రస్తుతం అందుబాటులో ఉన్న బ్రిడ్జిని 1965లో నిర్మించగా.. నిత్యం వేలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాకపోకలకు ఒకే వారధి ఉండడంతో శ్రీరామనవమి, ముక్కోటి తదితర ప్రధాన ఉత్సవాల సమయంలో

మిగతా 13వ పేజీలో...



భద్రాచలం వద్ద గోదావరిపై రెండో వారధి

సిమెంటు మంట!

రూ.40-50 పెరిగే చాన్స్.. నేటి నుంచే అమలుకు కంపెనీల నిర్ణయం?

ఎన్నికల కోడ్, ఎండాకాలంతో మందగించిన నిర్మాణరంగం

ధరల పెంపుతో సిమెంటు అమ్మకాలు తగ్గుతాయని డీలర్ల ఆందోళన



హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సిమెంటు మరింత భారం కానుంది. ధరల పెంపునకు సిమెంటు కంపెనీలు సిద్ధమయ్యాయి. గురువారం నుంచి 50 కిలోల బస్తా ధర రూ.40-50 వరకు పెరగవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో బస్తా సిమెంటు ధర కంపెనీని బట్టి రూ.260 నుంచి రూ.330 వరకు ఉంటోంది. ఈ ధరలను రూ.300 నుంచి రూ.370 వరకు పెంచాలని కంపెనీలు నిర్ణయించినట్లు సమాచారం. సిమెంటు ఉత్పత్తి వ్యయం పెరిగిపోయినందున ధరలు పెంచక తప్పడం లేదని కంపెనీలు చెబుతున్నాయి. ప్రస్తుత ధర

మిగతా 13వ పేజీలో...

వీవీ ప్యాట్లపై వచ్చే వారం విచారిస్తాం

» ఈ విచారణ ఎంతో అత్యవసరం : సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వీవీ ప్యాట్ల అంశంపై విచారణ చేపట్టడం ఎంతో అత్యవసరమని తమకు తెలుసని, దీనిపై వచ్చేవారం తప్పకుండా విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) కౌంటింగ్ మాత్రమే కాకుండా ఓటర్ వెరిఫియబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీపాట్)లను సైతం లెక్కించిన తర్వాతే విజేతను ప్రకటించాలని కోరుతూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. '2013లో సుబ్రమణియన్ స్వామి వర్సెస్ భారత ఎన్నికల సంఘం కోర్టు ఆదేశాలతో ఓటరు తాను ఏ అభ్యర్థికి ఓటు వేశారో తెలుసుకునే హక్కు పొందారు. కాబట్టి ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల కౌంటింగ్ మాత్రమేకాకుండా వీవీ ప్యాట్‌లను సైతం లెక్కించి విజేతను ప్రకటించాలి' అని ఏడీఆర్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై బుధవారమే విచారణ జరగాల్సి ఉంది. అయితే.. జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పెషల్ బెంచ్‌కు నేతృత్వం వహిస్తుండడంతో అది బుధవారం బెంచ్ మీదకు రాలేదు. ఈ క్రమంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ప్రత్యేకంగా ధర్మాసనం ముందు ఈ విషయాన్ని ప్రస్తావించారు. పిటిషన్‌ను త్వరగా విచారించాలని విజ్ఞప్తి చేశారు. పిటిషన్‌ను వచ్చే వారంలో విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

పకడ్బందీగా ఎన్నికలు

» ప్రలోభాలు, అక్రమాలకు తావివ్వొద్దు

» రాష్ట్రాల ఉన్నతాధికారులకు ఈసీ ఆదేశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరగాలని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు, డీజీపీలను ఎన్నికల కమిషన్ ఆదేశించింది. కొన్ని రాష్ట్రాల్లో గంజాయి పెద్దఎత్తున సాగవుతోందని, దాన్ని అణచివేయాలని సూచించింది. ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని, శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా చూడాలని నిర్దేశించింది. అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ సరిహద్దుల్లో మద్యం, నగదు, గంజాయి, మాదకద్రవ్యాలు, ఆయుధాల రవాణా, తాయిలాల సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్, కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూ బుధవారం చీఫ్ సెక్రటరీలు, డీజీపీలతో సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. ఏయే రాష్ట్రాల్లో అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయి? ఏం చర్యలు తీసుకున్నారు? ఎంతమేర నగదు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు? తదితరాలపై ఆరా తీశారు. సరిహద్దుల్లో కేంద్ర భద్రతా దళాలు పహారా కాస్తాయని, అదే సమయంలో రాష్ట్రాల పోలీసు అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగే ప్రాంతాలను గుర్తించి, గత అనుభవాల ఆధారంగా చర్యలు తీసుకోవాలని రాజీవ్ కుమార్ సూచించారు. మద్యం దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. హిస్టరీ షీటర్లు, గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడినవారిని అదుపులోకి తీసుకోవాలన్నారు. నేరస్తులు, సంఘ వ్యతిరేక శక్తులపై నిఘా సమాచారాన్ని పంచుకోవాలని తెలిపారు. పోలీస్, ఎక్సైజ్, రవాణా శాఖ, జీఎస్టీ, అటవీ అధికారులు కలిసికట్టుగా తనిఖీలు, ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. కాగా, అల్లర్లు జరిగిన మణిపూర్‌లో పరిస్థితిని ఈసీ ప్రత్యేకంగా సమీక్షించింది.

యాపిల్ యూజర్లకు కేంద్రం 'హైరిస్క్' అలర్ట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: యాపిల్ వినియోగదారులకు కేంద్రం హైరిస్క్ అలర్ట్‌ను జారీ చేసింది. ఐఫోన్, మ్యాక్‌బుక్, ఐప్యాడ్, విజన్ ప్రో హెడ్‌సెట్ వంటి యాపిల్ ఉత్పత్తులకు రిమోట్ కోడ్ ఎగ్జిక్యూషన్‌కు సంబంధించిన భద్రతాపరమైన ముప్పు ఉందని కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీ సంస్థ-కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) వెల్లడించింది. దీనివల్ల యూజర్లకు ప్రమాదం పొంచి ఉందని, హ్యాకింగ్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువఉన్నాయని తెలిపింది. కాబట్టి లేటెస్ట్ సెక్యూరిటీ వెర్షన్స్‌తో అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. ముఖ్యంగా ఐఓఎస్, ఐప్యాడ్ ఓఎస్‌కి సంబంధించి 17.4.1, 16.7.7కంటే ముందు వెర్షన్లు, సఫారీ 17.4.1, మ్యాక్ ఓఎస్ వెంట్యూరా 13.6.6, మ్యాక్ ఓఎస్ సోనోమా 14.4.1, యాపిల్ విజన్ ఓఎస్ 1.1.1కంటే ముందు వెర్షన్లలో సెక్యూరిటీపరమైన లోపాలున్నట్లు పేర్కొంది. 17.4.1 కంటే ముందు ఓఎస్‌ను వినియోగించే ఐఫోన్ ఎక్స్‌ఎస్, ఐప్యాడ్ ప్రో 12.9, 10.5, 11 ఇంచ్, ఐప్యాడ్ ఎయిర్, ఐప్యాడ్ మినీ యూజర్లకు ముప్పు పొంచి ఉన్నట్లు సెర్ట్-ఇన్ తెలిపింది.

బీజేపీలో చేరుతున్నా: సుమలత

మండ్య, ఏప్రిల్3: సినీనటి, కర్ణాటకలోని మండ్య నియోజకవర్గ స్వతంత్ర ఎంపీ సుమలతా అంబరీశ్ బీజేపీలో చేరనున్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఆ నియోజకవర్గం నుంచి ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామికి ఆమె మద్దతు ప్రకటించారు. బుధవారం తన మద్దతుదారులతో సమావేశమైన ఆమె ఈ విషయాలను వెల్లడించారు. 'నేను మండ్యను వీడి ఎక్కడికీ వెళ్లను. బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నా' అన్నారు. తాను స్వతంత్ర ఎంపీని అయినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ.4వేల కోట్ల వరకూ గ్రాంట్లు ఇచ్చిందని, మండ్యకు సంబంధించిన ఏ నిర్ణయంలోనైనా బీజేపీ నేతలు తనను విశ్వాసంలోకి తీసుకొంటున్నారని ఆమె తెలిపారు. 'బీజేపీకి నీ అవసరం ఉందని ప్రధాని నాకు చెప్పారు. ఆయన మాటను నేను గౌరవించాల్సి ఉంది' అన్నారు.

ఈసారి మామిడి పండ్ల జాతరే..!!

» దేశవ్యాప్తంగా 2.4 కోట్ల టన్నుల ఉత్పత్తి అంచనా

» ఐసీఏఆర్ హార్టికల్చర్ విభాగం డైరెక్టర్ దామోదరన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: మామిడిపండ్లను లొట్టలేసుకుంటూ లాగించేద్దామని ఎదురుచూస్తున్న వారికి ఓ తియ్యటి వార్త. ఈసారి కావాల్సినన్ని మామిడిపండ్లు మన మార్కెట్లలోకి రాబోతున్నాయట!! ఓ రకంగా జనం ఈసారి మామిడి పండ్ల జాతరను చూడబోతున్నారట..!! దేశవ్యాప్తంగా మామిడి పండ్ల దిగుబడి పెరగనుందని నిపుణులు చెబుతున్న అభిప్రాయాలే ఇందుకుకారణం. గతేడాదితో పోలిస్తే ఈసారి మామిడి దిగుబడి 14%పెరిగే అవకాశం ఉందని ఐసీఏఆర్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సబ్‌ట్రాపికల్ హార్టికల్చర్ డైరెక్టర్ టీ దామోదరన్ బుధవారం వెల్లడించారు. 2022-23 వ్యవసాయ సంవత్సరం(జూలై-జూన్)లో 2.1 కోట్ల టన్నులున్న మామిడి దిగుబడి 2023-24లో 2.4కోట్ల టన్నులకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇక, భారత వాతావరణ విభాగం అంచనాల ప్రకారం ఈఏడాది ఏప్రిల్-మే నెలల్లో 10-20 రోజులు తీవ్రమైన వడగాడ్పులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే మామిడి దిగుబడిపై ఎలాంటి ప్రభావం చూపవని దామోదరన్ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం కాయలు పండ్లుగా మారే దశలో సాగు ఉందని.. అందువల్ల సాధారణ వడగాడ్పులు పంట దిగుబడిపై ప్రభావం చూపవని, పంటకు పరోక్షంగా మేలు చేస్తాయన్నారు. కాగా, దక్షిణాది రాష్ట్రాల్లో మామిడి సాగు చాలా ఎక్కువ. దేశ మొత్తం దిగుబడిలో ఈ రాష్ట్రాల వాటా 50% వరకు ఉంటుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో దక్షిణాదిలో గతేడాది 15% పంట నష్టం జరిగింది. ఈ ఏడాది మాత్రం అలాంటి పరిస్థితులు కనిపించడం లేదని దామోదరన్ తెలిపారు.

రాజ్యాంగ నాశనానికి మోదీ యత్నం

అది జరక్కుండా 'ఇండియా' ఆపుతోంది: రాహుల్.. వయనాడ్ అభ్యర్థిగా అట్టహాసంగా నామినేషన్

» వెంట సోదరి ప్రియాంక

» పట్టణంలో భారీ రోడ్‌షో



వయనాడ్ ఆర్వోకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న రాహుల్

వయనాడ్, ఏప్రిల్ 3: లోక్‌సభ ఎన్నికలు భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న పోరాటమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రయత్నిస్తున్నారని, అది జరక్కుండా ఆపేందుకు కాంగ్రెస్, ఇండియా కూటమి కృషి చేస్తున్నాయని చెప్పారు. సోదరి ప్రియాంకా గాంధీ వాద్రా వెంట రాగా.. బుధవారం వయనాడ్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 10.45 గంటలకు కన్నూర్ నుంచి ఇక్కడికి సమీపంలోని ముప్పయ్‌నాడ్ గ్రామంలోని హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్లో దిగారు. అక్కడ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి కాల్‌పేటలోని కొత్త బస్టాండ్ వద్దకు రోడ్డుమార్గంలో చేరుకున్నారు. అక్కడి నుంచి 11.30 గంటలకు భారీ రోడ్‌షోతో వయనాడ్‌లో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సివిల్ స్టేషన్ వరకు రోడ్‌షో నిర్వహించారు. ఆయన ఓపెన్ వాహనంపై నిలబడి కార్యకర్తలు, మద్దతుదారులకు అభివాదం చేశారు. ఆయన పక్కన ప్రియాంక, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, దీపా దాస్‌మున్షీ, ఎన్ఎస్‌యూఐ ఏఐసీసీ ఇన్‌చార్జి కన్హయ్యకుమార్, కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్, కేపీసీసీ యాక్టింగ్ అధ్యక్షుడు ఎంఎం హసన్ తదితరులు కూడా ఉన్నారు. సివిల్ స్టేషన్ వద్ద రాహుల్ పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసంగించారు. వయనాడ్ కలెక్టర్-రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశాక విలేకరులతోనూ మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని, దేశ రాజ్యాంగాన్ని నాశనం చేయాలనుకునే శక్తులు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఒక వైపు.. వాటిని కాపాడే శక్తి (కాంగ్రెస్, ఇండియా కూటమి) మరోవైపు మోహరించాయని తెలిపారు. వయనాడ్ సమస్యల గురించీ ప్రస్తావించారు. గత దశాబ్ద కాలంలో ఏనుగులు, పెద్దపులుల దాడిలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. నియోజకవర్గ సమస్యలను ఎప్పటికప్పుడు దేశం దృష్టికి తీసుకొస్తున్నానని చెప్పారు. అద్భుతమైన చరిత్ర, సంప్రదాయాలు కలిగిన వయనాడ్ తనకు వెలుగు దివ్వెలా నిలిచిందన్నారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గ ప్రజలు అందిస్తున్న మద్దతుకు కృతజ్ఞుడినని.. ఇప్పుడు 'న్యాయ్' శకంలోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో వారందరికీ తన శక్తి మేరకు సేవ చేసేందుకు తిరిగి కంకణబద్ధుడినవుతానని చెప్పారు. వయనాడ్ ప్రజలను చెల్లెలు ప్రియాంక మాదిరిగా తన కుటుంబంగానే పరిగణిస్తున్నానని.. ఓటర్లుగా చూడడం లేదని ఆ తర్వాత 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. క్రూర జంతువుల దాడులు, రాత్రివేళ ప్రయాణాలు, వైద్య కళాశాల సమస్యల పరిష్కారానికి కేంద్ర సర్కారు, కేరళలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చానని.. కానీ అవి సానుకూల చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. కాగా.. గత ఎన్నికల్లో రాహుల్ తన సమీప సీపీఐ అభ్యర్థి పీపీ సునీర్‌పై 4 లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ దఫా సీపీఐ నేత అన్నీ రాజా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రన్‌తో తలపడుతున్నారు. కేరళలోని మొత్తం 20 లోక్‌సభ స్థానాలకు 26న పోలింగ్ జరుగనుంది.

వయనాడ్‌లో స్మృతి ప్రచారం

కేరళ బీజేపీ అధ్యక్షుడు సురేంద్రన్ రాహుల్‌కు పోటీగా వయనాడ్ లోక్‌సభ స్థానానికి గురువారం నామినేషన్ వేయనున్నారు. తర్వాత, రోడ్ షో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో స్మృతి ఇరానీ కూడా పాల్గొనున్నారు. 2019లో అమేఠీలో స్మృతి ఇరానీ రాహుల్ గాంధీని ఓడించిన సంగతి తెలిసిందే. అప్పుడు వయనాడ్‌లో కూడా పోటీ చేసి గెలిచిన రాహుల్‌పై ఈసారి ఒత్తిడి పెంచడానికి ఆమె వయనాడ్‌లో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్

» 'ఘర్ ఘర్ గ్యారంటీ' ప్రారంభం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ.. కాంగ్రెస్ పార్టీ తమ 'పాంచ్ న్యాయ్- పచ్చీస్ గ్యారెంటీ'లను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సరికొత్త కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగానే తాజాగా.. 'ఘర్ ఘర్ గ్యారంటీ' పేరిట మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్‌తో కలిసి బుధవారం ఢిల్లీలోని ఉస్మాన్‌పూర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ హామీలపై సుమారు ఎనిమిది కోట్ల కుటుంబాలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఖర్గే తెలిపారు. 14 భాషల్లో ముద్రించిన 'పాంచ్ న్యాయ్ - పచ్చీస్ గ్యారెంటీ' కరపత్రాలను దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ప్రతి కుటుంబానికీ చేరుస్తారని, వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తారని చెప్పారు. మోదీ గ్యారెంటీని ప్రజలు విశ్వసించట్లేదన్నారు. తప్పుదోవ పట్టించి, భ్రమల్లోకి నెట్టి మళ్లీ అధికారంలోకి రావాలనే వారికి ఈసారి ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

బీజేపీలోకి బాక్సర్ విజేందర్ సింగ్

» 2019లో కాంగ్రెస్ నుంచి పోటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. భారత స్టార్ బాక్సర్, ఒలింపిక్ పతక విజేత విజేందర్ సింగ్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పేసి బీజేపీ గూటికి చేరారు. 2019లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న విజేందర్ దక్షిణ ఢిల్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధూరిపై పోటీచేసి ఓటమిపాలయ్యారు. హరియాణాలో కీలకమైన జాట్ సామాజిక వర్గానికి చెందిన విజేందర్‌కు ఈ ఎన్నికల్లో కూడా సీటు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావించింది. బీజేపీ ఎంపీ హేమామాలిని పోటీ చేస్తున్న మథుర నియోజకవర్గం నుంచి ఆయనను బరిలోకి దించే అవకాశాలున్నట్లు ఇటీవల వార్తలు వెలువడ్డాయి. కానీ, ఉన్నట్టుండి బుధవారం ఆయన బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావడే సమక్షంలో కాషాయ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడుతూ "ఇప్పుడు సొంతగూటికి చేరినట్టుంది" అన్నారు. ఈ ప్రభుత్వంలో ఆటగాళ్లకు ఆటగాళ్లకు గౌరవం దక్కుతోందని.. అందుకు ప్రధాని మోదీకి, బీజేపీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. అందుకే ఈ ప్రభుత్వంలో భాగస్వామిని కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

అనుభవజ్ఞులైన నేతల బృందమే మోదీకి ప్రత్యామ్నాయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: ప్రధాని మోదీకి ప్రత్యామ్నాయం ఎవరనే ప్రశ్నే అసంబద్ధమని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజలు ఒక వ్యక్తిని ఎన్నుకోవడం లేదని (అధ్యక్ష వ్యవస్థ తరహాలో), ఒక పార్టీని లేదా పార్టీల సంకీర్ణ కూటమిని ఎన్నుకుంటున్నారని చెప్పారు. వ్యక్తిగత అహంభావాన్ని పక్కనపెట్టి ప్రజా సమస్యలపై పోరాడే అనుభవజ్ఞులైన, సమర్థులైన నాయకుల బృందమే మోదీకి ప్రత్యామ్నాయమని, వారిలో ఎవరిని ప్రధానిగా ఎన్నుకుంటారని తర్వాత ఆలోచించాల్సిన విషయమని అభిప్రాయపడ్డారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	41.3	27.3
ఆదిలాబాద్	41.3	24.4
రామగుండం	39.4	26.2

అక్షయ పాత్ర @ 400 కోట్ల భోజనాలు

ఐక్యరాజ్యసమితి, ఏప్రిల్ 3: అక్షయపాత్ర ఫౌండేషన్ మరో ఘనతను సాధించింది. 400 కోట్ల భోజనాలను అందించి చరిత్రాత్మక మైలురాయిని సాధించింది. ఇందుకు సంబంధించిన కార్యక్రమానికి న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం వేదికగా మారింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత కమిషన్ 'ఆహార భద్రతలో విజయాలు: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా భారత్ ముందడుగు' పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఎన్ఆర్ నారాయణ మూర్తి, నోబెల్ అవార్డు గ్రహీత కైలాష్ సత్యార్థి, అక్షయపాత్ర ఫౌండేషన్ చైర్మన్ మధు పండిట్ దాస పాల్గొన్నారు. 4వందల కోట్ల మందికి ఆహారాన్ని అందించిన సందర్భంగా అక్షయ పాత్ర ఫౌండేషన్ బృందాన్ని ప్రధాని మోదీ ప్రత్యేక సందేశం ద్వారా అభినందించారు. ఈ సందేశాన్ని ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి సీనియర్ దౌత్యవేత్త రుచిరా కాంబోజ్ చదివి వినిపించారు. భారత ఎన్జీవో సంస్థ అయిన అక్షయ పాత్ర ప్రస్తుతం దేశంలోని 72 కిచెన్‌లను కలిగి ఉంది. గత 24 ఏళ్లుగా 24వేల పాఠశాలల్లో ప్రతి రోజు 21 లక్షల మందికి ఆహారాన్ని అందిస్తోంది.

బైడెన్ వర్సెస్ జిన్ పింగ్

ఫోన్‌లో అమెరికా, చైనా అధ్యక్షుల సంవాదం

హైటెక్ టెక్నాలజీ గురించి మాటల తూటాలు

వాషింగ్టన్, ఏప్రిల్ 3: టిక్‌టాక్‌పై చర్యల నుంచి తైవాన్ వరకు.. రష్యాకు సాయం నుంచి హైటెక్ టెక్నాలజీ వరకు.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ మధ్య సంవాదం సాగింది. ఫోన్‌లో ఇరు దేశాధినేతలు దాదాపు రెండు గంటల పాటు వాదులాడుకున్నారు. నవంబరులో కాలిఫోర్నియాలో జరిగిన శిఖరాగ్ర సదస్సు తర్వాత వీరిద్దరి మధ్య ఇదే తొలి సంభాషణ. అత్యంత వాడివేడిగా సాగిన మాటల సమరం ఓ దశలో పరస్పర హెచ్చరికల వరకూ వెళ్లింది. చైనాకు అత్యాధునిక సాంకేతిక ఉత్పత్తుల అమ్మకంపై బైడెన్ ప్రభుత్వం నిషేధం విధించడాన్ని జిన్ పింగ్ తీవ్రంగా ఆక్షేపించారు. ఇది ఆర్థిక ముప్పును పెంచే విధానం అని మండిపడ్డారు. ఈ రంగంలో తమను అణచివేసేందుకు, హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తే సహించబోమని స్పష్టం చేశారు. తైవాన్ విషయంలో గీత దాటొద్దని హెచ్చరించారు. కాగా, జిన్ పింగ్ వ్యాఖ్యలకు బైడెన్ అంతే తీవ్రంగా స్పందించారు. ఆధునిక టెక్నాలజీ తమ భద్రతకు ముప్పుగా మారితే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. తమ పౌరుల డేటా పరిరక్షణ అన్నిటికంటే ముఖ్యమని.. టిక్‌టాక్‌పై చర్యల విషయంలో వెనక్కు తగ్గేది లేదని ప్రకటించారు. మే 20న తైవాన్ అధ్యక్షుడి బాధ్యతల సందర్భంగా శాంతి-సుస్థిరతలను కాపాడాలని సూచించారు. అంతేగాక.. రష్యాకు చైనా సైనిక, పారిశ్రామిక సాయంపై బైడెన్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. డ్రాగన్ వైఖరి యావత్ యూరప్‌నకే ముప్పుగా పరిణమిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

తైవాన్‌లో భారీ భూకంపం

తొమ్మిది మంది దుర్మరణం.. వెయ్యి మందికి పైగా గాయాలు



భూకంపం ప్రభావంతో ఒరిగిపోయిన భారీ భవనాలు

తైపీ, ఏప్రిల్ 3: ద్వీపదేశం తైవాన్‌ను భారీ భూకంపం అతలాకుతలం చేసింది. తైవాన్ కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 8 గంటలకు సంభవించిన ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.2గా నమోదైంది. 1999 తర్వాత ఇదే అతిపెద్ద భూకంపం అని తైవాన్ వాతావరణ శాఖ తెలిపింది. హువాలియన్ తీరంలో తీవ్ర నష్టం సంభవించిందని.. తొమ్మిది మంది చనిపోగా, వెయ్యి మందికి పైగా గాయపడ్డారని, మరో 127 మంది శిథిలాల కింద చిక్కుకున్నారని వివరించింది. భూకంపం కారణంగా తైవాన్ తూర్పు జిల్లాల్లో రాకపోకలు స్తంభించిపోయాయి. కొండచరియలు విరిగిపడి ఏకంగా ఓ భారీ బ్రిడ్జి కూలిపోయింది. ఓ వంతెనపై భారీగా వాహనాలు నిలిచిపోవడం.. ఆ బ్రిడ్జ్ ఊగుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరలైంది. హువాలియన్ నగరంలో 26 ఇళ్లు కూలిపోయాయని, రెండు భవనాలు పక్కకు ఒరిగిపోయాయని తైవాన్ అగ్నిమాపక శాఖ వెల్లడించింది. శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోయారని, "మృతుల్లో కాలినడకన వెళ్తున్న వారు ముగ్గురు ఉన్నారు. మరో ఇద్దరు రోడ్డు టన్నెల్స్ పెచ్చులు కూలి చనిపోయారు. టారోకో నేషనల్ పార్క్ వద్ద ముగ్గురు పర్యాటకులు, పార్క్‌కు చెందిన ఓ వ్యాన్ డ్రైవర్ ఉన్నారు" అని పేర్కొంది. తూర్పు జిల్లాల్లో భూకంప తీవ్రత 7.2గా ఉండగా.. భూకంప కేంద్రం (హువాలియన్ కౌంటీ) వద్ద 6గా నమోదైనట్లు వాతావరణ శాఖ వివరించింది. తైవాన్ వ్యాప్తంగా భూమి కంపించిందని తెలిపింది. దేశవ్యాప్తంగా రైళ్ల సేవలను నిలిపివేశామని, సబ్‌వేలను మూసివేశామని వెల్లడించింది. భూకంప ప్రభావం పొరుగు దీవుల్లోనూ కనిపించిందని తైవాన్ భూకంప కేంద్రం డైరెక్టర్ వూచియెన్‌ఫూ వెల్లడించారు. "1999లో 7.6 తీవ్రతతో భూకంపం సంభవించింది. అప్పట్లో 2,400 మంది మృతిచెందారు. తాజా భూకంపం 30 సెకన్లపాటు కొనసాగింది" అని వివరించారు. భూకంప కేంద్రానికి నైరుతిలో ఉన్న ఫిలిప్పైన్స్, జపాన్‌లకు సునామీ హెచ్చరికలు జారీ అయినట్లు.. ఆ తర్వాత వాటిని ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు. సునామీ హెచ్చరికల నేపథ్యంలో ఒకనావా విమానాశ్రయంలో విమానాల రాకపోకలను నిలిపివేసినట్లు జపాన్ వివరించింది. అటు ఫిలిప్పైన్స్‌లోనూ తీరప్రాంతాల వారిని ఖాళీ చేయించినట్లు అక్కడి ప్రభుత్వం తెలిపింది. చైనా కూడా 23 ప్రావిన్సుల్లో ప్రజలు ఎత్తైన ప్రదేశాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది.

భూకంప ప్రమాదం ఎక్కువ


తైవాన్‌కు భూకంప ప్రమాదం ఎక్కువ అని నిపుణులు తెలిపారు. హువాలియన్-హువాడాంగ్ రిఫ్ట్‌వ్యాలీ మధ్య భూకంపాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇందుక్కారణం.. యురేషిన్ ఫలకం, ఫిలిప్పైన్స్ ఫలకంలో కదలికలని పేర్కొన్నారు. ఫిలిప్పైన్స్ ఫలకం వాయవ్యం వైపు ఏడాదికి 8 సెంటీమీటర్ల చొప్పున కదులుతూ.. యురేషియన్ ప్లేట్‌లో కలుస్తుందని వివరించారు. ఈ కారణాల వల్లే తైవాన్ వ్యాప్తంగా స్కూలు విద్యార్థులకు భూకంపాలపై అవగాహన ఉంటుంది. స్కూళ్లలో పసుపు రంగు హెల్మెట్లు అందుబాటులో ఉంటాయి. బుధవారం ఉదయం కూడా భూమి కంపించగానే.. తైవాన్ వ్యాప్తంగా స్కూళ్లలో ఉన్న విద్యార్థులు.. పసుపురంగు హెల్మెట్లు ధరించి, బయటకు పరుగులు తీశారు.

ఆప్‌ను నేలమట్టం చేసే కుట్ర

ఎన్నికలకు ముందే ఆ పని చేయాలని కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు

» ఢిల్లీ హైకోర్టులో అభిషేక్ సింఘ్వీ వాదనలు

» తీర్పు రిజర్వు చేసిన న్యాయమూర్తి



బుధవారం తిహాడ్ జైలు నుంచి బయటకు వస్తున్న ఆప్ నేత సంజయ్‌సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ముందే ఆమ్ ఆద్మీ పార్టీని (ఆప్‌ను) నేలమట్టం చేయాలనే దురుద్దేశంతోనే తనను అరెస్టు చేశారని ఆ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తెలిపారు. అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో బుధవారం సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. కేజ్రీవాల్ పిటిషన్‌ను ఈడీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీర్పును రిజర్వు చేశారు. అంతకుముందు కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఆప్‌ను సర్వనాశనం చేసి ఢిల్లీలోని ఏడు లోక్‌సభ సీట్లలో విజయం సాధించాలనే లక్ష్యంలో భాగంగానే కేజ్రీవాల్‌ను కేంద్రంలోని బీజేపీ సర్కార్ అరెస్టు చేయించిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఒక పార్టీ అధినేతను, సీఎంను అరెస్టు చేయడం సరైంది కాదని, ఎన్నికల్లో అందరికీ సమానావకాశాలు కల్పించాలనే ప్రజాస్వామ్య మూలసూత్రాలను ఇది కాలరాస్తుందని సింఘ్వీ చెప్పారు. 'ఈ కేసులో ఈడీ 2022 ఆగస్టు నుంచి దర్యాప్తు జరుపుతోంది.. ఏడాదిన్నర దాటిన తర్వాత ఇప్పుడు ఎన్నికల తరుణంలోనే కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేయాలి? ఆయనేమీ దేశాన్ని వదిలి పారిపోవడం లేదు కదా?' అని వాదించారు. మాగుంట రాఘవరెడ్డి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శరత్‌రెడ్డిలపై ఒత్తిడి తెచ్చి కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ప్రకటనలు ఇప్పించారన్నారు. ఈ కేసులో అప్రూవర్లుగా మారిన వారిలో ఇద్దరికి బీజేపీతో ప్రత్యక్ష సంబంధాలున్నాయని, ఒకరు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అభిషేక్ సింఘ్వీ తెలిపారు. ఈడీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. కేజ్రీవాల్ ఢిల్లీ మద్యం కేసులో ప్రధాన కుట్రదారని, ఆయన మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు సాక్ష్యాలు ఉన్నాయన్నారు. ఒక రాజకీయ నాయకుడు ఎన్నికల ముందు హత్య చేసి తనను అరెస్టు చేయకూడదంటే అంగీకరిస్తామా అని వాదించారు. ఇదిలా ఉండగా, అరెస్టు అనంతరం కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తున్నదని, ఆయన ఇప్పటికే 4.5 కిలోల బరువు తగ్గిపోయారని ఆప్ ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు, తనకు బీజేపీలో చేరాలని ఆఫర్ వచ్చిందన్న ఢిల్లీ మంత్రి ఆతిషీ ఆరోపణలపై బీజేపీ పరువునష్టం నోటీసులు పంపించింది.

తమిళనాట త్రిముఖ పోరు

(చెన్నై-ఆంధ్రజ్యోతి)



సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాట త్రిముఖ పోటీ నెలకొంది. డీఎంకే నేతృత్వంలోని ఇండియా కూటమి, అన్నాడీఎంకే కూటమి, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి పోరుకు సిద్ధమయ్యాయి. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీపీఐ, ఎండీఎంకే, డీపీఐ, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్, కొంగునాడు మక్కల్ దేశీయ కళగం, నటుడు కమల్‌హాసన్ నేతృత్వంలోని మక్కల్ నీదిమయ్యం పార్టీలు ఉండగా, అన్నాడీఎంకే కూటమిలో దివంగత నటుడు విజయకాంత్ స్థాపించిన డీఎండీకే, ఎస్డీపీఐ, పురట్చిభారతం, మనిద నేయ మక్కల్ కట్చి, ఉళవర్ ఉళప్పాళర్ కట్చి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ వంటి చిన్నాచితకా పార్టీలు విఁగిలాయి. ఇక ఎన్డీఏ కూటమిలో పీఎంకే, కేంద్ర మాజీ మంత్రి జీకే వాసన్ నేతృత్వంలోని తమిళమానిల కాంగ్రెస్ (టీఎంసీ), శశికళ సమీప బంధువు టీటీవీ దినకరన్ నేతృత్వంలోని 'అమ్మా మక్కల్ మున్నేట్రకళగం, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం వర్గం తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. గత పార్లమెంటు ఎన్నికల్లో తమిళనాడులోని 39 స్థానాలకు గాను 38 సీట్లు సొంతం చేసుకున్న డీఎంకే నేతృత్వంలోని కూటమి ఈసారి కూడా అదే ప్రాభవాన్ని చాటేందుకు కదనోత్సాహంతో అడుగులు వేస్తోంది. ముందుగానే పొత్తులు ఖరారు కావడం, పాత స్నేహితులే ఈసారీ జట్టులో నిలవడం, సంప్రదాయ ఓటు బ్యాంకు తదితరాలు కూటమికి బలంగా మారాయి. దీనికి తోడు స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా అవలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమకు విజయం సాధించిపెడతాయని ఆ కూటమి నేతలు గట్టిగా భావిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో మొత్తం 39 స్థానాలు సాధించుకుంటామని ఆ కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇండియా కూటమిలో డీఎంకే 21, కాంగ్రెస్ తొమ్మిది, సీపీఎం, సీపీఐ, డీపీఐ రెండు స్థానాలు చొప్పున, ఎండీఎంకే, ఐయూఎంఎల్, కొంగునాడు మక్కల్ దేశీయ కళగం ఒక్కోచోట పోటీ చేస్తున్నాయి.

పళనిస్వామి సుడిగాలి పర్యటనలు

ఎన్నికల వ్యూహరచనలో ఎప్పుడూ ముందుండే అన్నాడీఎంకే ఈసారి కాస్త డీలా పడినట్లు కనిపిస్తోంది. పొత్తులు, సీట్ల సర్దుబాటు కాస్త ఆలస్యంగా ముగించిన ఆ పార్టీ అధినేత పళనిస్వామి.. వెంటనే వేగం పుంజుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తమకున్న సంప్రదాయ ఓటు బ్యాంకు ఈసారి అండగా నిలుస్తుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీనికితోడు దివంగత నటుడు విజయకాంత్ స్థాపించిన డీఎండీకే పార్టీతో పొత్తు అన్నాడీఎంకేకు ప్లస్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత ప్రజల్లో విపరీతమైన అంచనాలను పెంచుకున్న స్టాలిన్.. ఆ మేరకు వాటిని అందుకోలేకపోతున్నారన్న భావన బలపడుతోంది. దీనికి తోడు వరుసగా మంత్రులు అవినీతి కేసుల్లో ఇరుక్కుపోవడం, ప్రభుత్వానికీ అవినీతి మకిలి అంటుతున్నట్లు జరుగుతున్న ప్రచారం తమకు ఓట్లు సాధించిపెడతాయని అన్నాడీఎంకే నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఈ కూటమిలో అన్నాడీఎంకే 32, డీఎండీకే ఐదు, పుదియ తమిళగం, ఎస్డీపీఐ ఒక్కోస్థానంలో పోటీ చేస్తున్నాయి.

తమిళనాడుపై మోదీ ప్రత్యేక దృష్టి

వన్నియార్ల సామాజికవర్గంలో గణనీయ ఓటు బ్యాంకు కలిగిన పీఎంకేను జత చేర్చుకుని, జోష్‌లో కనిపిస్తున్న బీజేపీ.. ఈసారి ఎన్నో కొన్ని స్థానాలు సంపాదించుకోవడంతో పాటు ఓట్ల శాతం పెంచుకోవాలని పట్టుదలగా ఉంది. ముఖ్యంగా ప్రధాని మోదీ తమిళనాడుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే తమిళనాడులో అనేకసార్లు పర్యటించిన ప్రధాని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. దేశంలో ఏ రాష్ట్రానికీ ఇవ్వనన్ని నిధులను తమిళనాడుకు ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. తాజాగా, కచ్చతీవు అంశాన్ని లేవనెత్తి తమిళుల్లో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు.

సుర్రుమనిపోద్ది జరభద్రం!

- రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో నిప్పులు చెరగనున్న సూరీడు
- గురు, శుక్రవారాల్లో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు మినహాయింపు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోతున్నాయి. రాబోయే నాలుగు రోజుల్లో ఈ తీవ్రత మరింతగా ఉండబోతుందని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం బుధవారం హెచ్చరించింది. పగటి ఉష్ణోగ్రతలు మరో 2-3డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల దాకా నమోదవుతుండగా తాజా హెచ్చరికల నేపథ్యంలో అవి 45 డిగ్రీలకు చేరే అవకాశం కనిపిస్తోంది. హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్ మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు గురు, శుక్రవారాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40-44 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉంది. ఇక, రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లా నిడమనూరులో బుధవారం 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అదే జిల్లా టిక్యా తండాలో, జోగుళాంబ గద్వాల జిల్లా ధారూర్‌లో, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైనాలో 43.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డు అయ్యింది. వనపర్తి జిల్లా పెబ్బేరులో 43.3, నల్లగొండ జిల్లా నాంపల్లిలో 43.2, తిరుమలగిరి సాగర్‌లో 43.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో 43.2, అలంపూర్‌లో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇవే కాక రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో బుధవారం 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


నల్లగొండలో గొడుగు నీడలో కూర్చుని కుండలు విక్రయిస్తున్న మహిళ

నెమళ్ల మృత్యువాత

వేసవి తాపమో.. విష ప్రయోగమో తెలియదు కానీ హనుమకొండ జిల్లా కాజీపేట మండలం కొత్తపల్లి (హవేలీ)శివారులోని రామప్పగుట్ట వద్ద బుధవారం ఏడు నెమళ్లు చచ్చి పడి ఉన్నాయి. నెమళ్ల కళేబరాలను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులతో కలిసి ఘటనాస్థలిని పరిశీలించిన అటవీశాఖ అధికారులు నెమళ్ల మరణానికి కారణాన్ని ఆరా తీస్తున్నారు.

మందకు దూరమై.. వెర్రెత్తింది!

- మిర్చితోటలోకి ఏనుగు.. అడ్డుకోబోయిన రైతు
- ఏనుగు దాడిలో అక్కడికక్కడే రైతు మృతి
- ఆసిఫాబాద్ జిల్లా బూరెపల్లిలో ఘటన

10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన మంత్రి



దాడి చేసిన ఏనుగు ఇదే

చింతలమానేపల్లి, ఏప్రిల్ 3 : మంద నుంచి విడిపోయిన ఏనుగు దారి తప్పింది... తోటి వాటి కోసం వెతుకుతూ వెర్రెత్తింది... ప్రాణహిత నది దాటి మిర్చి తోటలోకి వచ్చింది... అదిలించబోయిన రైతును కాళ్లతో తొక్కి చంపింది. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో చోటు చేసుకున్న ఈ దుర్ఘటనలో ఆ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. చింతలమానేపల్లి మండలంలోని బూరెపల్లిలో బుధవారం ఈ ఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన చింతలమానేపల్లి అటవీ ప్రాంతం నుంచి బూరెపల్లి గ్రామ శివారులోకి వచ్చిన ఏనుగు అక్కడే ఉన్న మిర్చి తోటలోకి ప్రవేశించింది. ఆ సమయంలో అల్లూరి శంకర్(56) అనే రైతు, అతడి భార్య అక్కడ పనుల్లో ఉన్నారు. ఏనుగును గమనించిన శంకర్ దాన్ని తరిమేందుకు ప్రయత్నించగా అతడిపై దాడి చేసింది. కాళ్లతో తొక్కగా తీవ్రగాయాలైన శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. శంకర్ భార్య విషయం గ్రామస్థులకు చెప్పడంతో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పోలీసులు, అటవీశాఖ అధికారులూ చేరుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లాలో ఇటువంటి ఘటన జరగడం ఇదే తొలిసారి. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ... తెలంగాణలో ఏనుగుల సంచారం లేదన్నారు. ప్రాణహిత నదికి అవతలవైపు మహారాష్ట్రలోని గడ్చరోలి జిల్లాలో 70 నుంచి 75 ఏనుగుల మంద సంచరిస్తోందని తెలిపారు. వీటిలో ఒక మగ ఏనుగు దారి తప్పి నది దాటి ఇవతలికి వచ్చిందని వెల్లడించారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ శంకర్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

సాగర్‌పై కేంద్రమే తేల్చాలి!

ఏం చేయాలో చెప్పాలని కృష్ణాబోర్డు లేఖ.. 4న త్రిసభ్య కమిటీ భేటీ.. రాలేమన్న తెలుగు రాష్ట్రాలు

- 8వ తేదీ నుంచి 5 టీఎంసీలు ఇవ్వాలని కోరిన ఏపీ
- ఎడమకాల్వ నుంచి నీటిని విడుదల చేసిన తెలంగాణ
- నిలిపివేయాలని తెలంగాణను కోరిన కృష్ణా బోర్డు



హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య నాగార్జునసాగర్ జలవివాదం ముదురుతోంది. సాగర్ నీటి కోసం రెండు రాష్ట్రాల మధ్య రోజూ జగడం జరుగుతుండటంతో ఈ వివాదంపై ఏం చర్యలు తీసుకోవాలో చెప్పాలంటూ కృష్ణా బోర్డు.. కేంద్ర జలశక్తి శాఖను కోరింది. మరోవైపు ఈ సీజన్‌లో నాలుగో విడతలో 5 టీఎంసీల నీటిని ఈ నెల 8వ తేదీ నుంచి సాగర్ కుడికాలువ ద్వారా తరలించేందుకు అవకాశం ఇవ్వాలని కృష్ణా బోర్డును ఏపీ సర్కారు కోరింది. దాంతోపాటు కుడి కాలువపై సీఆర్‌పీఎఫ్‌ను మోహరించాలని బోర్డుకు నివేదించింది. ఇదిలా ఉండగా.. నాగార్జునసాగర్ ఎడమకాల్వ కింద నీటి అవసరాలు తీర్చడానికి వీలుగా తెలంగాణ ప్రభుత్వం నీటిని విడుదల చేస్తోంది. ఇలా.. నీటిని విడుదల చేయాలని ఏపీ కోరడం, తెలంగాణ ఇప్పటికే నీటిని విడుదల చేస్తుండటంతో దీనిపై చర్చించడానికి వీలుగా ఈ నెల 4న త్రిసభ్య కమిటీ (బోర్డు సభ్యకార్యదర్శి, తెలంగాణ, ఏపీ ఈఎన్‌సీలతో) సమావేశం నిర్వహించాలని కృష్ణా బోర్డు నిర్ణయించింది. అయితే ఆ సమావేశానికి తాము రాలేమంటూ ఇటు తెలంగాణతోపాటు అటు ఏపీ కూడా బోర్డుకు లేఖ రాశాయి. దాంతో చేసేదేమీ లేక బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ బుధవారం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. మరోవైపు తెలంగాణకూ లేఖ రాస్తూ.. ఇప్పటికే రెండు జలాశయాల నుంచి పరిమితికి మించి నీటిని తరలించారని, ఇక ముందు తీసుకెళ్లరాదని పేర్కొన్నారు.

సాగర్ కింద క్రాప్ హాలీడే ప్రకటించినా..

నాగార్జునసాగర్ పూర్తిస్థాయి సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా... రిజర్వాయర్‌లో ప్రస్తుతం 136.47 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీకి ఎగువన 12 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. వాస్తవానికి ఈ సీజన్‌లో సాగర్ కింద క్రాప్ హాలీడేను గత ప్రభుత్వం ప్రకటించింది. జలాశయాలకు ఇన్‌ఫ్లో లేకపోవడంతో పంటలకు నీళ్లివ్వరాదని నిర్ణయించింది. అయినప్పటికీ కొద్దిమంది రైతులు పంటలు వేసుకోవడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. పంటలకు నీళ్లిచ్చే అవకాశాలు లేకపోయినా.. తాజా పరిణామాలతో నీటిని అనివార్యంగా విడుదల చేయాల్సిన పరిస్థితి. వాస్తవానికి సాగర్ ప్రధాన డ్యామ్(రెండు వైపులా) సీఆర్‌పీఎఫ్(కృష్ణా బోర్డు) నియంత్రణలో ఉంది. కుడి కాలువ కూడా సీఆర్‌పీఎఫ్ పరిధిలోనే ఉంది. ఎడమ కాలువ మాత్రం తెలంగాణ నియంత్రణలో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో బోర్డు నియంత్రణలో లేకపోవడం, నీటి విడుదలపై తెలుగు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతోనే ఈ సమస్యను బోర్డు కేంద్రానికి నివేదించినట్లు సమాచారం.

వివాదం లేనప్పటికీ..

2023-24 వాటర్ ఇయర్‌లో కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లోలు పూర్తిస్థాయిలో తగ్గిపోయాయి. దాంతో సాగర్, శ్రీశైలం రిజర్వాయర్‌లలో 2023 సెప్టెంబరు 30వ తేదీ నాటికి 80 టీఎంసీల నీటి లభ్యత ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో 2023 అక్టోబరులో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో 45 టీఎంసీలు ఏపీ (శ్రీశైలం నుంచి 30 టీఎంసీలు, సాగర్ నుంచి 15 టీఎంసీలు), తెలంగాణ 35 టీఎంసీలు పంచుకోవడానికి నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు ఏపీ.. శ్రీశైలం నుంచి 26.98 టీఎంసీలు, సాగర్ నుంచి 15.477 టీఎంసీలు ఇప్పటికే తీసుకుంది. 45 టీఎంసీలకు గాను 42.457 టీఎంసీలు వాడుకుంది. తెలంగాణ మాత్రం శ్రీశైలం నుంచి 17.60 టీఎంసీలు, సాగర్ నుంచి 24.791 టీఎంసీలు కలిపి 42.391 టీఎంసీల నీటిని తరలించింది. దీంతో తెలంగాణ ఇప్పటికే 7.391 టీఎంసీలు అదనంగా తీసుకుందని ఏపీ వాదిస్తోంది. కాగా, ఏపీకి మరో 2.543 టీఎంసీల నీటిని సాగర్ నుంచి తీసుకెళ్లడానికి అవకాశం ఉంది. ఏపీ విజ్ఞప్తి మేరకు 5 టీఎంసీలు ఇచ్చినా.. తెలంగాణకు 7 టీఎంసీల దాకా నీళ్లు మిగిలి ఉండే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాలు సామరస్యంగా కూర్చొని మాట్లాడుకుంటే వివాదమే ఉండదని బోర్డు అధికారులు గుర్తు చేస్తున్నారు.

8 నుంచి కృష్ణా ట్రైబ్యునల్ విచారణ

కృష్ణా జలాలను రాష్ట్రాల వారీగా పంచడానికి వీలుగా ఈ నెల 8 నుంచి 10 వరకు జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ (కృష్ణా ట్రైబ్యునల్-2) విచారణ జరగనుంది. కృష్ణా జలాలను అంతరాష్ట్ర నదీ జలాల వివాద చట్టం-1956లోని సెక్షన్-3 ప్రకారం తెలుగు రాష్ట్రాలకు పంచడానికి వీలుగా జారీ చేసిన విచారణ విధి విధానాల (టీవోఆర్)ను నిలుపుదల చేయాలని కోరుతూ ఏపీ చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ కేసులో తదుపరి విచారణను మే 8వ తేదీకి వాయిదా వేసింది. దాంతో కృష్ణా ట్రైబ్యునల్-2 పాత షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8 నుంచి 10 దాకా విచారణ జరగనుంది. కాగా, నీటిపారుదలశాఖలో అంతరాష్ట్ర వ్యవహారాలు చూసే విభాగం ఎస్ఈగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సల్లా విజయకుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇంతకు ముందు ఆ పదవిలో ఉన్న ఆర్.కోటేశ్వరరావు మార్చి 31 నుంచి విధులకు హాజరుకాలేనని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశారు. దీంతో ఆయన స్థానంలో విజయకుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం ఉత్తర్వులిచ్చారు.

తాగునీటి ట్యాంకులో 30 కోతుల కళేబరాలు

(మొదటి పేజీ తరువాయి)

బయటపడింది. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ మునిసిపాలిటీ పరిధి విజయవిహార్ కాలనీ 1వ వార్డు విజయ్ విహార్ పక్కన 5 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు ఉంది. దీని ద్వారా సుమారు 150 ఇళ్లకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే, పది రోజులుగా కుళాయి నీటిలో వెంట్రుకలు, చిన్న చిన్న మాంసపు ముక్కలు వస్తున్నాయి. బుధవారం కొంతమంది యువకులు ట్యాంకు వద్దకు వెళ్లి చూడగా పైన మూత తొలగించి ఉంది. లోపల 30 వరకు కోతుల కళేబరాలు తేలుతున్నాయి. దీనిపై మునిసిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. కళేబరాలను తొలగించేందుకు మునిసిపల్ సిబ్బంది రాగా, ట్యాంకు వద్ద ఉన్న ఇంకొన్ని కోతులు దాడి చేసేందుకు ఎగబడ్డాయి. కొద్దిసేపటికి కోతులు వెళ్లిపోగా.. ట్యాంకులోని కళేబరాలను బయటకు తీశారు.

పైకి వచ్చే మార్గం లేక

నాగార్జునసాగర్ మునిసిపల్ పరిధి 12 వార్డుల్లో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులతో పాటు, 12 మినీ ట్యాంకులున్నాయి. మినీ ట్యాంకులపై ఐరన్ షీట్స్ ఉంటాయి. 1వ వార్డులోని మినీ ట్యాంకుపై రేకులు గాలికి ఎగిరిపోయాయి. 10 రోజుల క్రితం అటుగా వచ్చిన కోతులు అందులోని నీరు తాగేందుకు దిగి పైకి రాలేకపోయాయి. కాగా, మునిసిపల్ సిబ్బంది నిచ్చెన వేసుకుని ట్యాంకు లోపలకు దిగి కళేబరాలను బయటకు తీశారు. నీటిని ఖాళీ చేశారు. కాగా, ట్యాంకులను సాగర్ వాటర్ సప్లయ్ విభాగం సిబ్బంది నెల రోజులకు ఒకసారి బ్లీచింగ్‌తో శుభ్రం చేయించాల్సి ఉంది. కానీ, ఆరు నెలలకొకసారి కొద్దిపాటి పనులతో సరిపెడుతున్నారు. కాగా, విజయవిహార్ 5వ వార్డులోనే మూడేళ్ల కిందట ట్యాంకులో పడి 15 కోతులు చనిపోయాయి. అప్పట్లోనూ ఎవరి నుంచి కూడా ఆరోగ్య ఫిర్యాదులు రాలేదు.


ట్యాంకు నుంచి కళేబరాలను బయటకు తీస్తున్న మునిసిపల్ సిబ్బంది

స్థానికుల భయాందోళన..

కలుషిత నీటిని 10 రోజుల నుంచి వాడామని తెలియడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సాగర్ ఏరియా ఆస్పత్రి సీఎంవో భానుప్రసాద్ వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. కలుషిత నీటి బాధితులు ఎవరూ ఆస్పత్రికి రాలేదని చెప్పారు. ఎవరైనా అస్వస్థతులైతే పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాగా, నందికొండ హిల్ కాలనీలో 2 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకులు 2, వెయ్యి లీటర్ల సామర్థ్యం ఉన్న ఒక ట్యాంకు ఉన్నాయని సాగర్ ఎస్ఈ నాగేశ్వరరావు చెప్పారు. కోతులు చనిపోయిన ట్యాంకు వేరుగా ఉందన్నారు. 3 రోజులుగా దీన్నుంచి నీటి సరఫరా లేదని పేర్కొన్నారు. హిల్ కాలనీ ప్రధాన ఇళ్లకు తాగు నీరు సరఫరా చేసే ట్యాంకులకు, దీనికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కోతులు చనిపోయిన ట్యాంక్‌ను పూర్తిగా శుభ్రం చేశాకనే నీటిని విడుదల చేస్తామన్నారు.

రియాక్టర్లు బద్దలై.. శరీరాలు ఛిద్రమై

(మొదటి పేజీ తరువాయి)

అలుముకుంది. ఈ ఘటనలో పరిశ్రమ డైరెక్టర్, వ్యవస్థాపక యజమానుల్లో ఒకరైన రవికుమార్(45), ప్రొడక్షన్ ఇన్‌చార్జులు సుబ్రమణ్యం(38), దయానంద్(46), మెయింటెనెన్స్ మేనేజర్ సురేశ్‌పాల్(45), చాకలి సురేశ్(35) అక్కడికక్కడే మృతిచెందారు. రవికుమార్ ఏపీలోని గుంటూరు జిల్లా గురజాలకు, సురేశ్‌పాల్ మధ్యప్రదేశ్‌కు, దయానంద్ తమిళనాడుకు, సుబ్రమణ్యం ఏపీకి చెందినవారు. మరో నలుగురు కార్మికులు కూడా మృతిచెంది ఉంటారని అగ్నిమాపక సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. ఆ పరిసరాల్లో విధులు నిర్వర్తిస్తున్న, విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న 20 మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. మంత్రులిద్దరూ సీఎం రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి, పరిస్థితిని వివరించారు.


ప్రొడక్షన్ ఇన్‌చార్జి సుబ్రమణ్యం (ఫైల్)

మా వాళ్లు క్షేమమేనా..?

ప్రమాదం వార్త తెలియగానే స్థానికులు పెద్ద సంఖ్యలో ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. ఆ పరిశ్రమలో పనిచేసే తమవారి క్షేమ సమాచారం కోసం కన్నీటిపర్యంతం ఆరా తీశారు. ఇక్కడ పనిచేసే కార్మికుల్లో సింహభాగం బిహార్‌కు చెందినవారని తెలుస్తోంది. నలుగురు కార్మికులు గల్లంతయ్యారనే సమాచారం అందడంతో.. "అయ్యా.. మమ్మల్ని లోనికి వెళ్లనివ్వండి. మా వాళ్లు ఎలా ఉన్నారో చూడాలి" అంటూ అక్కడికి వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకోవడం కనిపించింది.

గవర్నర్, సీఎం దిగ్ర్భాంతి

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీ ఆర్గానిక్స్‌లో ప్రమాదం పట్ల గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, సీఎం రేవంత్‌రెడ్డి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని గవర్నర్ ఆదేశించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బీజేపీని ఓడిస్తేనే ప్రజాస్వామ్యానికి మనుగడ

- బీఆర్ఎస్ మాకు పోటీనే కాదు..: ఉత్తమ్
- ఎన్ఆర్‌సీ, సీఏఏ అమలు చేయబోమని ఏ అధికారంతో చెబుతున్నారు?: అరవింద్



సూర్యాపేట టౌన్/పెద్దబజార్ (నిజామాబాద్): దేశ భవిష్యత్తుకు వచ్చే లోక్‌సభ ఎన్నికలు కీలకమని.. బీజేపీని ఓడిస్తేనే ప్రజాస్వామ్యానికి మనుగడ అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ పోటీనే కాదని, ఆ పార్టీకి వచ్చే సీట్లు సున్నా అని జోస్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌కు మనుగడే లేదన్నారు. బుధవారం సూర్యాపేటలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కరువు పేరుతో మాజీ సీఎం కేసీఆర్ రాజకీయ ప్రచారం చేసుకుంటున్నాడని, కరువు ప్రారంభమైందే బీఆర్ఎస్ పాలనలో అని చెప్పారు. ఇటీవల సూర్యాపేటలో మాజీ సీఎం కేసీఆర్ పర్యటనలో జనరేటర్ లోపాన్ని కరెంట్ సరఫరా లోపంగా మాట్లాడటం దారుణమన్నారు. తాము సీఏఏ, ఎన్ఆర్సీని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని.. దానికంటే ముందు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 7,149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మద్దతు ధర కంటే తక్కువకు ఎవరైనా కొనుగోలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్తమ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలి..

రాష్ట్రంలో ఎన్ఆర్సీ, సీఏఏ అమలు చేసేది లేదని మంత్రి ఉత్తమ్ ఏ అధికారంతో చెబుతున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ నిలదీశారు. ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి హోదాలో ఆయన చేసిన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకు వస్తాయని.. ఆయనపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

అకౌంటెంట్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ 8న

హైదరాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అకౌంటెంట్ ఉద్యోగాల నియామకం కోసం టీఎస్‌పీఎస్సీ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులు ఏప్రిల్ 8న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని కమిషన్ తెలిపింది. అభ్యర్థులు నాంపల్లిలోని కమిషన్ కార్యాలయానికి రావాలని పేర్కొంది. ఎంపికైన అభ్యర్థుల వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచామని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకాకపోతే పరిగణనలోకి తీసుకోమని స్పష్టం చేసింది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండే!

- ఉద్యోగులకు దేవాదాయశాఖ కమిషనర్ హెచ్చరిక

బాసర/ హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్ తప్పదని అసిస్టెంట్ కమిషనర్లకు దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు హెచ్చరించారు. దేవాదాయశాఖ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన హనుమంతరావు ఆలయ ఆస్తులు, కోర్టు కేసులతో పాటు పలు ఇతర కీలక అంశాలపై బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఆలయ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసుల్లో నిర్లక్ష్యం వహించినా, ఆలయ ఆస్తులు కాపాడటంలో విఫలమైనా, విధినిర్వహణలో అలసత్వం వహించినా ఏ మాత్రం ఉపేక్షించేది లేదని అధికారులకు కమిషనర్ హెచ్చరించారు. గోపన్‌పల్లి భూములకు సంబంధించి ఇప్పటి వరకు కోర్టు ఆదేశాలు అమలు చేయకపోవడం పట్ల సంబంధిత అధికారులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణకు గురైన భూముల్ని గుర్తించి రెవెన్యూ శాఖ సహకారంతో స్వాధీనం చేసుకోవాలన్నారు. వేసవి సెలవుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీడ, చల్లని తాగునీరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉంటే నిర్మల్ జిల్లా బాసర దేవస్థానంలో కొనుగోళ్లలో జరుగుతున్న అవినీతి అక్రమాలను గురించి ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీంతో దేవాదాయశాఖ కమిషనర్ హన్మంత్‌రావు ప్రత్యేక దృష్టి పెట్టారు. బాసరలో విచారించి అవకతవకలు వెలుగులోకి రావడంతో.. ఇకపై కొత్త కాంట్రాక్టులన్నీ పెండింగ్‌లో ఉంచాలని ఆదేశించారు. కొత్త టెండర్లలో వేసిన ధరలు, మార్కెట్‌లో ఉన్న ధరలను పరిశీలించాకే ఆమోదించాలని నిర్ణయించారు.

'వ్యాట్' లేకుండానే విదేశీ మద్యం తరలింపు!

- ఆబ్కారీ, వాణిజ్య పన్నుల శాఖల మధ్య వివాదం

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న మద్యంపై వ్యాట్ (విలువ ఆధారిత పన్ను) వసూలు చేయకుండా రవాణా జరుగుతుందన్న అంశం ఆబ్కారీ, వాణిజ్య పన్నుల శాఖల మధ్య వివాదానికి తెరదీసింది. గత నెల 30వ తేదీన టీఎస్‌బీసీఎల్ నుంచి ఎస్వీ డిస్ట్రిబ్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ టీఎస్ 07యూఈ3445 వాహనంలో బుల్ డాగ్ లండన్ డ్రైజిన్ అనే దిగుమతి చేసుకున్న విదేశీ మద్యాన్ని టానిక్ మద్యం వ్యాపారుల కోసం డిపో నుంచి తరలిస్తుండగా బోయిన్‌పల్లిలోని బల్‌మరాయి వద్ద వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకున్నారు. వాహనంలో రూ.8,24,044 విలువ చేసే దిగుమతి చేసుకున్న విదేశీ మద్యాన్ని తరలిస్తున్నారని, దీనికి 70 శాతం వ్యాట్ రూ.5,76,839 చెల్లించకుండానే రవాణా చేస్తున్నారని వాహనాన్ని సీజ్ చేశారు. అయితే మద్యం కొనుగోలు చేసే పాయింట్‌లోనే టీఎస్‌బీసీఎల్ వ్యాట్ వసూలు చేస్తుందని, డిపో నుంచి వెళ్తున్న వాహనాలకు ప్రత్యేకంగా ఈ వేబిల్లు ఇవ్వాల్సిన అవసరం లేదని ఎక్సైజ్ శాఖ అధికారులు వాదిస్తుండగా.. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మాత్రం వ్యాట్ చెల్లించకుండా మద్యం రవాణా జరుగుతుందని ఆరోపిస్తున్నారు. ఈ వివాదంలో సీజ్ చేసిన వాహనాన్ని వదిలిపెట్టాలంటూ ఓ మాజీ మంత్రి, ఉన్నతాధికారులు వాణిజ్య పన్నుల శాఖ అధికారులపై ఒత్తిడి చేయడం చర్చనీయాంశమైంది.

పవన్ కల్యాణ్‌కు తీవ్ర జ్వరం!

- తెనాలి, ఉత్తరాంధ్ర పర్యటనలు రద్దు

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తీవ్ర జ్వరం బారిన పడ్డారు. మార్చి 30 నుంచి ఏప్రిల్ 2వ తేదీ సాయంత్రం వరకూ తాను పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. సోమవారం నుంచే జ్వరంతో ఇబ్బందిపడుతున్న ఆయన మంగళవారమూ తన పర్యటనను కొనసాగించారు. బుధవారం నాటికి జ్వరం మరింత తీవ్రం కావడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ వెళ్లారు. ఆయనకు విశ్రాంతి అవసరమని డాక్టర్లు సూచించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పవన్ తన కార్యక్రమాలను రద్దు చేసుకొన్నారు. దీంతో బుధవారం తెనాలిలో జరగాల్సిన వారాహి విజయ భేరి, 4వ తేదీ నుంచి జరగాల్సిన ఉత్తరాంధ్ర పర్యటనలు వాయిదా పడ్డాయి.

ప్రపంచ సమస్యగా మాదకద్రవ్యాల వాడకం

ఎన్డీపీఎస్ కేసుల్లో శిక్షల శాతం పెరగాలి: డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం, వ్యసనం ప్రపంచ సమస్యగా మారిందని డీజీపీ రవిగుప్తా అన్నారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో(టీఎస్ న్యాబ్) ఆధ్వర్యంలో పోలీస్, ఎక్సైజ్, రైల్వే అధికారులు, అడిషనల్, అసిస్టెంట్ పీపీలకు బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్‌లో ఐదు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని డీజీపీ రవిగుప్తా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడికి పోలీస్ శాఖ అవసరమైన అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. ఎక్కడికక్కడ కేసులు నమోదు చేసి నిందితులను అరెస్టు చేస్తున్నామన్నారు. ఎన్డీపీఎస్ కేసుల్లో శిక్షల శాతం తక్కువగా ఉందని, న్యాయస్థానంలో నిందితులకు కఠిన శిక్షపడేలా దర్యాప్తుపై దృష్టి సారించాలని ఆయా విభాగాల అధికారులకు డీజీపీ రవిగుప్తా సూచించారు.

అమెరికా ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్‌లో.. ప్రపంచ చాంపియన్‌గా శ్రీచైతన్య

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్-2024లో శ్రీచైతన్య వరుసగా పదకొండోసారి వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది. ఈ పోటీలో మొత్తం 28కి పైగా దేశాలు పాల్గొనగా అందులో తమ సంస్థ విద్యార్థులు నంబర్ వన్ స్థానంలో నిలిచారని శ్రీచైతన్య డైరెక్టర్ సీమ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కాంటెస్ట్‌లో 3 క్యాష్ అవార్డులను ఎన్ఎస్ఎస్ ప్రకటించగా అందులో 2 అవార్డులను వరుసగా రెండో సంవత్సరం కూడా శ్రీచైతన్య సాధించిందని తెలిపారు. ఇప్పటి వరకు ఈ ఘనతను ఎవరూ సాధించలేదని పేర్కొన్నారు. అలాగే వరల్డ్ ఒకటి, రెండు, మూడు ప్రైజ్‌లలో గానీ, విన్నింగ్ ప్రాజెక్టుల సంఖ్యలో, విజయం సాధించిన విద్యార్థుల సంఖ్యలో, క్యాష్ అవార్డుల్లో గానీ భారతదేశంతోపాటు ప్రపంచంలోనే మరే ఇతర విద్యా సంస్థ తమ సంస్థ ఫలితాలకు దరిదాపుల్లోలేదని ఆమె తెలిపారు. ఈ ఫలితాలే శ్రీ చైతన్య స్కూల్‌ను ప్రపంచంలోనే నంబర్ 1గా నిలిపాయన్నారు.

అమెరికా ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో... 34 ప్రాజెక్టులతో నారాయణ గ్లోబల్ లీడర్

అమెరికా నాసా ప్రోత్సహించిన నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గెరార్డ్ కె. ఓ నీల్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్-2024లో తమ సంస్థ విద్యార్థులు సత్తా చాటారని నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణలు ఓ ప్రకటనలో తెలిపారు. సైన్స్ ప్రాజెక్టుల్లో వరల్డ్ నంబర్ 1 స్థానంలో 2 సెలక్షన్స్ తమ విద్యార్థులు దక్కించుకున్నట్టు పేర్కొన్నారు. ఇండియాలో మరే ఇతర విద్యా సంస్థ ఇలాంటి అరుదైన రికార్డును సాధించలేదన్నారు. ఈ కాంటెస్ట్‌లో మొత్తంగా 34 ప్రాజెక్టుల్లో విజయ కేతనం ఎగురవేసినట్టు తెలిపారు. ఈ ఘన విజయంతో రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ నారాయణ విద్యార్థులు విజయప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతుందని తెలిపారు. గత 11 సంవత్సరాలుగా అద్భుత ఫలితాలను సాధిస్తూ ఇప్పటి వరకు 334కు పైగా ప్రాజెక్టులను గెలుచుకుని వరల్డ్ నంబర్ వన్ స్కూల్‌గా నారాయణ మళ్లీ నిరూపించుకుందని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

హింసావలయం..!

మావోయిస్టులు లేని భారతదేశం ఎంతో దూరంలో లేదంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల ఓ వ్యాఖ్య చేశారు. సాయుధ బలగాలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సందర్భం కనుక, వారిని కర్తవ్యోన్ముఖులను చేసేందుకు ఆయన ఈ మాటలు అనివుంటారు. నానావిధ బలగాలను మోహరించి వామపక్ష తీవ్రవాదంమీద ప్రభుత్వం సాగిస్తున్న పోరు ఆఖరు అంకానికి చేరిందని, కాస్తంత గట్టిగా, ఒక్కసారిగా ఓ తోపు తోస్తే శత్రుశిబిరం పూర్తిగా కుప్పకూలిపోతుందని అమిత్ షా ఆ సందర్భంలో అత్యంత విశ్వాసం ప్రదర్శించారు. హోంమంత్రి చిత్రీకరిస్తున్నంతగా మావోయిస్టులు చితికిపోయారో లేదో తెలియదు కానీ, ఇటీవలి కాలంలో సాయుధబలగాలు ఏకబిగిన సాగిస్తున్న యుద్ధంలో వీరు భారీగా నష్టపోతున్న విషయం కనిపిస్తూనే ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌జిల్లా కొర్చోలీ అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 13మంది మావోయిస్టులు మరణించిన ఘటన ఇటీవలికాలంలో అతి పెద్దది. కుప్పకూలినవారిలో చెప్పుకోదగ్గ స్థాయి నాయకులు ఉన్నారని కూడా అంటున్నారు. వారం క్రితం ఇదే జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు నక్సలైట్లు మరణించిన విషయం తెలిసిందే. మూడునెలల్లోనే యాభైమంది ప్రాణాలు కోల్పోయారన్న లెక్కలు నిజమైతే కేంద్రహోం మంత్రి లక్ష్యానికి అనుగుణంగా అడుగులు వేగంగా పడుతున్నాయని అనుకోవచ్చు.

ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని మావోయిస్టు పార్టీ చేస్తున్న వాదనను పోలీసు అధికారులు ఖండిస్తున్నారు. సంఘటనాస్థలంలో అత్యాధునిక ఆయుధాలను స్వాధీనం చేసుకోవడం, ఇంకా ఏవేవో దొరకడం వంటి ఆనవాయితీలు కూడా పూర్తయ్యాయి. నరేంద్రమోదీ పదేళ్ళపాలనలో మావోయిస్టులు దాదాపుగా తుడిచిపెట్టుకుపోయారని, దేశాభివృద్ధికి, నిర్మాణానికి కట్టుబడిన తమ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చినప్పుడే మిగిలిన ఆ కాస్త పని పూర్తవుతుందని ఇటీవల అమిత్ షా ఛత్తీస్‌గఢ్‌లో అన్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా మావోయిస్టుల ఏరివేత కార్యక్రమం జరుగుతూనే ఉంది. కానీ, ఇటీవలికాలంలో వేర్వేరు పేర్లతో ప్రత్యేక సాయుధ దళాల ఏర్పాటు, హెలిప్యాడ్ల నిర్మాణం, డ్రోన్ల వినియోగం, మావోయిస్టుల ఆధిపత్యం ఉన్న ప్రాంతాలమీద వైమానిక, డ్రోన్ దాడులు ఇత్యాదివి గమనించినప్పుడు శత్రు నిర్మూలన మరింత నిర్దిష్టంగా, వేగంగా జరుగుతున్న విషయం అర్థమవుతుంది. సరిగ్గా మూడేళ్ళక్రితం ఇదే జిల్లాలో సీఆర్‌పీఎఫ్ జవాన్లపై మావోయిస్టులు దాడి చేసి పెద్దసంఖ్యలో వారిని చంపివేసిన విషయం తెలిసిందే. ప్రతీ ఎన్‌కౌంటర్‌తోనూ ఒక ప్రతీకారదాడిముడిపడి ఉండటం, ఈ పరస్పర హింసలో ఇరుపక్షాలకు చెందినవారు పెద్దసంఖ్యలో మరణించడం జరుగుతున్నదే. నక్సలైట్లు తుడిచిపెట్టుకుపోయారని, ఆ ఉద్యమం ముగిసిపోయిందని ఎప్పటికప్పుడు అంటున్నప్పటికీ, ఈ యాభైయేళ్ళకాలంలో అది కొన్ని కొత్తప్రాంతాలకు విస్తరించింది, స్థావరాలు మార్చుకుంటోంది.

మావోయిస్టుల ఉనికికి, ఆదివాసుల్లో వారికి గల ఆదరణకు కారణమైన అంశాలను గుర్తించకుండా, పరిపాలనావైఫల్యాలను సరిదిద్దుకోకుండా భద్రతాబలగాల సాయంతో ఆ ఉద్యమాన్ని అణచివేయాలనుకోవడం ఆశించిన ఫలితాన్నివ్వదు. ఆదివాసుల హక్కులు హరించుకుపోతూ, వారి వనరులు అపరకుబేరుల, కార్పొరేట్ సంస్థల వశమైపోతున్నప్పుడు మావోయిస్టు ఉద్యమానికి స్థానిక ప్రజల సహకారం అందుతూనే ఉంటుంది. వేలాది ఎకరాల అటవీభూమిని అస్మదీయ పారిశ్రామికవేత్తలకు అప్పగిస్తూపోతున్నప్పుడు, ఈ సైనికదాడులూ ఎన్‌కౌంటర్లన్నీ ఆ వనరుల నిరంతర దోపిడీకేనని ఆదివాసులు నమ్మకుండా ఉండరు. ఈ హింసావలయాన్ని ఛేదించడానికి ఇప్పటికైనా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలకు సిద్ధపడటం మంచిది. అడపాదడపా రెండు పక్షాలనుంచి చర్చలకు సానుకూలమైన ప్రకటనలు వస్తున్నప్పటికీ, ఎందుకోగానీ నిర్దిష్టంగా అడుగుముందుకు పడటంలేదు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇటీవల కూడా చర్చలకు సిద్ధమేనని ప్రకటించి, ఆ తరువాత ఆ ఊసే ఎత్తలేదు. లక్షలాదిమంది ఆదివాసీల జీవితాలతో ముడిపడిన అంశం కనుక, పౌరసమాజం పెద్దలు కాస్తంత చొరవతీసుకుంటే సమస్యకు శాంతియుత పరిష్కారమార్గాలు అన్వేషించవచ్చు.

కేసీఆర్ కర్తవ్యం గెలవడం కాదు, మిగలడం!



గెలుపు ఓటములను పక్కనబెట్టి, ఉనికి పోరాటం చేయడమొక్కటే బీఆర్ఎస్ చేయగలిగింది. రంగంలో మిగలడానికి చేసే జీవన్మరణ యుద్ధంలో, ఆ పార్టీకి కావలసింది ఒక గట్టి రాజకీయ ఆయుధం. ఇప్పుడే నిద్రనుంచి మేల్కొన్నట్టు, రైతు ఆత్మహత్యల గురించి మాట్లాడడం వల్ల హేళనలు ఎదుర్కొనడమే తప్ప, ప్రయోజనం ఉండదు. సాధికారంగా, నైతికబలంతో మాట్లాడగలిగే అంశాలను వారు అన్వేషించాలి. ఓడిపోయే ఎన్నికల కోసం ఖర్చు దండగని అనుకోకుండా, భవిష్యత్తు యుద్ధాల కోసం వర్తమానంలో ఆత్మరక్షణ చేసుకోవాలి. బంగారు లక్ష్యం అచ్చిరానప్పుడు, రజతపతకంతో అయినా పోటీలో నిలవాలి.



▪ కె. శ్రీనివాస్

సందర్భం

బీజేపీ అనుబంధ సంస్థ అని భావించే ఉపాధ్యాయ సంఘంలో పనిచేసే ఒక మిత్రుడు ఈ మధ్య తారసపడ్డాడు. 'కేసీయార్‌ను దించవలసి ఉండె కాబట్టి, మా టీచర్లందరూ మొన్న కాంగ్రెస్‌కు ఓటేసిన్రు, ఆ పని అయిపోయింది, ఇప్పుడు అందరూ మోదీనే' అన్నాడు. 'పదీ, పన్నెండు, అంతకు తగ్గవు, చూస్కోండి' అని నమ్మకంగా చెప్పాడు. ఆ సంఘానికి పెద్ద సంఖ్యలో సభ్యత్వాలేమీ లేవు. ఉపాధ్యాయసంఘాల సభ్యులు ఆ సంఘ రాజకీయ అనుబంధాన్ని బట్టి ఓట్లు వేయరని, టీచర్ల లెక్కలు వేరే ఉంటాయని అందరికీ తెలుసు. సంఘాలతో సంబంధం లేకుండా, మొన్నటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో టీచర్లు అత్యధికసంఖ్యలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు చేశారు. తమ పనిపరిస్థితులతో, జీతభత్యాలతో నిమిత్తం లేని లోక్‌సభ ఎన్నికలలో వారి ఎంపికలు ఎట్లా ఉంటాయన్నది ప్రశ్న. మా మిత్రుడి ఉపాధ్యాయపరిషత్తు సభ్యులే కాదు, తక్కిన అన్ని సంఘాల సభ్యులూ, చివరకు వామపక్ష ఉపాధ్యాయ సంఘాల సభ్యులు కూడా మోదీ ప్రభావంలో ఉన్నారేమో తెలియదు. లేకపోతే, పదీ, పన్నెండూ లెక్క ఎట్లా కుదురుతుంది?

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గారన్న దాన్ని తాను కాదనడంలేదని, కానీ, పార్లమెంటు ఎన్నికల విషయానికి వస్తే దేశమంతా మోదీకి అనుకూలంగా ఒకే అభిప్రాయంతో ఉన్నదని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ మధ్య ఒక ఇంగ్లీషు పత్రికతో అన్నారు. జాతీయవాదం ఒక మతంతోను, ఒక నాయకుడితోనూ ముడిపడితే, ఇటువంటి రాజకీయ ప్రభావాలు సహజమే. దేశవ్యాప్త ప్రభావానికి ఎదురుగా మరొక సమస్థాయి జాతీయ ప్రభావాన్ని నిర్మించగలిగే శక్తి ప్రతిపక్ష కూటమికి లేదు. ఇప్పుడు జరుగుతున్న సాధారణ ఎన్నికలలో, ఒక దేశవ్యాప్త రాజకీయ మహాశక్తిని, రాష్ట్రస్థాయి, స్థానిక రాజకీయాల కూటమితో ఎదుర్కొనడానికి ప్రయత్నించడం చూస్తున్నాము. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో ఓటర్లు రాష్ట్ర ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకతను ప్రదర్శించారు. ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నది జాతీయపార్టీయే అయినా, ఎన్నికలు జాతీయ అంశాల ప్రాతిపదికన జరగలేదు. మరి రాష్ట్ర అంశాల ప్రాతిపదిక మీదనే లోక్‌సభ ఎన్నికల పోరాటం సాగేటట్టు కాంగ్రెస్ చేయగలదా? జాతీయ ప్రభావానికి తెలంగాణలో అడ్డుగోడ వేయగలదా?

'పది, మేం గెలిచి తీరతాం' అన్నారు, ఒక కాంగ్రెస్ పెద్ద నాయకుడు. ఆయన మాజీ ఎంపీ, రాహుల్ గాంధీకి దగ్గర కూడా. 'బీజేపీ అంచనాలు ఆరు నుంచి మొదలై పది దాకా పెరుగుతున్నాయి, మీరు పదెట్లా గెలుస్తారు?' అని అడిగాను. 'అసెంబ్లీ లెక్కల ప్రకారం గెలవాలి. బీఆర్ఎస్ పడిపోతున్న తీరును బట్టి చూస్తే కూడా గెలవాలి'– అని ఆయన అన్నారు. అసెంబ్లీ ఎన్నికలలోని విజయోత్సాహంతో కాంగ్రెస్ వాళ్లు ధీమాగా ఉన్నారు కానీ, క్షేత్రస్థాయి పరిస్థితులను నిర్దిష్టంగా చర్చిస్తే, మోదీ ప్రభావం ఎంత ఉన్నదో వాళ్లకు కూడా లెక్క తెలియడం లేదు. చిన్నపట్టణాలలో, జిల్లా కేంద్రాలలో యువకులు, ముఖ్యంగా వెనుకబడిన తరగతుల యువకులు పెద్ద ఎత్తున మోదీకరణ చెందారని అందరూ గుర్తిస్తున్నారు కానీ, అందుకు తమ వద్ద ఉన్న విరుగుడేమిటో వాళ్లు చెప్పడం లేదు, బహుశా వాళ్ల దగ్గర ఏమీ లేదేమో కూడా! డిసెంబర్ విజయం ఇంకా అదేరూపంలో భద్రంగా ఉన్నదని, కొత్తగా జరిగిన చేరికలతో అది మరింత జనబలంగా మారిందని అనుకుంటున్నారు. బాగా ఖర్చు పెట్టగలిగిన ఆసాములను రంగంలోకి దింపితే, ఆ ధనశక్తి కూడా తోడై పది విజయాలు ఖాయమని రాష్ట్ర కాంగ్రెస్ లెక్కలు వేసుకుంటోంది. ఉపన్యాసాలు ఇచ్చి పోవడం తప్ప అధిష్ఠానం చేయగలిగే సాయం ఏమీ లేదు. చిన్నదో పెద్దదో ఒక 'హవా' సృష్టించే ఉద్దేశమూ సామర్థ్యమూ కూడా రాహుల్ బృందంలో కనిపించడం లేదు. చూడాలి, తుక్కుగూడ జనజాతరలో ఒక మందపవనమో మలయ మారుతమో చెలరేగుతుందేమో?

బీఆర్ఎస్ పతనం రేవంత్‌కు కూడా ఆశ్చర్యం కలిగిస్తోందట. 'వాళ్ల పతన వేగాన్ని చూసి ఆయన చాలా డిజప్పాయింట్ అవుతున్నారు' అన్నారు ఆ కాంగ్రెస్ నాయకుడు. ఎన్నికలలో ఓటమి పొందిన బీఆర్ఎస్‌ను ఇప్పట్లో మరి లేవకుండా చేయాలని కాంగ్రెస్ అనుకోవడంలో తప్పులేదు. అందుకు పరిపాలనా పరంగానూ, రాజకీయంగానూ ప్రక్రియలను ప్రారంభించినప్పుడు, వాటి పర్యవసానాల వేగం వారి నియంత్రణలో ఉండకపోవచ్చు. కేసీఆర్ పడిపోతూ, తనను తాను కాంగ్రెస్‌కు దిగువన, బీజేపీకి ఎగువన నిలబడేట్టు, నిగ్రహించుకోవడం సాధ్యమయ్యేపని కాదు. పైగా, ఏదో ఒకటి చేసి, పాతాళంలోకి జారిపోకుండా నిలదొక్కుకోవాలన్న ప్రయత్నమే లేనప్పుడు, ఆ పతన గతిని ఆపలేము. తాను సమకూర్చుకున్న బలగం అంతా వదిలిపెట్టి వెడుతుంటే, అలనాడు భారతంలో స్వర్గారోహణ పర్వంలో ధర్మరాజుకు కలిగినంత నిర్వేదం కేసీఆర్‌కు కలగడంలో ఆశ్చర్యం లేదు. కానీ, నువ్విప్పుడు మూటాముల్లె సర్దుకుని వెళ్లిపోవడం లేదు కదా? రణరంగం మధ్యలో వైరాగ్యం వల్ల ఏమిటి ఉపయోగం? ఇప్పుడు పూనుకుని ప్రజలను పలకరించే పని బాగానే ఉంది కానీ, మిగిలిన కార్యకర్తలకు మనోబలాన్ని ఇచ్చే పనిచేయాలి కదా, ముందు? డబ్బుల్లేవని, సొంతఖర్చు పెట్టుకోవాలని, పోటీచేయడానికి ముందుకువచ్చే అభ్యర్థులను విదిలిస్తే, అది శల్యసారథ్యమే అవుతుంది. ఎంతెంత డబ్బు ఎవరెవరు ఇచ్చారో మొన్ననే కదా ఎలక్షన్ కమిషన్ బయటపెట్టింది?

గెలిచే నమ్మకం లేనప్పుడు ఖర్చు పెట్టుకోవడం ఎందుకని కేసీఆర్ ఆలోచన కావచ్చు. గెలవడానికి కాదు, రెండో స్థానంలో నిలబడడానికే బీఆర్ఎస్ పోరాడాలి. ముగ్గురు ఆటగాళ్లున్న ఈ క్రీడలో కాంస్యపతకం లేదు. పది గెలిచితీరతామని చెబుతున్న కాంగ్రెస్ నేత కూడా రెండోస్థానంలో బీజేపీయే వస్తుందని బెంగపడుతున్నారు. తెలంగాణ రాజకీయరంగం మీద కాంగ్రెస్, బీజేపీ స్థిరపడితే, బీఆర్ఎస్ తెరమరుగు కావడమే జరుగుతుంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో 8 చోట్ల గెలిచిన బీజేపీ మరో 18 స్థానాలలో మాత్రమే రెండో స్థానంలో ఉండింది. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి 103 స్థానాలలో గెలిచి, 99 చోట్ల రెండోస్థానంలో ఉన్నాయి. మొత్తంగా 14 స్థానాలలో మూడోస్థానం లేదా ఆ దిగువన ఉండిపోయిన కాంగ్రెస్, కనీసం తొమ్మిది స్థానాలలో బీఆర్ఎస్, బీజేపీల తరువాతి స్థానాల్లో ఉండింది. అది కారం దక్కలేదనేది వేరే సంగతి కానీ, బీఆర్ఎస్ గౌరవనీయమైన స్థాయిలోనే జన బలాన్ని నమోదుచేసుకున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లే తెలంగాణలోని ప్రధాన ప్రత్యర్థి పక్షాలని తాజా అసెంబ్లీ ఎన్నికలు చాటాయి. లోకసభ ఎన్నికలతో ఈ స్థితి నుంచి పూర్తిగా తారుమారు కానున్నదా?

2018 అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ 7.1 శాతం ఓట్లను, ఒక ఎమ్మెల్యేను గెలుచుకోగలిగింది. 2019 పార్లమెంటు ఎన్నికలలో తన ఓటింగ్ శాతాన్ని అదనంగా 12 శాతం, అంటే 19.45 శాతం ఓట్లకు పెంచుకోగలిగింది. బీజేపీ అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ 2023కు వచ్చేసరికి దాదాపుగా రెట్టింపు (13.9) అయింది. అదే లెక్కను వర్తింపజేస్తే, 2024 పార్లమెంటు ఎన్నికలలో ఆ పార్టీ ఓటింగ్ శాతం కూడా రెట్టింపై 24 శాతానికి చేరాలి. అదనపు హంగులు కూడా చేరినందున, ఇంకా పెరిగినా పెరగవచ్చు. కాంగ్రెస్ కోల్పోయే ఓట్లు బీజేపీ ఖాతాలోకి వెడతాయి. కాంగ్రెస్ గెలిచే చోట్ల బీజేపీయే రన్నర్ అప్‌గా ఉంటుంది. మరి బీఆర్ఎస్ ఎక్కడ? బీఆర్ఎస్ జోరు బాగా ఉన్న 2018–2019 కాలంలోనే, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల మధ్య ఆ పార్టీ ఓట్లు సుమారు ఆరుశాతం తగ్గి, బీజేపీ ఎదుగుదలకు దోహదం చేశాయి. 2023లో బీఆర్ఎస్ సాధించిన 37.5 శాతం ఓట్లలో ఎన్ని బీజేపీకి వెళతాయి? బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు తరలివెళ్లే ఓట్లు అతి తక్కువ ఉంటాయని, ఆ రెండు పార్టీల మధ్య నడుస్తున్న యుద్ధాన్ని చూస్తే అర్థమవుతుంది. పుట్టి మునిగిపోతున్న పార్టీకి మొన్న పడ్డ ఓట్లలో అత్యధికం బీజేపీకి పడితే, ఆ వలస ఓటింగ్ శాతాన్ని, ఫలితాలను కూడా గణనీయంగా ప్రభావితం చేయవచ్చు. కేంద్రప్రభుత్వపు కోరలు కలిగిన బలమైన ప్రతిపక్షం అధికార పార్టీని ఎంతో కాలం ఉండనివ్వదు. బీఆర్ఎస్ అవశేషాన్ని అసలే మిగలనివ్వదు.

కాసేపు బీజేపీని, మరి కాసేపు కాంగ్రెస్‌ను బలపడేట్టు చేసి కేసీఆర్ ఆడిన ఆట, చివరకు ఆయనకే ముప్పుతెచ్చింది. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ కలిసి ఉమ్మడిగా బీఆర్ఎస్ మీద జరుపుతున్న రాజకీయయుద్ధం కాంగ్రెస్‌కే ప్రమాదం తెస్తుంది. కాంగ్రెస్ కోరుకున్నట్టే, బీఆర్ఎస్ కూడా వ్యవహరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం మీదనే కత్తులు నూరడం వల్ల తన చాప కిందికి నీరు తానే తెచ్చుకుంటున్నది. కాంగ్రెస్ మీద తాను పెంచే వ్యతిరేకత ఫలితాలు కూడా బీజేపీకే వెడతాయని బీఆర్ఎస్ గుర్తించాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర అజెండానే పార్లమెంటు ఎన్నికలకు విస్తరించాలనుకోవడం బాగానే ఉన్నది కానీ, ప్రచారపర్వం ఉధృతమై జాతీయ అంశాలు వేదికమీదకు వచ్చేసరికి, బీఆర్ఎస్ నిరాయుధంగా మిగలవలసివస్తుంది. గెలుపు ఓటములను పక్కనబెట్టి, ఉనికి పోరాటం చేయడమొక్కటే బీఆర్ఎస్ చేయగలిగింది. రంగంలో మిగలడానికి చేసే జీవన్మరణ యుద్ధంలో, ఆ పార్టీకి కావలసింది ఒక గట్టి రాజకీయ ఆయుధం. ఇప్పుడే నిద్రనుంచి మేల్కొన్నట్టు, రైతు ఆత్మహత్యల గురించి మాట్లాడడం వల్ల హేళనలు ఎదుర్కొనడమే తప్ప, ప్రయోజనం ఉండదు. సాధికారంగా, నైతికబలంతో మాట్లాడగలిగే అంశాలను వారు అన్వేషించాలి. ఓడిపోయే ఎన్నికల కోసం ఖర్చు దండగని అనుకోకుండా, భవిష్యత్తు యుద్ధాల కోసం వర్తమానంలో ఆత్మరక్షణ చేసుకోవాలి. బంగారు లక్ష్యం అచ్చిరానప్పుడు, రజతపతకంతో అయినా పోటీలో నిలవాలి.

బాగా ఖర్చు పెట్టగలిగిన ఆసాములను రంగంలోకి దింపితే, ఆ ధనశక్తి కూడా తోడై పది విజయాలు ఖాయమని రాష్ట్ర కాంగ్రెస్ లెక్కలు వేసుకుంటోంది. ఉపన్యాసాలు ఇచ్చి పోవడం తప్ప అధిష్ఠానం చేయగలిగే సాయం ఏమీ లేదు. చిన్నదో పెద్దదో ఒక 'హవా' సృష్టించే ఉద్దేశమూ సామర్థ్యమూ కూడా రాహుల్ బృందంలో కనిపించడం లేదు. చూడాలి, తుక్కుగూడ జనజాతరలో ఒక మందపవనమో మలయమారుతమో చెలరేగుతుందేమో?

శాపంగా మారకముందే సరిదిద్దుదాం!

గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ ఆలోచనని బయటపెట్టగానే దానిలో ఉన్న సమస్యల గురించి ప్రభుత్వానికీ, పత్రికలకూ నేను రాశాను. ఒక విద్యుత్ ఇంజనీరుగా 2018లోనే కొన్ని ముఖ్యమైన సమస్యల్ని ఎత్తిచూపాను. క్లుప్తంగా చెప్పాలంటే– దక్కను పీఠభూమి పడమర నుంచి తూర్పుకి కొద్దిగా ఏటవాలుగా ఉన్నది. దాని వలన గోదావరి మొదలగు నదులన్నీ పడమర నుంచి తూర్పుకు ప్రవహిస్తున్నాయి. ప్రకృతికి విరుద్ధంగా నదిని తూర్పు నుంచి పడమరకు పది భారీ లిఫ్టులతో ప్రవహింపచేసే ప్రయత్నమే కాళేశ్వరం. భారీ రిస్కులతో, ఖర్చుతో కూడుకున్నదే కాదు, అది గిట్టుబాటుకాని ప్రాజెక్టు. గొలుసులో ఒక లింక్ తెగినా మొత్తం గొలుసు వృథా అవుతుంది. ఒక లిఫ్ట్ ఫేలయినా మొత్తం ప్రాజెక్ట్ ప్రయోజనం దెబ్బతింటుంది.

తెలంగాణ విద్యుత్ సామర్థ్యం (మొత్తం contracted capacity) 2014లో 7,778 మెగావాట్లు; 2023 డిసెంబరు నాటికి 19,475 మెగావాట్లు అని ప్రభుత్వ లెక్కలు (వైట్ పేపర్) చూపెడుతున్నాయి. ఇందులో సోలార్, గ్యాసు వంటి ఇతర మూలాల నుంచి, కేంద్రం నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచీ లభించే విద్యుత్తూ చేరి ఉన్నది. కాగా కేవలం కాళేశ్వరం భారీ లిఫ్టులకు కావల్సిన విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా, పంపిణీ, PLFని కూడా లెక్కిస్తే 10000 మెగావాట్ల విద్యుత్ – అంటే మొత్తం సామర్థ్యంలో సగానికి సగం – ఈ ప్రాజెక్టుకే పోతుంది. మరి ఇళ్లు, ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఇతర విద్యుత్తు అవసరాల మాటేమిటి? కాళేశ్వరం 10000 మెగావాట్లకు రూ.50,000కోట్లు కావాలి; మరో రూ.50,000కోట్లు సరఫరాకి, పంపిణీకి కావాలి. ఈ పవర్ స్టేషన్లు నడవడానికి రోజుకి సుమారు లక్ష టన్నుల బొగ్గు కావాలి. ఆ బొగ్గు మండితే 70వేల టన్నుల బూడిదా, వేడి ఉత్పత్తి అయి, గ్రామాల్ని, ప్రజల్ని, వారి ఆరోగ్యాల్ని బాధిస్తాయి. వాటి వల్ల ప్రజలపైనా, ప్రభుత్వంపైనా అదనపు ఆర్థికభారం పడుతుంది. ఆ స్థాయిలో బూడిదవల్ల జలకాలుష్యంతో పాటు పంటభూములూ పెద్దఎత్తున దెబ్బతింటాయి. ఈ బొగ్గుకి రోజుకి కనీసం రూ.20కోట్ల రూపాయలు కావాలి. కాలం గడిచే కొలదీ నిర్వహణ (ఆపరేషన్, మెయింటెనెన్స్) ఖర్చులు, రన్నింగ్ కాస్ట్‌తో కలిసి, భరించలేని స్థాయిలో తడిసి మోపెడవుతాయి.



భారీ లిఫ్టులు గిట్టుబాటు సాగుకి తోడ్పడవు. ఆ విధంగా కాళేశ్వరం తెలంగాణకి ఒక శాపం అవుతుంది. నష్టాలు లేని రీతిలో, గిట్టుబాటుగా ఉండే పద్ధతిలో కాళేశ్వరం ప్రాజెక్టును కుదించటం అనివార్యం. నిపుణుల సలహాలతో, సాయంతో పునర్ రచన చేసి, తెలంగాణ ప్రజల ప్రయోజనాలు కాపాడటం తక్షణావసరం.

తాగునీటికి ఎంత ఖర్చు అయినా పర్వాలేదు, తప్పదు. కానీ ఇదంతా 'కోటి ఎకరాలమాగాణి'కి, అంటే కిలో రూ.20ల రేటున్న వరికి. పై ఖర్చులన్నీ కలిపితే ఆ వరి ధర కిలోకి ఎంతవుతుంది? ఆ వరిని రైతు అమ్మగలడా? ఆహార ధాన్యాల కొరత ఉంటే ఏ ఇబ్బందులున్నా తప్పదు. కానీ ఇప్పటికే తెలంగాణలోనూ, ఇతర రాష్ట్రాల్లో, మొత్తంగా దేశంలోనూ వరి ఉత్పత్తి పెరిగి, గోదాములు చాలక, ఆరుబైట గుట్టలు పోస్తున్నారు. భారీవర్షాల్లో తడిసి రైతులకూ సమాజానికీ భారీ నష్టాలు వాటిల్లుతున్నాయి. ఎగుమతులపై ఆంక్షలూ, ప్రపంచ మార్కెట్లో ఎదురయ్యే ఇబ్బందులూ, రేట్ల సమస్యల్నీ దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఎంతని సబ్సిడీ ఇవ్వాలి? ఆ సబ్సిడీ భారం ప్రజలందరిపైనా పడుతుంది. ఇవ్వకపోతే రైతుకు భారీ నష్టాలూ, ఆత్మహత్యలే మిగులుతాయి. ఈ తలనొప్పులన్నీ కోరి తెచ్చుకోవాలా? ప్రజలు భరించాలా?

ఏ దేశంలోనైనా కేవలం మాగాణి పంటలే అయితే లాభదాయకం కాదు, గిట్టుబాటూ కాదు. అవి ప్రజల ప్రొటీన్ తదితర పోషకాహార అవసరాల్ని తీర్చవు. ఆయా లోపాలవల్ల అనారోగ్యాలూ ఇబ్బందులూ ఖర్చులూ పెరుగుతాయి. వరిపంటకు పంటకాల్వల వల్ల మురుగునీటి సమస్యలూ, వాటి పర్యవసానాలూ ఉంటాయి. దశాబ్దాలుగా అవే పంటల్ని వేస్తే భూసారమూ క్షీణిస్తుంది; దానితో కృత్రిమ ఎరువుల వాడకం పెరిగి, పర్యావరణ, ఆర్థికభారాలు రెండూ పెరుగుతాయి. గత నాలుగేళ్లలో మన వ్యవసాయ దేశం లక్షన్నర కోట్ల రూపాయల వంటనూనెల్ని దిగుమతిచేసుకోవాల్సి వచ్చింది. వంట నూనెల్లో పామ్ ఆయిలే 70శాతం దిగుమతి అవుతున్నది; ఆ నూనె ఆరోగ్యదాయకం కాదు. 2023లో దాదాపు 30 లక్షల టన్నుల పప్పుల్ని (రూ.15–20వేలకోట్లు) దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. పప్పులూ నూనెగింజలూ ముఖ్యమైన పోషకాహార పదార్థాలు, ప్రొటీన్లు కలవి. ఇవన్నీ మెట్టపంటలు, భూసారాన్ని కాపాడుతాయి. వాటి ఉత్పత్తి ఖర్చులు ఇతరపంటలతో పోలిస్తే తక్కువ. అవి రైతులకు – ముఖ్యంగా మెట్ట ప్రాంతాలవారికీ, చిన్న రైతులకూ – గిట్టుబాటుగా ఉంటాయి. తెలంగాణ వంటి మెట్ట ప్రాంతాలకు, మెట్టరైతులకూ కిలో రూ.250 వచ్చే నువ్వులు, రూ.150వచ్చే పల్లీలు, కందులు, పెసలు, శనగలు లాభదాయకం; పోషకవిలువలు హెచ్చుగా కలవి. మెట్టభూముల్లో చిరుధాన్యాల ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని ప్రపంచమంతటా గుర్తించి, వాటి పోషక విలువలరీత్యా, పెరుగుతున్న డయబిటీస్ బీపీ వంటి జీవనశైలీ వ్యాధుల వల్ల మిల్లెట్స్ ప్రత్యేక అవసరాల్ని గుర్తించి, గత ఏడాదిని 'మిల్లెట్ ఇయర్'గా ప్రకటించారన్నది తెల్సిందే. అవికాక తెల్ల బంగారం పత్తి ఉండనే ఉంది.

పైన పేర్కొన్న భారీ లిఫ్టులు ప్రపంచంలో వ్యవసాయానికై ఎవరూ అంతగా వాడటం లేదు. అవి గిట్టుబాటు సాగుకి తోడ్పడవు. ఆ విధంగా కాళేశ్వరం తెలంగాణకి ఒక శాపం అవుతుంది. రాబోయే ప్రభుత్వాలకీ గుదిబండ అవుతుంది. ఆ భారమంతా పన్నుల రూపంలో తుదకు ప్రజలపైనే పడుతుంది. నిర్మాణ లోపాలు, లంచాల ఆరోపణలు, వాటిపై దర్యాప్తులూ విచారణలూ అలా ఉండగా, పై విషయాల్ని తీవ్రంగా పట్టించుకోవాలి. ఈ విషయాల్ని నిపుణులు లోగడ చెప్పినా పట్టించుకోలేదు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవటానికి ఇదీ ఒక ముఖ్యకారణమైంది. అందువల్ల కాళేశ్వరం ప్రాజెక్టు గుదిబండను సత్వరం వదిలించుకోవాలి. భారీ నష్టాలు లేని రీతిలో, గిట్టుబాటుగా ఉండే పద్ధతిలో ప్రాజెక్టును కుదించటం అనివార్యం. దానికి తగినట్టుగా, వివిధరంగాల నిపుణుల సలహాలతో, సాయంతో మళ్లీ పునర్ రచన చేసి, తెలంగాణ ప్రజల ప్రయోజనాలు కాపాడటం తక్షణావసరం.

▪ మరింగంటి శ్రీరామ
రిటైర్డ్ చీఫ్ జనరల్ మేనేజర్, సింగరేణి

ఎలక్టోరల్ బాండ్స్ పర్యవసానాలపై సభ

ఎలక్టోరల్ బాండ్స్ విధానం చాలా గొప్పదని, ఇది నల్లధనం నివారణకు తోడ్పడుతుందని, రాజకీయ అవినీతిని ఆపుతుందని భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం ప్రచారం చేసింది. ప్రజాస్వామికవాదులు, ప్రతిపక్ష పార్టీలు ఇది అవినీతి కేంద్రీకరణ విధానమని ఎంత వ్యతిరేకించినా అక్కరకు రానిదే అయింది.

సుప్రీంకోర్టు తీర్పు తరువాత ఎలక్టోరల్ బాండ్స్ విధానం అధికారపక్ష అవినీతిని ఒక పద్ధతిగా వ్యవస్థీకృతం చేసిన తీరు, రాజకీయార్థిక నేరాలను, విలువల పతనాన్ని వేగవంతం చేసిన తీరు బట్టబయలయింది. ఇది అనేక నేరాలకు మాస్టర్ మార్గం అని కూడా ప్రజలకు అర్థమైంది. ఈ చర్చ నుంచి ప్రజలను దారి మళ్లించడానికి కేంద్ర ప్రభుత్వం తన చేతిలో ఈడీ, ఐటీ, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగిస్తూ ఎస్‌బీఐని కూడా వీటికి తోడు చేసింది. రాజకీయాల్లో విలువల పతనాలు, అందుకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న తప్పుడు విధానాలు మునుపెన్నటికన్నా ఇప్పుడు పెరిగింది. ఇది ప్రజలకు, ప్రజాస్వామ్యానికి నష్టం. నియంతృత్వానికి, అణచివేతకు దగ్గర దారి.

ఈ అంశాన్ని లోతుగా చర్చించడానికి రేపు ఉదయం 10 గంటల నుంచి వీక్షణం కలెక్టివ్, పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతున్నది. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గల షోయబ్ హాలులో జరిగే ఈ సభలో ప్రొ. జి.హరగోపాల్, ప్రొ. డి.ఎస్. ఎన్. వేణుగోపాల్, ప్రొ. పాపారావు, ప్రొ. వి.ఎస్.ప్రసాద్, ప్రొ. ఎం. కోదండరాం, డా. వనమాల, ప్రొ. లక్ష్మణ్ గడ్డం, ఆకునూరు మురళి, ప్రొ. జి.లక్ష్మీనారాయణ. డా. జి. విజయ్, గోవర్ధన్, కన్నెగంటి రవి, కె.రవిచంద్ర, అంబటి నాగయ్య, ఎస్.ఎం.ఖలీల్, జి.లక్ష్మయ్య, డి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొంటారు.

– వీక్షణం కలెక్టివ్,
పాలమూరు అధ్యయన వేదిక


రాజకీయ ప్రయోజనాలకే రైతుపై మొసలి కన్నీరు!

అసమర్థతతో, అడ్డగోలు అప్పులతో, అణచివేతలతో పాలన చేసిన కేసీఆర్ పదేళ్ళ అధికారంలో ఒక్కనాడు కూడా ప్రజలను కలవలేదు. ప్రజలు విసిగిపోయి అధికారం నుంచి దింపేస్తే, ఇప్పుడు గడీల నుంచి బయటకొచ్చి దొంగ ఏడుపు ఏడుస్తూ రైతులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయన దొంగ ఏడుపును నమ్మి ప్రజలు మళ్లీ ఆయనకు ఓట్లేస్తారని భ్రమపడుతున్నారు. మరోసారి మోసపుచ్చేందుకు ప్రయత్నిస్తున్న కేసీఆర్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

తన పాలనలో రైతుల ఆత్మహత్యలే జరగలేదని కేసీఆర్ గొప్పలు చెప్పుకుంటున్నారు. 2023 జనవరి 28 నాడు మహారాష్ట్ర నాయకులను ఉద్దేశిస్తూ తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు జీరో అని కేసీఆర్ చెప్పారు. ఆ రోజే కేసీఆర్ స్టేట్‌మెంట్ తప్పు అని నేను నిరూపించాను. రాష్ట్రంలో రైతు ఆత్మహత్యల గురించిన ఎన్‌సీఆర్‌బీ రికార్డులను బయటపెట్టాను. 2014 నుంచి 2022 వరకూ 6912 రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు ఎన్‌సీఆర్‌బీ రికార్డులు ఉన్నాయి. రైతులు చనిపోకపోతే రైతు బీమా డబ్బులు ఎందుకు ఇచ్చారు? రైతులు చనిపోలేదంటే ఆ డబ్బులు మీరే నొక్కేశారా? కేసీఆర్ సమాధానం చెప్పాలి.

లక్ష కోట్ల అప్పు చేసి కాళేశ్వరం కడితే, మూడేండ్లు కూడా గడువకముందే ఓ బ్యారేజీ కుంగిపోయింది. ఇంకో బ్యారేజీ కింది నుంచి నీళ్లు లీక్ అయితున్నయి. వాటిల్లో నీళ్లు స్టోర్ చేస్తే మొత్తం బ్యారేజీలు కొట్టుకుపోతాయని సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెప్పింది. మరోవైపు వానలు లేవు. ఎండలు పెరిగిపోయాయి. దేశమంతటా ఇదే పరిస్థితి ఉన్నది. ఈ పరిస్థితుల్లో పొలాలు ఎండిపోతే, రైతులకు ధైర్యం చెప్పాల్సింది పోయి రాజకీయాలు చేయడం సిగ్గుచేటు. తన తప్పులను, ప్రకృతి వైపరీత్యాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీద వేసి రాజకీయ పబ్బం గడుపుకోవడానికి కేసీఆర్ ప్రయత్నం చేస్తున్నారు. మేడిగడ్డలో నీళ్లు స్టోర్ చేయొచ్చు అని, ఎత్తిపోయొచ్చు అని చెబుతున్న కేసీఆర్ మరి తాను అధికారంలో ఉన్నప్పుడు గేట్లు ఎత్తి 27 టీఎంసీల నీటిని బ్యారేజీ నుంచి ఎందుకు వదిలేశాడో, నీళ్లు ఎందుకు ఎత్తిపోయలేదో రైతులకు సమాధానం చెప్పాలి. వర్షాకాలం మీరు అధికారంలో ఉండగానే పోయింది. కాళేశ్వరం, మేడిగడ్డ మీ హయాంలోనే కుంగింది, బీటలు వారింది. మరి 2023 డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలన కరువు ఎలా తెచ్చినట్టు? రాజకీయ అస్తిత్వం కోసమే మీ ఆరాటం అని ప్రజలకు అర్థం అవుతున్నది.

తన తప్పులను, ప్రకృతి వైపరీత్యాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మీద వేసి రాజకీయ పబ్బం గడుపుకోవడానికి కేసీఆర్ ప్రయత్నం చేస్తున్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రూ.7లక్షల కోట్ల అప్పు చేశారు. ఇప్పుడు ఒక్కొక్క రూపాయి జాగ్రత్తగా ఖర్చు పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ప్రజలు, రైతులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి.



మరో జూటా పార్టీ బీజేపీ సత్యాగ్రహాల పేరుతో రోడ్లు ఎక్కబోతుంది. ఆ పార్టీ ముందు రైతన్నకు క్షమాపణ చెప్పాలి. నల్ల చట్టాలను వెనక్కు తీసుకోవాలని, ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలని రైతన్నలు దేశం నడిబొడ్డున రోడ్డు ఎక్కితే వారిని తీవ్రవాదులనీ, దేశద్రోహులనీ అవమానించిన, పిట్టల్లా కాల్చి చంపిన పార్టీ అది. ఈ రైతు ఆందోళనల సమయంలో 500 మంది రైతులు చనిపోయారు. యూపీఏ హయాంలో ఉన్న నేషనల్ అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనగా 2016లో కేంద్రప్రభుత్వం మార్చింది. అప్పటి తెలంగాణ ప్రభుత్వం 2016 నుంచి 2020 వరకూ ఈ స్కీమ్‌ను రాష్ట్రంలో అమలు చేసింది. ఆ తర్వాత అమలు చేయడం ఆపేసినా, బీజేపీ ఎందుకు ప్రశ్నించలేదో, అప్పుడే ఎందుకు సత్యాగ్రహ దీక్షలు చేయలేదో ఆ పార్టీ నాయకులు రైతులకు సమాధానం చెప్పాలి. కరువు నష్టం కూడా అంతే. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుగా ఒకరిపై ఒకరు నెపం వేసుకొని కాలం గడుపుతూ అన్నదాతను మోసం చేసిన ఈ రెండు పార్టీలకు ఇప్పుడు రేవంతన్న ప్రభుత్వంపై ఏద్పే నైతిక హక్కు లేదు.

2009–2014 వరకు ప్రకృతి విపత్తు వల్ల 14లక్షల ఎకరాల పంట నష్టం జరిగితే ప్రభుత్వాలు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.518కోట్లు ఇచ్చాయి. 2014లో 70,156 ఎకరాల్లో పంటలు నష్టపోతే రూ.80కోట్లు, 2015లో తుపానుతో 13.53 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే రూ.703కోట్లు మాత్రమే ఇచ్చారంతే. 2016, 2017 సంవత్సరాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ లేదు. 2018లో 70 వేల ఎకరాల్లో నష్టం జరిగితే కేవలం రూ.22కోట్లు ఇచ్చారు. 2019, 2020, 2021 సంవత్సరాల్లో నయా పైసా ఇవ్వలేదు. ఏదైనా పంట 33 శాతానికి పైగా దెబ్బ తింటే ఎకరానికి ఇంత అని ఇవ్వాలి. ఆ ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ ఎకరా వరికి రూ.5463; వాణిజ్య పంట పత్తి, కంది, సోయా, పెసర, జొన్న వేరుశనగకి ఎకరాకు రూ.2751; మొక్కజొన్నకి రూ.3372 చెల్లించాలి. 2020లో 14.93 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లితే రూ.7వేల కోట్ల పంట నష్టం అయినట్లు అధికారులు రిపోర్టు చేసారు. వ్యవసాయ కమిషనర్ సర్కారుకు లెటర్ రాసినా ఎలాంటి స్పందనా లేదు. పండిన పంటకు మద్దతు ధర లేదు. వరి వేస్తే ఉరి అని ఆగం చేసింది కేసీఆర్ సర్కారు. వరి కొనుగోలులో తరుగు పేరు మీద రైస్ మిల్లర్లు దోచుకుంటున్నా నోరు మెదపలేదు. రుణమాఫీ ఏకకాలం అని చెప్పి పది సంవత్సరాలు కాలయాపన చేస్తే మీరు ఇచ్చిన పైసలు వడ్డీకే సరిపోయినవి, ఖాతాలు మొండి బకాయిల కింద పడ్డవి. రైతన్నకు బ్యాంకర్లు నోటీస్లు ఇస్తున్నారు. రైతుల పట్ల, ప్రజల పట్ల ఇంత కర్కశంగా ప్రవర్తించి ఇప్పుడు ఎన్నికల కోసం రైతుల గురించి మాట్లాడటం సిగ్గు చేటు.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సిద్ధంగా ఉంది. ఐదు ఎకరాల లోపు రైతులందరికీ రైతుభరోసా చెల్లించారు. రుణమాఫీ, బోనస్, పంట బీమా తదితర హామీలను అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కార్యాచరణ మొదలుపెట్టింది. కేసీఆర్ పదేండ్ల పాలనలో రూ.7లక్షల కోట్ల అప్పు చేశారు. ఇప్పుడు ఒక్కొక్క రూపాయి జాగ్రత్తగా ఖర్చు పెట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ప్రజలు, రైతులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

● ఇందిరా శోభన్ పోశాల
కాంగ్రెస్ నాయకురాలు

దాసి సుదర్శన్ కెమెరా కన్ను

పంతులు అనే పట్టపు రాజు నిలువైన విగ్రహం
నడకెంత పాయిరం పగలు రాత్రనని పరిశోధన
రాయో మోరో మూగ రోదన గడియలు లెంకటం
పన్ను పోకవక్క కొర్కటం జరిగిందో కన్ను చుట్టిన కెమెరా..



కారణం వెతికిన పన్తనం ఫోటో చిత్రం
అబ్బో! ఏమీ వెత్కులాట్కం భారీ కాయం
కాలు కదిపిన తొవ్వల్లో బొమ్మల వైకుంటం
మంచితనం తమలపాకులంత గుణం పెదువంత

క్లాస్ రూమంతా పిల్లల తండ్రీ ఏ బిడియం వెర్గూ..!
అనాథల్ కీస దుల్పిన పైసల్ దారంత దానమే గురూ
దాసి ఏడు నందులు ఆ సినిమా అంతా ఏడ్పే నవ్వు సర్
ఎన్ని అవమానాలు మింగగల్గితే దాసి సుదర్శనెత్తు ఎద్గుతం

– వేముల ఎల్లయ్య

గిట్టుబాటు ధర కల్పించాలి

మే నెల వచ్చిందంటే ఆదివాసీ అడవి బిడ్డలు తునికాకు సేకరించడం ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకుంటారు. ఎండాకాలంలో చెట్లు, పుట్టలు, గుట్టలు ఎక్కి, అడవి జంతువుల బారి నుంచి తప్పించుకొని తునికి ఆకు కోయడం ప్రాణాలతో చెలగాటమే. అయినా బ్రతుకు తెరువు కోసం వారు ఆకు సేకరిస్తున్నారు. ఇంత కష్టపడి తునికి ఆకు సేకరిస్తే సరైన ధర లేక ఆదివాసీలు నష్టపోతున్నారు. తునికి ఆకు కొనుగోలు చేసే వ్యాపారస్తులు మాత్రం కోట్లకు పడగలెత్తుతున్నారు. తునికి ఆకు సేకరణలో ఆదివాసీలు క్రూర మృగాల దాడిలో గాయపడి మరణిస్తున్నారు. వారికి ప్రభుత్వం కానీ, వ్యాపారస్తులు కానీ ఎలాంటి నష్టపరిహారం చెల్లించడం లేదు. పైగా ఆదివాసీలు అభయారణ్యంలో అడుగుపెట్టొద్దని అటవీ అధికారుల వేధింపులు, దాడులు ఎక్కువయ్యాయి. ప్రజాసంఘాలు కూడా వీరి గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. యాభై తునికి ఆకుల కట్టకు రూపాయి నలభై పైసలు ఇస్తూ ఆదివాసీలను నిలువునా మోసం చేస్తున్నారు. ఈ తునికి ఆకును ఆదివాసీలు కోయకపోతే బీడీలు, బీడీ పరిశ్రమలు ఉండవు. తునికి ఆకు సేకరణలో కళ్ళేదారు కమీషన్, గిర్దావారు కమీషన్ పెంచాలని, యాభై తునికి ఆకుల కట్టకు కనీస మద్దతు ధర ఐదు రూపాయలకు పెంచాలని, తునికి ఆకు సేకరణలో అడవి జంతువుల బారినపడి గాయపడిన వారికి రెండు లక్షలు, మరణించిన వారికి ఐదు లక్షలు చెల్లించాలని, గత పది సంవత్సరాల నుంచి చెల్లించకుండా ఉన్న తునికి ఆకు బోనస్ తక్షణమే చెల్లించాలని ఆదివాసీలు కోరుతున్నారు.

– పూకె రామకృష్ణ దొర



కారులో అకస్మాత్తుగా మంటలు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆరాంఘర్ చౌరస్తాలో ఓ కారులోంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మహబూబ్‌నగర్, కొత్తకోట, గద్వాల ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆరాంఘర్ చౌరస్తాలో కార్లు రోడ్డు పక్కన ఆపుతారు. అలా ఆపిన ఓ కారు (ఏపీ21సీసీ 5656) నుంచి బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు రావడంతో అక్కడున్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. పక్కనున్న కార్లను అక్కడి నుంచి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్ పీ.మధు తెలిపారు.

హోటల్‌లో అగ్నిప్రమాదం 8 పేలిన ట్రాన్స్‌ఫార్మర్

గంటల కొద్దీ చార్జింగ్ వద్దు



- బీఎంఎస్ లోపాలతో ప్రమాదాలకు చాన్స్
- అసెంబుల్డ్ బ్యాటరీలతో పొంచి ఉన్న ముప్పు
- ఎలక్ట్రిక్ వాహనదారులకు నిపుణుల సూచన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో 40-50 కంపెనీలకు చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను మార్కెట్లోకి తీసుకువస్తే వాటిలో 25 వరకు మాత్రమే టీఎస్ రెడ్కో వద్ద ఎంప్యానల్ చేసుకున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలకు రాత్రుళ్లు గంటల కొద్దీ చార్జింగ్ పెట్టడం, వాహనాలను రోజుల తరబడి ఎండలో వదిలేయడం, అసెంబుల్డ్ బ్యాటరీలు ఇష్టానుసారంగా వినియోగించడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బ్యాటరీ చార్జింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు లేకుండా చూసుకోవచ్చని

మిగతా 8వ పేజీలో..

ఆడపిల్లలు పుట్టారని

అత్తింటి వేధింపులు!

వివాహిత అనుమానాస్పద మృతి


నాగరాణి (ఫైల్)

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా మండలం జవహర్‌నగర్ అంబేడ్కర్‌నగర్‌లో నివాసముండే కె.సత్యనారాయణ(54) పెద్ద కుమార్తె వి.నాగరాణి(29)కి నేరేడ్‌మెట్ ప్రాంతంలోని జేకే కాలనీలో నివాసముండే వి.వెంకటాచారి(35)తో 2010 డిసెంబర్‌లో వివాహం చేశారు. కుటుంబంలో చిన్న, చిన్న గొడవలు జరిగేవి. నాగరాణి మొదటి సంతానంగా కుమార్తెకు జన్మనిచ్చింది. రెండో సారి కూడా కూతురే పుట్టింది. ఆడపిల్లలకు జన్మనిచ్చిందని ఆమె భర్త, బావ వీరబ్రహ్మచారి(భర్త సోదరుడు), అత్త మణెమ్మ ఇంట్లోని బంధువులు వేధించేవారు. దీనికితోడు కుటుంబ సభ్యులు ఇంట్లో దాచిన కొంతడబ్బు పోయిందని నాగరాణిని అనుమానించారు. ఇవి భరించలేని ఆమె ఇంట్లోని తన బెడ్ రూమ్‌లో ఈ నెల 2న ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొంది. నాగరాణి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈదేదెలా..!

అందుబాటులోకి రాని ఈతకొలనులు

- నిధులు లేక సా..గుతోన్న పనులు
- నీటి సరఫరాకు చేతులెత్తేసిన వాటర్‌బోర్డు
- ఉన్నతస్థాయి ఆదేశాలతో దారిలోకి..
- వారం, పది రోజుల్లో ప్రారంభిస్తాం : ఉన్నతాధికారి

మార్చిలో ప్రారంభించాల్సిన జీహెచ్‌ఎంసీ ఈత కొలనులు ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. నిధుల లేమితో నిర్వహణ పనుల్లో ఇన్నాళ్లు జాప్యం జరగగా.. నీటి ఎద్దడి ఇప్పుడు అవరోధంగా మారుతోంది. ముందస్తు ఏర్పాట్లు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని నగరవాసులు మండిపడుతున్నారు.


సికింద్రాబాద్‌లోని ఈతకొలనులో మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో జీహెచ్‌ఎంసీకి చెందిన 13 ఈత కొలనులున్నాయి. వీటిలో కేవలం మూడుచోట్ల మాత్రమే స్విమ్మింగ్ పూల్‌లు ప్రారంభమైనట్టు అధికారులు చెబుతున్నారు. ఇతర ఏరియాల్లో నిర్వహణ, నీటిని నింపడం, క్లోరినేషన్, కెమికల్స్ కలపడం వంటి పనులు సా..గుతున్నాయి.

నిధులు లేక నిర్వహణ పనుల్లో జాప్యం

బల్దియా ఈత కొలనులు యేడాదిలో తొమ్మిది నెలలు అందుబాటులో ఉంటాయి. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిలో స్విమ్మింగ్ పూల్‌లను మూసేసి నిర్వహణ పనులు చేపడుతారు. నీటి తొలగింపు, పగిలిన టైల్స్, పాడైన నల్లాలు, షవర్లు, పూల్‌లోని మోటార్ల మరమ్మతు తదితర పనులు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో ఆయా పనులు పూర్తి కాలేదు. ఒక్కో ఈత కొలను వద్ద నిర్వహణ పనులకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతుంది. ప్రతి యేటా టెండర్ ద్వారా ఆయా పనులు చేస్తారు. పలుమార్లు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా బిడ్‌లు ఆహ్వానించినా ఒక్కరూ ముందుకు రాలేదు. బల్దియాలో వందల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదని సమాచారం. దీంతో పనులు చేయడంలో తీవ్ర జాప్యం జరిగింది. కొన్ని ఈత కొలనుల వద్ద నిర్వహణ పనులు పూర్తవగా.. ఇంకొన్ని చోట్ల కొనసాగుతున్నాయి.

ట్యాంకర్లు పంపలేం : వాటర్‌బోర్డు

నిర్వహణ పనులు ముగిసిన అనంతరం స్విమ్మింగ్ పూల్‌లో నీటిని నింపుతారు. నగరంలో నీటి ఎద్దడి నేపథ్యంలో ఈ సారి ఈత కొలనులకు నీటి సరఫరా చేసేందుకు వాటర్‌బోర్డు చేతులెత్తేసింది. ట్యాంకర్లకు డిమాండ్ ఎక్కువగా ఉందని, సరఫరా చేసే పరిస్థితి లేదని పలు జోన్లలో బోర్డు స్పష్టం చేసినట్టు బల్దియా వర్గాలు చెబుతున్నాయి. అంతగా అవసరమనుకుంటే ట్యాంకర్లు మీరు సమకూర్చుకోండి. నీళ్లిస్తామని బోర్డు చెబుతోందని ఓ అధికారి పేర్కొన్నారు. క్రీడా విభాగం అధికారులు ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ దృష్టికి తీసుకెళ్లడంతో బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డితో ఆయన మాట్లాడారు. నీటి సరఫరా జరిగేలా చూడాలని కోరినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఒక్కొక్కటిగా వారం, పది రోజుల్లో అన్ని ఈత కొలనులు ప్రారంభిస్తామని బల్దియా చెబుతోంది. జీహెచ్‌ఎంసీ ఈత కొలనులకు వేసవిలో భారీ డిమాండ్ ఉంటుంది. ఆన్‌లైన్‌లో స్లాట్‌లు లభించడమూ ఒక్కోసారి గగనమే. ఈ సారి ఎండలు మండుతుండడంతో స్విమ్మింగ్ పూల్‌ల వద్దకు వస్తోన్న పౌరులు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

ఈత కొలనులు..

- వనస్థలిపురం కాలనీ ఫేజ్-4
- సచివాలయనగర్
- మొఘల్‌పురా(బేబి)
- మొఘల్‌పురా (మెయిన్)
- విజయనగర్ కాలనీ-2
- అంబర్‌పేట(మెయిన్)
- అంబర్‌పేట(బేబి)
- అమీర్‌పేట
- సనత్‌నగర్
- సికింద్రాబాద్

ప్రారంభమైనవి..

- గోల్కొండ
- చందూలాల్ బారాదారి (మెయిన్)
- చందూలాల్ బారాదరి(బేబి)

ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరం

- ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిటీ సీపీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్, కలెక్టర్ అనుదీప్, తదితరులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ ముమ్మరం చేసింది. సిబ్బందికి ఓ వైపు శిక్షణ ఇస్తూనే.. ఈవీఎంల ర్యాండమైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ రోనాల్డ్‌రోస్, రాజకీయ పార్టీల నేతల సమక్షంలో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించాల్సిన కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. స్ర్కీన్ ద్వారా పార్టీల ప్రతినిధులకు చూపించారు. కేటాయించిన ఈవీఎంల జాబితాను సంబంధిత రిటర్నింగ్ అధికారులు, పార్టీల ప్రతినిధులకు అందజేశారు. జిల్లాలో 3,986 పోలింగ్ కేంద్రాలుండగా.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 25 శాతం బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు రిజర్వ్‌లో ఉంచినట్టు రోనాల్డ్‌రోస్ తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నజర్

- అధికారులతో సిటీ సీపీ సంయుక్త సమావేశం

లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, సిటీ అడిషనల్ పోలీస్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశ పాటిల్, సౌత్‌జోన్ డీసీపీ సాయిచైతన్య, సౌత్ ఈస్ట్ డీసీపీ గిరిధర్, ఇతర నోడల్, సబ్‌నోడల్ అధికారులతో సీపీ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అధికారులంతా ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కాంగ్రెస్ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ల నియామకం



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్‌లోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కో-ఆర్డినేటర్లను టీపీసీసీ నియమించింది. కొన్నింటికి ఇద్దరిని నియమించారు. శేరిలింగంపల్లి-పటేల్ రమేష్‌రెడ్డి, మల్కాజిగిరి-వంగాల వెంకన్నగౌడ్, కుత్బుల్లాపూర్-బండ్రు శోభారాణి, పటాన్‌చెరు-బండి శ్యామ్ గౌడ్, కూకట్‌పల్లి-కోటంరెడ్డి వినయ్‌రెడ్డి, ఉప్పల్-రాచమల్ల సిద్ధేశ్వర్, ఎల్‌బీనగర్-అల్లం భాస్కర్, యడవల్లి సంతోష్‌చౌదరి, మహేశ్వరం-నేరెళ్ల శారద, మొగుళ్ల రాజిరెడ్డి, రాజేంద్రనగర్-సంకెపల్లి సుధీర్‌రెడ్డి, ముషీరాబాద్-కె.గౌరీశంకర్, మలక్‌పేట-బీఎన్‌రెడ్డి, అంబర్‌పేట-వరలక్ష్మి, అఫ్జర్ యూసఫ్‌జహీ, ఖైరతాబాద్-యాదగిరిగౌడ్, జూబ్లీహిల్స్ పీసరి మహిపాల్‌రెడ్డి, కోట్ల శ్రీనివాస్, సనత్‌నగర్-జి.నాగభూషణం, నాంపల్లి-కొప్పుల ప్రవీణ్ కుమార్, కార్వాన్-శ్రీధర్‌గౌడ్ గడ్డం, గోషామహల్-ముత్తినేని వీరయ్య, జె.ధనలక్ష్మి, చార్మినార్-జావిద్ అక్రం, చాంద్రాయణగుట్ట-యుజ్మా షకీర్, యాకత్‌పురా-షేక్ యాసిన్, బహదూర్‌పురా-సంజయ్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్- శంభుల శ్రీకాంత్‌గౌడ్, కంటోన్మెంట్ మోతె రోహిత్ నియమితులయ్యారు.

అయినా చెత్త ఎత్తరు..!

- వీజీపీల వద్ద ఫొటో స్టంట్లు
- క్రమేణా పెరుగుతోన్న చెత్తకుప్పలు
- ప్రైవేట్ ఏజెన్సీకి బాధ్యతలు
- పర్యవేక్షణ మరిచిన జీహెచ్‌ఎంసీ


మియాపూర్‌లో పేరుకుపోయిన చెత్తకుప్పలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 'నగరంలో వల్నరబుల్ గార్బేజ్ పాయింట్లు(వీజీపీ) తొలగించాలి. ఆయా ప్రాంతాల్లో ముగ్గులు వేయాలి. 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలి'- కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఆదేశాలు. కమిషనర్ చెప్పిందే తడవు క్షేత్రస్థాయిలో ఎంతో చేస్తున్నట్టు.. జీహెచ్‌ఎంసీలోని కొందరు అధికారులు, ఉద్యోగులు ఫొటో స్టంట్లు చేస్తుంటారు. సంబంధిత గ్రూపులో ర్యాలీలు తీసినట్టు, చెత్తవేసే చోట ముగ్గులు వేశామని, ప్రజలతో నేరుగా మాట్లాడామని చెబుతుంటారు. అయినా, ఎందుకీ దుస్థితి. నగరంలో రోడ్లపై పేరుకుపోతోన్న చెత్త కుప్పల సంఖ్య ఎందుకు పెరుగుతోంది..? ఫొటోల్లోని ఫోజులకు.. క్షేత్రంలోని వాస్తవాలకు ఎందుకు పొంతన ఉండడం లేదు..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. 'రోడ్లు ఊడవట్లే' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో.. మా ఏరియాల్లోనూ అదే దుస్థితి ఉందని నగరవాసులు కొందరు ఆంధ్రజ్యోతి ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. స్వీపింగ్ చేయకపోవడమే కాదు.. చెత్త సేకరణ కార్మికులు రాక రోడ్లపై వేస్తోన్న చెత్తనూ ఎత్తడం లేదని ఫిర్యాదు చేశారు. అప్పుడప్పుడూ పలు

మిగతా 8వ పేజీలో..

బావమరిది హత్య

- భార్యతో విడాకులు ఇప్పించాడని అక్కసు..


అబ్దుల్ రషీద్

మదీన, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల కారణంగా బావమరిదిని అందరూ చూస్తుండగానే కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌బాగ్ నంది ముసలైగూడకు చెందిన మహ్మద్ అబ్దుల్ రషీద్(28) కుట్టుమిషన్ల మెకానిక్. తన చెల్లికి అదే ప్రాంతానికి చెందిన షకీల్ అహ్మద్‌తో వివాహం చేశారు. తరచూ గొడవలు జరుగుతుండడంతో అహ్మద్ భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. వారం రోజుల క్రితం ఖులా(విడాకులు) ఇచ్చింది. విడాకులకు బావమరిది కారణమని అహ్మద్ కక్ష పెంచుకున్నాడు. బుధవారం ఉదయం 8.30 గంటల సమయంలో నందిముసలైగూడ రోడ్డుపై రషీద్‌తో వాగ్వాదానికి దిగాడు. అందరూ చూస్తుండగానే తనతో తెచ్చుకున్న కత్తితో విచక్షణా రహితంగా పొడిచాడు. ప్రజలు తేరుకునేలోపే అక్కడి నుంచి పారిపోయాడు. సంఘటనా స్థలాన్ని దక్షిణ మండలం డీసీపీ సాయిచైతన్య సందర్శించారు. బహదూర్‌పురా పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కొత్తగా వర్టికల్ నీటి శుద్ధి ప్లాంట్లు

- గండిపేట్ కాండూట్ మీద నిర్మాణం
- గ్రేటర్‌కు తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు
- ఈ నెల 15 నుంచి సాగర్ అత్యవసర పంపింగ్
- మే ఒకటో తేదీ నుంచి ఎల్లంపల్లిలో ప్రారంభం

హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ రిజర్వాయర్ల నుంచి హైదరాబాద్‌కు అదనంగా సరఫరా చేసే నీటిని శుద్ధి చేసేందుకు గండిపేట్ కాండూట్ మీద అత్యాధునిక వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు రానున్నాయి. గండిపేట్, కోకాపేట్, పుప్పాలగూడ తదితర ప్రాంతాల్లో మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా సరికొత్తగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను వర్టికల్ ఆధారితంగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా ప్రాంతాల్లో మూడు ఎల్‌ఎమ్‌డీల సామర్థ్యం కలిగిన మూడు అత్యాధునిక వర్టికల్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించనున్నారు.



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో తాగునీటి సరఫరాకు కొరత లేకుండా వాటర్‌బోర్డు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం నగరానికి నాగార్జునసాగర్, ఎల్లంపల్లి, మంజీరా, సింగూరు నుంచి నీరు సరఫరా జరుగుతోంది. ఇవే కాకుండా జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ నుంచి కూడా నీరు సరఫరా చేస్తున్నారు. గతేడాది ఇదే రోజు 2,270 మిలియన్ లీటర్ల నీటిని వాటర్‌బోర్డు సరఫరా చేయగా, ప్రస్తుతం రోజుకు 2,409.53 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తోంది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది అదనంగా 139.53 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో నుంచి జీహెచ్‌ఎంసీ ప్రాంతానికి రోజుకు 1,082.62 మిలియన్ లీటర్లు, జీహెచ్‌ఎంసీ అవతల ప్రాంతాలకు రోజుకు 1,049.58 మిలియన్ లీటర్లు, ఓఆర్ఆర్ వరకు ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలకు రోజుకు 277.21 మిలియన్ లీటర్లు, మిషన్ భగీరథ కోసం రోజుకు 149.47 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. ఈ నీళ్లు కూడా త్వరలో హైదరాబాద్‌కు మళ్లించే అవకాశాలున్నాయి. అదేవిధంగా గతేడాది జంట జలాశయాల నుంచి నీరు వాడుకునేందుకు అనుమతి లేకపోవడంతో కేవలం 4 మిలియన్ గ్యాలన్ల నీటిని మాత్రమే వాడుకున్నారు. ప్రస్తుతం ఈ జలాశయాల నుంచి

మిగతా 8వ పేజీలో..

హైదరాబాద్ ప్రజలకు సరిపడా తాగునీరు


వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హైదరాబాద్ ప్రజలకు సరిపడా తాగునీరు సరఫరా చేస్తామని వాటర్ బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి ప్రకటించారు. గండిపేట్ కాండూట్ మీద గండిపేట్, కోకాపేట్, పుప్పాలగూడ ప్రాంతాల్లో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించేందుకు అనువైన స్థలాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. ఓఆర్ఆర్ పరిధిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్లే వాటర్‌బోర్డు ట్యాంకర్లకు డిమాండ్ ఏర్పడిందన్నారు. గండిపేట్, కోకాపేట్, పుప్పాలగూడ సమీప ప్రాంతాల్లో అదనంగా రోజుకు 9 మిలియన్ గ్యాలన్ల మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్లను రోజూ 24 గంటలు అందుబాటులో ఉండేలా ఫిల్లింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ట్యాంకర్ డిమాండ్ నగరమంతా లేదని, పశ్చిమ ప్రాంతాలైన మణికొండ, గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లోనే అధికంగా ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రస్తుతం 644 ట్యాంకర్లు సేవలందిస్తున్నాయని, నిన్న(మంగళవారం) ఒక్క రోజు 6,593 ట్రిప్పుల నీరు సరఫరా చేశామని తెలిపారు.



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

తెలంగాణ సాయుధ పోరాటంలో

దొడ్డి కొమురయ్య పాత్ర గొప్పది

రాజేంద్రనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య పాత్ర ఎంతో గొప్పదని కుమారస్వామి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ అడికె మహేందర్ పేర్కొన్నారు. కురుమ సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీగూడలో, భవన నిర్మాణ కార్మిక సంఘం రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు బచ్చలకూర స్వామి అధ్యక్షతన రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలలో బుధవారం దొడ్డి కొమురయ్య 97వ జయంతిని నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకుడు ఎన్. జంగయ్య హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జె. రుద్రకుమార్ మాట్లాడుతూ 1827, ఏప్రిల్ 3న వరంగల్ జిల్లా కడివెండిలో గొర్రెల కాపరుల కుటుంబంలో జన్మించిన దొడ్డి కొమురయ్య యుక్త వయసు రాగానే తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. 1946 జూలై 4న దొడ్డి కొమరయ్య సారధ్యంలో సంఘంగా ఏర్పడి రజాకార్లు, దొరల గడీలపై పోరాటం చేశారని గుర్తు చేశారు. రజాకార్లు, దొరలు జరిపిన కాల్పుల్లో దొడ్డి కొమురయ్య ప్రాణాలు కోల్పోయాడని అన్నారు. కార్యక్రమంలో జిలానీ, యాదగిరి, జగన్, మహేశ్, ఖైబూస్, మొగులప్ప పాల్గొన్నారు.



కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కురుమ సంఘం నాయకులు

కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దొడ్డి కొమురయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కురుమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ తొలితరం ఉద్యమ జవాను, గడీల పాలనపై గర్జించి రజాకార్ల వెన్నులో వణుకు పుట్టించిన వీరుడు దొడ్డి కొమురయ్య అని వారన్నారు. బుధవారం రాష్ట్ర కురుమ సంఘం భవనంలో దొడ్డి కొమురయ్య కురుమ 97వ జయంతి వేడుకలను నిర్వహించారు. కురుమ సంఘం నాయకులు దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, కార్యదర్శులు కొలుపుల నర్సింహ, కొండల్‌రాజు, చిట్టం శైలేందర్, రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తూంకుంట అరుణ్ కుమార్, జంటనగరాల మహిళా సంఘం అధ్యక్షురాలు విర్యాల విజయలత తదితరులు పాల్గొన్నారు.



వెంకటమ్మను పరామర్శిస్తున్న ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో

పారిశుధ్య కార్మికురాలికి గాయాలు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికురాలికి తీవ్రంగా గాయాలయ్యాయి. బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతం లో పారిశుధ్య కార్మికురాలు ఎం. వెంకటమ్మ విధుల్లో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ హనుమాన్‌నగర్ రోడ్లపై చెత్తను ఊడ్చివేస్తుంది. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి ఆమెను ఢీకొట్టగా చేతికి, తలకు బలమైన గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు వెంకటమ్మను శివరాంపల్లిలోని శ్రీకర ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ సర్కిల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగం డీఈ ఎం. శ్రీనివాసులు, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు శంకర్, వినయ్, గోపాల్, చంద్రమోహన్ ఆస్పత్రికి వచ్చి వెంకటమ్మను పరామర్శించారు. రాజేంద్రనగర్ నుంచి హిమాయత్‌సాగర్ వెళ్లే రహదారిలో వీధిదీపాలు వెలుగకపోవడం కారణంగానే ప్రమాదం జరిగిందని వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు.

గుర్తుతెలియని మహిళ హత్య కేసులో

పాత నేరస్థుడి అరెస్ట్



వల్లపు శ్రీను

రాజేంద్రనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మహిళ హత్య కేసులో ఓ వ్యక్తిని రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్ట్ చేసి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. గత నెల 30న ఆరాంఘర్ చౌరస్తాలో గుర్తుతెలియని మహిళ హత్యకు గురైన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అప్పట్లోనే క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు షాద్‌నగర్ ఫరూఖ్‌నగర్ వెల్జర్ల గ్రామానికి చెందిన పాత నేరస్థుడు వల్లెపు శ్రీను(45)ను అదుపులోకి తీసుకుని విచారించగా మహిళను హత్య చేసినట్టు అంగీకరించాడు. గతంలోను శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులోనూ శ్రీను నిందితుడు. కాగా హత్యకు గురైన మహిళ రోడ్లపై పాత పేపర్లు ఏరుకునే లక్ష్మీగా గుర్తించారు. మహిళను ఎందుకు హత్య చేశాడు అనే వివరాలను రాబట్టేందుకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు విచారిస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

- నాలుగు రోజుల తర్వాత నాలాలో కుళ్లిన మృతదేహం లభ్యం



అనిల్ (ఫైల్)

పహాడిషరీఫ్ ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. పహాడిషరీఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తుక్కుగూడకు చెందిన మేడావత్ అనిల్(19) ఓఆర్ఆర్ రోడ్డు సమీపంలోని కళాజ్యోతి ప్రింటింగ్ ప్రెస్‌లో ప్యాకింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మార్చి 31న పనికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లిన అతడు తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ప్రింటింగ్ ప్రెస్‌కు వెళ్లి విచారించగా కచ్చితమైన సమాచారం లభించలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అనిల్ స్నేహితులు, బంధువులు, తెలిసినా అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రింటింగ్ ప్రెస్ పక్కన ఉన్న నాలాలో దుర్వాసన వస్తుండడాన్ని గమనించిన సెక్యూరిటీ గార్డు తక్కెళ్ల రాజు కంపెనీ యజమానులకు సమాచారం అందించాడు. వారు పహాడిషరీఫ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి శరీరంపై ఎటువంటి గాయాలు లేవని, వడదెబ్బతో మృతిచెంది ఉండొచ్చని పోలీసులు తెలిపారు. పోస్ట్ మార్టం నివేదిక వస్తేగాని హత్య లేదా సాధారణ మరణం తేలుతుందన్నారు. కాగా ఓ యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారనే వార్త బుధవారం ఉదయం నుంచి సోషల్ మీడియాలో వైరల్ అయింది.

డ్రంకెన్ డ్రైవ్‌లో 8 మందికి జైలు, జరిమానా

చార్మినార్ ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 8 మందికి న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించింది. ఇటీవల మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో 21 మందిపై కేసు నమోదు చేశారు. వారిలో 8మందిని బుధవారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నలుగురికి నాలుగు రోజుల జైలు శిక్ష, మరో నలుగురికి రెండు రోజుల జైలు, జరిమానా విధించారు. మరో వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన పలువురి నుంచి రూ. 50,100 జరిమానా వసూలు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వైజ్ఞానిక, శాస్త్ర పరిశోధనా ఫలాలు

సగటు మనిషికి ఉపయోగపడాలి

చార్మినార్ ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక, శాస్త్ర పరిశోధనా ఫలాలు సగటు మనిషికి ఉపయోగపడాలని ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి. రవీందర్ అన్నారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, ప్రభుత్వ సిటీ కాలేజీ భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్స్‌స్ ఇన్ ఎనర్జీ మెటీరియల్స్ అండ్ డివైజెస్' అంశంపై సిటీ కాలేజీలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైనది. మొదటి రోజు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై వీసీ రవీందర్ మాట్లాడుతూ సామాజిక తత్వానికి వైజ్ఞానిక శాస్త్రాల పరిశోధనలకు మధ్య అంతర్గత సంబంధం ఉండాలన్నారు. సరికొత్త ఆలోచనలు, నూతన పరిశోధనలతో ముందుకు వచ్చే విద్యార్థులకు వర్సిటీ తరఫున ప్రోత్సాహం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. మార్కుల కోసం కాకుండా నైపుణ్యాలను సముపార్జించుకోవడం పైనే విద్యార్థులు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. డిగ్రీలో సైన్స్ చదువుకున్న విద్యార్థులు తమకిష్టమైన కోర్సులో పీజీ చేసే అవకాశం ఉస్మానియా వర్సిటీలో మాత్రమే ఉన్నదని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించడంలో సిటీ కళాశాల అగ్రభాగాన నిలిచిందన్న ఆయన, ఇందుకు కారణమైన ప్రిన్సిపాల్ డా.బాల భాస్కర్‌ను, సిబ్బందిని అభినందించారు.

ఎనర్జీ టెక్నాలజీని విస్తృత పరుచుకోవాలి: కరుణా సాగర్

గౌరవ అతిథిగా పాల్గొన్న ఓయూ సైన్స్ విభాగం డీన్ ఆచార్య డి.కరుణా సాగర్ మాట్లాడుతూ పర్యావరణహితమైన వైజ్ఞానిక ఆవిష్కరణలను, శక్తి సంబంధమైన సాధనాలను నూతనంగా రూపొందించుకోవాల్సిన అవసరముందన్నారు. కాలానుగుణమైన ఎనర్జీ టెక్నాలజీని విస్తృత పరుచుకోవాలన్నారు. ఏఆర్‌సీఐ అసోసియేట్ డైరక్టర్ డా.పి.కె. జైన్ మాట్లాడుతూ పాఠ్యాంశాల ద్వారా నేర్చుకున్న పరిజ్ఞానాన్ని సామాజిక వికాసానికి ఎలా వినియోగించుకోవాలో విద్యార్థులకు శిక్షణనివ్వాలని అధ్యాపకులకు సూచించారు.



సదస్సులో మాట్లాడుతున్న ఉస్మానియా యూనివర్సిటీ వీసీ రవీందర్

సవాళ్లను ఎదుర్కొనే పరిశోధనలపై దృష్టి పెట్టాలి: బాలభాస్కర్

సభకు అధ్యక్షత వహించిన సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బాలభాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజం ఎదుర్కొనే సవాళ్ళను అధిగమించటానికి అవసరమైన పరిశోధనలపై శాస్త్రవేత్తలు, ఆచార్యులు దృష్టి పెట్టాలన్నారు. ఐఐసీటీ సంస్థ శాస్త్రవేత్త ఆచార్య ఎం. వసుంధర, ఉస్మానియా విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగం అధ్యక్షుడు ఆచార్య ఎం శ్రీనివాస్ విశిష్ఠ అతిథులుగా పాల్గొన్నారు. సదస్సు సమన్వయ కర్త డాక్టర్ కె .పర్వతాలు జాతీయ సదస్సు లక్ష్యాలలను వివరించారు. భౌతికశాస్త్ర విభాగం అధ్యక్షురాలు డా. నైన వినోదిని, సదస్సు సహాయ సమన్వయ కర్త డా.వాసు దేవరెడ్డి, డా. చిన్ని కృష్ణ, డా. లక్ష్మీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవదత్ శుక్ల, డా. యాదయ్య, డా.రత్నప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రచురించిన సదస్సు ప్రత్యేక సంచికను వైస్ చాన్సలర్ రవీందర్ ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ బాలభాస్కర్ అతిథులను సన్మానించారు.

మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ కొత్తకోట

ప్రతిభ కనబరిచిన పోలీసులకు రివార్డులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గోషామహల్ పోలీస్ డివిజన్ ఆధ్వర్యంలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ.. మోడల్ కోడ్ ఆఫ్ కండక్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు అసిస్టెంట్ ట్రైనీ ఇన్‌చార్జి అధికారి శంకర్, చంద్రశేఖర్ (ఏఎస్ఐ చత్రినాక), కానిస్టేబుళ్లు తరుణ్, సందీప్, ప్రవీణ్‌లను అభినందించి రివార్డులు అందజేశారు.

ఆయన వెంట సౌత్ వెస్ట్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, గోషామహల్ ఏసీపీ వెంకటరెడ్డి, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఇతర సిబ్బంది ఉన్నారు.



పోలీస్ అధికారులను అభినందిస్తున్న సీపీ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశ్నిస్తున్నందుకే నాపై సస్పెన్షన్ వేటు

- కాంగ్రెస్ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్

పంజాగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పది సంవత్సరాల పాటు జరిగిన దోపిడీపై నిరంతరం ఉద్యమించా. కాంగ్రెస్ ఐడియాలజీని పాటిస్తూ.. పూర్తిగా పార్టీ ఆర్గనైజేషన్‌కు అంకితమయ్యా. ప్రశ్నిస్తున్నందుకే నాపై సస్పెన్షన్ వేటు వేశారు' అని కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్ ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు లాభం చేయడానికే రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, బీజేపీ అత్యధిక సీట్లు గెలవాలని ఆయన కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కేసీఆర్ రైతులకు రైతుబంధు పథకం కింద ఇవ్వాలని పెట్టిన రూ.7వేల కోట్లను ప్రస్తుత సీఎం ఏమి చేశారని, ఇప్పటి వరకు కాంగ్రెస్ బ్యానర్ కింద చేసిన ఉద్యమాలను కొనసాగించడానికే తెలంగాణ వనరుల రక్షణ సమితిని ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తన సస్పెన్షన్, భవిష్యత్ కార్యక్రమాలపై ఆయన మాట్లాడారు. తనకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ చిన్నారెడ్డి వివరణ ఇవ్వాలని నోటీస్ ఇచ్చారని, ఫిర్యాదులు ఏమిటో చెప్పాలని అడిగినా.. అప్పటికే తీసుకున్న నిర్ణయం ప్రకారం తనను సస్పెండ్ చేశారన్నారు. వివిధ శాఖల్లో నిధుల దుర్వినియోగంపైన ఈడీకి, సీబీఐకి, కొందరి రాజకీయ నేతల అవినీతిపై తను చేసిన ఎన్నో ఫిర్యాదుళ గురించి వివరించారు. ప్రాణభయం, రాజకీయ భవిష్యత్‌పై ఆశ వదిలేసి కల్వకుంట్ల కుటుంబంపై పోరాటం చేశానన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ఓటు వేస్తా, వేయిస్తా అని అన్నారు. నేను ఎవరి చేతుల్లో ఆయుధం కాదన్నారు. అన్నింటిపైన ప్రశ్నిస్తున్న తనను సస్పెండ్ చేశారని, అయినా పార్టీమారే పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ డీజీ అభిలాష బిస్త్, పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ మధుకర్ స్వామి

విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా

అవగాహన కల్పించాలి: అడిషనల్ డీజీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వినియోగిస్తున్న వారిలో యువత ఎక్కువగా ఉన్నారని, వారికి డ్రగ్స్ అలవాటు కాకుండా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలతో పాటు చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీజీ అభిలాష బిస్త్ అన్నారు. అంబర్‌పేట పోలీస్ శిక్షణ కళాశాలలో డ్రగ్స్ రహిత సమాజం అనే అంశంపై బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ అభ్యర్థులతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. శిక్షణ పొందిన పోలీసులు సర్వీసులో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు వారిని అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ పరవస్తు మధుకర్ స్వామి కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల విజేతలకు ప్రశంశాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డీఎస్పీ పిచ్చయ్య, డీఎస్పీలు ఉమామహేశ్వరరావు, లక్ష్మణ్, మదన్‌మోహన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంపుపై ఈసీఐ ప్రత్యేక దృష్టి

- రైల్వేశాఖ, పెట్రోలియం సంస్థలతో ఒప్పందం

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రత్యేక దృష్టి సారించింది. ఓ వైపు స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్) ఓటు ప్రాముఖ్యతపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూనే.. రైల్వేశాఖ, పెట్రోలియం సంస్థల ద్వారా కూడా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో రైల్వేశాఖతోపాటు, పెట్రోలియం సంస్థలతో ఈసీఐ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థల ద్వారా చేపట్టే ఓటరు అవగాహనా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సీఈఓ వికాస్‌రాజ్ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రైల్వే పెట్రోలియం సంస్థల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో రైల్వే, పెట్రోలియం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ..

పరీక్షల విభాగంలో గందరగోళం

- ఫలితాల కోసం విద్యార్థుల ఎదురుచూపు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ పరీక్షల విభాగంలో మరోమారు గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. గతంలో మూడో ఏడాది బీటెక్ విద్యార్థుల ఫలితాల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడగా, ప్రస్తుతం మొదటి సంవత్సరం విద్యార్థులు అదే తరహా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు బాగా రాసినప్పటికీ కొందరు విద్యార్థులకు సంబంధించి.. రిజల్ట్ ప్రాసెసింగ్‌లో లోపాలు తలెత్తినట్లు తెలిసింది. ఈ కారణంగా ఎక్కువమంది విద్యార్థులకు సున్నా మార్కులు వచ్చినట్లు మెమోల్లో కనిపిస్తున్నట్లు సమాచారం. సెమిస్టర్ పరీక్షలు పూర్తయి రెండు నెలలవుతున్నా ఫలితాలు రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతుండగా, లోపాలను సరిదిద్దలేని పరిస్థితుల్లో పరీక్షల విభాగం అధికారులకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. గతానికి భిన్నంగా ఈ ఏడాది పరీక్షల మూల్యాంకనం విధానంలో తెచ్చిన మార్పులే ఈ పరిస్థితికి కారణంగా తెలుస్తోంది. గతంలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ప్రొఫెసర్ నర్సింహారెడ్డి ప్రస్తుతం కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఈయన పరీక్షల విభాగానికి ఇన్‌చార్జ్‌గా ఉన్నప్పుడు.. ఆన్సర్ బుక్‌లెట్ వారీగా మూల్యాంకనం బదులు ప్రశ్నల వారీగా మూల్యాంకన విధానాన్ని ప్రవేశపెట్టారు.

ఆన్‌డ్యూటీలో ప్రిన్సిపాల్ బిజీబిజీ

మూల్యాంకన విధానంలో మార్పుల గురించి కొత్తగా వచ్చిన వైస్‌ప్రిన్సిపాల్ కుగానీ, పరీక్షల విభాగం అధికారులకు గానీ అవగాహన లేకపోవడంతో సకాలంలో ఫలితాలు ఇవ్వలేక సతమవుతున్నారు. కొత్త విధానంపై అవగాహన ఉన్న ప్రిన్సిపాల్.. 2,500 మంది విద్యార్థుల సమస్యను గాలికి వదిలేసి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల నిర్వహణ పనుల్లో మునిగిపోయారని విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. కీలక బాధ్యతల్లో ఉన్న అధికారికి ఆన్‌డ్యూటీలో టీఎస్‌పీఎస్‌సీ బాధ్యతలు అప్పగించడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రిన్సిపాల్ అందుబాటులో ఉండకపోవడంతో పరీక్షల విభాగం అధికారులు, కళాశాలలో చదువుతున్న సుమారు 8,500 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల బాగోగులను పట్టించుకునే ప్రొఫెసర్‌ను ప్రిన్సిపాల్‌గా నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. ఫస్టియర్ ఫలితాలను సకాలంలో విడుదల చేయలేకపోవడంపై ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ప్రిన్సిపాల్ కాలేజీయేతర (ఆన్‌డ్యూటీ) పనుల్లో బిజీగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న

ముగ్గురి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): యాంఫిటమైన్ డ్రగ్ విక్రయిస్తున్న ముగ్గురిని ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, గోల్కొండ పోలీసులతో కలిసి అరెస్ట్ చేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన రేకపల్లి రవీంద్రబాబు అలియాస్ నోయెల్ (26), మణికొండలో ఉంటున్న ఒంగోలు వాసి షేక్ ఇస్మాయిల్ గుంటూరుకు చెందిన లీలా వెంకటేశ్వర్లు వద్ద యాంఫిటమైన్ కొనుగోలు చేసి అధిక ధరకు ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మణికొండకు చెందిన ఆరతుపూడి విజయ్... షేక్ ఇస్మాయిల్‌కు యాంఫిటమైన్ కొనుగోలుకు డబ్బులిచ్చి సహకరించేవాడు. వచ్చిన ఆదాయాన్ని కలిసి పంచుకునేవారు. లీలా వెంకటేశ్వర్లు నుంచి 10 గ్రాముల యాంఫిటమైన్ రూ. 6 వేలకు కొనుగోలు చేసి రవీంద్రబాబు సహకారంతో రూ.7 వేలకు విక్రయిస్తున్నారు. వీరి దందాపై సమాచారమందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం గోల్కొండ జీషాన్ హోటల్ వద్ద దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.12 లక్షల విలువైన 16 గ్రాముల యాంఫిటమైన్, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. లీలా వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

డబ్బులు డిమాండ్ చేస్తున్న మాయలేడీ అరెస్ట్



నిందితురాలు బింగంపల్లి అరుణ

బౌద్ధనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్లు, ఇతర ప్రధాన కూడళ్ల వద్ద ప్రయాణికులను బెదిరించి డబ్బులు కాజేస్తున్న మాయలేడీని చిలకలగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ఎస్సై బాలరాజు కిషోర్, కరుణాకర్ రెడ్డి వివరాలు వెల్లడించారు.... మల్కాజిగిరి, వాణినగర్‌కు చెందిన బింగంపల్లి భాగ్య అలియాస్ అరుణ (45) సులువుగా డబ్బు సంపాదించేందుకు అడ్డదారులు ఎంచుకుంది. సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ బస్టాపుల్లో ఉన్న వారితో మాటలు కలిపి వ్యక్తిగత విషయాలపై ఆరా తీస్తుంది. అనంతరం వారి చేయి పట్టుకుని అల్లరి చేస్తుంది. బెదిరించి డబ్బులు వసూలు చేస్తుంది. ఈనెల 2న చిలకలగూడ, శ్రీనివాస్‌నగర్‌కు చెందిన కృష్ణన్ దక్షిణామూర్తి సికింద్రాబాద్ రెతిఫైల్ బస్టాండ్ వద్ద వేచి ఉండగా అరుణ అతనితో మాటలు కలిపింది. ఒక్కసారిగా అతని చేయి పట్టుకుని అల్లరి చేసింది. రూ. 5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఆమెను పట్టించుకోకుండా దక్షిణామూర్తి బస్సు ఎక్కగా వెంటబడింది. కేసు పెడతానని బెదిరించింది. భయపడ్డ బాధితుడు ఏటీఎం కేంద్రం నుంచి రూ. 10 వేలు డ్రా చేసి ఇచ్చాడు. చిరునామా తెలుసుకున్న అరుణ రెండు రోజుల తరువాత కుమార్తె విద్యాలక్ష్మీతో కలిసి దక్షిణామూర్తి ఇంటికి వెళ్లింది. డబ్బు ఇవ్వాలని అతడి భార్యను డిమాండ్ చేసింది. కొన్నిరోజుల తరువాత కొంతమందిని తీసుకెళ్లి ఇంటి వద్ద అల్లరి చేసింది. వేధింపులు భరించలేక దక్షిణామూర్తి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బుధవారం అరుణను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రజల్ని బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నట్టు వెల్లడికావడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితురాలిని పట్టుకున్న సీఐ, ఎస్సైలు, కానిస్టేబుళ్లకు ఏసీపీ జైపాల్ రెడ్డి నగదు రివార్డును ప్రకటించారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/91Fp8o7 లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.



సెమినార్‌లో సీబీఐటీ కాలేజీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

దేశ భవిష్యత్, ఆర్థికాభివృద్ధికి

నూతన ఆవిష్కరణలు దోహదం

నార్సింగ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేశభవిష్యత్, ఆర్థికాభివృద్ధికి నూతన ఆవిష్కరణలు దోహదం చేస్తాయని సీబీఐటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీవీ నరసింహులు పేర్కొన్నారు. బుధవారం చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)లో 'నూతన ఆవిష్కరణలు- ప్రోత్సాహం'పై సెమీనార్ నిర్వహించారు. ప్రాథమికశాస్త్రం, అనువర్తిత శాస్త్రం, లైఫ్ సైన్స్, ఇంజనీరింగ్ సామాజిక శాస్త్రం, వ్యాపార అధ్యయనాలలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై ప్రిన్సిపాల్ నరసింహులు ప్రసంగించారు. విద్యార్థులు ప్రదర్శించిన పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను పరిశీలించిన ఆయన సంతృప్తిని వ్యక్తంచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు పునాది వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

- సిటీ ఆటో మోటార్ క్యాబ్ వెల్ఫేర్ ప్రతినిధులు

చార్మినార్ ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మీ పథకంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సిటీ ఆటో మోటార్ క్యాబ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మైమూద్ మక్కీ, హమీం మక్కీ, కాజం అలీఖాన్ కోరారు. బుధవారం రవాణశాఖ జాయింట్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అదేవిధంగా అర్హులైన డ్రైవర్లకు ప్రతి సంవత్సరం 15 వేల ఆటోలకు పర్మిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

'మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు'

చార్మినార్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ఇఫ్తార్ విందులు ప్రతీక అని బడంగ్‌పేట్ కార్పొరేటర్లు మనోహర్, బాలునాయక్ అన్నారు. బుధవారం సాయంత్రం షరీఫ్‌నగర్‌లో రియాజ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో ధనవంతులు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి పేదలను ఆహ్వానించాలన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

నార్సింగ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని అధికారులు కూల్చివేశారు. గండిపేట మండలం హిమాయత్‌సాగర్ గ్రామం, సర్వేనంబర్ 37లోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్న విషయం తెలుసుకున్న గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం సాయంత్రం రెవెన్యూ సిబ్బందితో అక్కడికి వచ్చి ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయించారు. నాలాలో పోసిన మట్టిని తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు, నాలాలు ఎవరూ కబ్జా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



షోయిబ్ హోటల్ చౌరస్తా వద్ద తొలగించిన భారీ కేడ్లు

చౌరస్తాలో బారికేడ్ల తొలగింపు

చార్మినార్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హఫీస్ బాబా నగర్ సోయాబ్ హోటల్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన బారికెడ్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో జంక్షన్ వద్ద బారికేడ్లు వాహనదారులకు ఇక్కట్లు అని శీర్షికతో వచ్చిన కథనానికి పోలీస్ అధికారులు స్పందించారు. బారికేడ్ల ఏర్పాటుతో ఫూల్‌బాగ్, నాసిబ్‌నగర్, గుల్షన్ ఇక్బాల్‌కాలనీ, హాఫిజ్‌బాబా నగర్ ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా 'ఆంధ్యజ్యోతి'కి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.



నకిలీ కరెన్సీతో నిందితులు

నకిలీ కరెన్సీ చెలామణి చేస్తున్న

అంతర్రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్

హైదరాబాద్ సిటీ/ పహాడిషరీఫ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను మహేశ్వరం ఎస్ఓటీ, బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర, జూనా జల్నా ప్రాంతానికి చెందిన షేక్ హరూన్(40) గతంలో నకిలీ నోట్లు చెలామణి చేస్తుండగా ఔరంగాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. జైలు నుంచి బయటకు వచ్చాక ఔరంగాబాద్‌కు చెందిన ఆటోడ్రైవర్లు సయ్యద్ సాగిర్(30), జాకీర్ సయ్యద్(35), అలీ అఫ్తాబ్ అక్తర్(36)ను కలుపుకొని ముఠా ఏర్పాటుచేశాడు. వీరు కారులో తిరుగుతూ అసలుకు మూడు రెట్లు నోట్లు ఇస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. నమ్మి వచ్చిన వ్యక్తులకు నోట్ల కట్టల్లో ముందు, వెనుక అసలు నోట్లు ఉంచి, మధ్యలో చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నోట్లు ఉంచి మోసం చేస్తున్నారు.

సమాచారం అందుకున్న ఎస్ఓటీ, బాలాపూర్ పోలీసులు హరూన్, సయ్యద్ సాగిర్, జాకీర్ సయ్యద్, అఫ్తాబ్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.25 లక్షల విలువైన చిల్డ్రన్ బ్యాంకు నోట్లు, నిసార్ కారు, 4 స్మార్ట్‌ఫోన్లు, 3 చిన్నఫోన్లు, రూ. 8,420 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మజీద్‌పూర్‌లోకి వచ్చిన జింక

● అటవీ ప్రాంతంలో వదిలిన గ్రామస్థులు


గ్రామంలోకి వచ్చిన జింక

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామంలోని పంటపొలాల వద్దకు బుధవారం జింక వచ్చింది. అటుగా వెళ్తున్న మందుగుల బాల్‌రాజ్‌కు పొలాల వద్ద జింక కనిపించడంతో విషయాన్ని వెంటనే గ్రామ మాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డితో పాటు గ్రామస్థులకు తెలిపాడు. వారు వచ్చి జింకని పట్టుకున్నారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారి సూచన మేరకు దుప్పిని తిరిగి అటవీ ప్రాంతంలో వదిలేశారు. గతంలో కూడా గ్రామంలోకి జింక వచ్చినట్లు మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పీర్లగూడెం అటవీ ప్రాంతం నుంచి జింక గ్రామంలోకి వచ్చి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

పన్ను వసూలు.. ప్రశంసా పత్రాలు

● అధికారులు, ఉద్యోగులను అభినందించిన కమిషనర్



చీఫ్ వాల్యూయేషన్ ఆఫీసర్ మహేష్‌కులకర్ణికి ప్రశంసాపత్రం అందజేస్తున్న రోనాల్డ్‌రోస్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో రికార్డు స్థాయి ఆస్తి పన్ను వసూలు కావడంపై రెవెన్యూ విభాగం అధికారులు, ఉద్యోగులను కమిషనర్ రోనాల్డ్‌రోస్ అభినందించారు. బుధవారం బంజారా భవన్‌లో వారితో గెట్ టుగెదర్ ఏర్పాటు చేశారు. అనంతరం రోనాల్డ్‌రోస్ మాట్లాడుతూ.. సమష్టి కృషి వల్లే గతం కంటే ఎక్కువగా పన్ను వసూలు సాధ్యమైందన్నారు. గతేడాది ఎర్లీబర్డ్‌లో రూ.740 కోట్ల పన్ను వసూలైందని, ఈ దఫా రూ.800 కోట్ల వరకు వస్తుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా అత్యధికంగా పన్ను వసూలు చేసిన బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, డిప్యూటీ మునిసిపల్ కమిషనర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించిన అదనపు కమిషనర్ స్నేహశబరీష్, చీఫ్ వాల్యూయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణిలను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రూ.3067 కోట్ల ఆదాయం

● ఉప రవాణాకమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్

నార్సింగ్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో రూ.3,143 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించగా రూ.3067 కోట్ల ఆదాయాన్ని సాధించామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణాకమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధికారులతో ఉప రవాణాకమిషనర్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఆదాయంతో పోలిస్తే 9.9 శాతం వృద్ధి రేటు సాధించామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా రూ.1,689 కోట్లు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రూ.1,298 కోట్లు, వికారాబాద్ రూ.80 కోట్లు కలిపి రూ.3,067 కోట్లు ఆదాయం సాధించామని ఆయన వివరించారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు పన్నులు చెల్లించాలని లేని పక్షంలో తనిఖీలలో పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తామని చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఓవర్‌లోడ్‌తో తిరిగే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని అన్నారు. 2024-2025లో కూడా ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీవోలు రఘునందన్, సుభాష్‌చందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయినా చెత్త ఎత్తరు..!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాల్లో చెత్త తొలగిస్తోన్నా.. నిఘా లేకపోవడంతో 10-15 నిమిషాలకే మళ్లీ చెత్త పేరుకుపోతోంది. రోడ్ల పక్కన చెత్త రవాణా బాధ్యతలు రాంకీ సంస్థకు అప్పగించి చేతులు దులుపుకున్న జీహెచ్ఎంసీ.. ఆ ఏజెన్సీ ఎలా పని చేస్తుందన్నదీ పర్యవేక్షించడం లేదు. దీంతో నగరంలో రోడ్లపై పేరుకుపోతోన్న చెత్తకుప్పల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. అటు కాలనీలు, బస్తీల్లో రహదారులపై స్వీపింగ్ జరగక.. ఇటు చెత్త కుప్పలు ఎత్తక దుర్వాసనతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

పీసీబీలో పడకేసిన పాలన

● సమయానికి రాని ఉద్యోగులు
● అందుబాటులో ఉండని ఉన్నతాధికారులు
● పారిశ్రామిక ప్రతినిధులకు తప్పని పడిగాపులు



తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో పాలన పడకేసింది. నగరంలో ని పీసీబీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కూడా సమయపాలన పాటించడం లేదు. మరోవైపు కొన్ని కీలక విభాగాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు సైతం పనివేళల్లో కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని.. వివిధ పనుల నిమిత్తం దూరప్రాంతాల నుంచి పీసీబీకి వచ్చిన పరిశ్రమల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. కార్యాలయానికి పెద్దదిక్కుగా ఉండాల్సిన సభ్య కార్యదర్శి సైతం.. ప్రతిరోజూ కార్యాలయానికి రాకుండా.. అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని, దీంతో ఆవు చేలో మేస్తే దూడగట్టున మేస్తుందా అన్నట్లుగా సిబ్బంది కూడా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. కేవలం వారానికి ఒకరోజు మాత్రమే సభ్య కార్యదర్శి కార్యాలయానికి వస్తుండడంతో, సిబ్బంది కూడా ఆ రోజు వినహా మిగిలిన రోజుల్లో ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నట్లు సమాచారం.

సదస్సుకు పిలిచి.. పట్టించుకోరేం..!

మంగళవారం ఉదయం 10 గంటలకు బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై సదస్సులో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు పీసీబీకి రాగా, మధ్యాహ్నం 12 గంటల వరకు సదస్సు నిర్వాహకులు గానీ, సంబంధిత విభాగం ఉద్యోగులు గానీ వారిని పట్టించుకోలేదు. ఉదయం 10గంటలకు రావాల్సిన ఉద్యోగులు మధ్యాహ్నం 12 గంటల వరకు రాకపోవడంతో పలు విభాగాల్లో ఖాళీసీట్లే దర్శనమిచ్చాయి. పలువురు సిబ్బంది.. వారికి కుదిరిన వేళల్లో ఆఫీసుకు వస్తుండంతో.. పనిమీద కార్యాలయానికి వచ్చిన తాము రిసెప్షన్‌లోనే పడిగాపులు కాయాల్సివస్తోందని, విలువైన సమయం వృథా అవుతోందని పలు పరిశ్రమల నుంచి వచ్చిన ప్రతినిధులు వాపోతున్నారు. ఇంకోవైపు ఉదయం 10గంటలకే ఆఫీసుకు వచ్చిన అధికారులు కొందరు బయోమెట్రిక్ హాజరు వేసి.. వెనువెంటనే బయటకు వెళ్లి సొంతపనులు చక్కబెట్టుకుంటున్నారనే ఆరోపణలు కిందిస్థాయి సిబ్బంది నుంచి వ్యక్తమవుతున్నాయి. కీలకమైన కాలుష్య నియంత్రణ మండలికి పూర్తిస్థాయి సభ్యకార్యదర్శిని ప్రభుత్వం నియమించక పోవడం, మూడేళ్లుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఉన్నతాధికారి రెగ్యులర్‌గా కార్యాలయానికి రాకపోతుండడంతో పాలన పడకేసిందని చెబుతున్నారు. ప్రభుత్వం ఈ విషయమై దృష్టి సారించాలని, తక్షణమే పీసీబీకి పూర్తిస్థాయి సభ్య కార్యదర్శిని నియవించాలని డిమాండ్ చేస్తున్నారు.

మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి

● జాజుల శ్రీనివాస్‌గౌడ్


దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, పలు సంఘాల నేతలు

బర్కత్‌పుర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బహుజన మహనీయుల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసి వారి జయంతి వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బహుజన మహనీయులు దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న, ప్రొఫెసర్ జయశంకర్, మారోజు వీరన్న, కృష్ణ స్వామి ముదిరాజుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని ఆయన డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం బీసీయువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 97వ జయంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల చైర్మన్ కుందారం గణేషాచారి, గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, బీసీ ఏ కులాల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ భాగయ్య, ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిట్ల నాగేష్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ జనసేన రాష్ట్ర అధ్యక్షుడు సింగం నాగేష్ పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

రాంనగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానం-2020 జాతీయ పాఠ్య ప్రణాళిక ఫ్రేమ్ వర్క్- 2023ను తీసుకువచ్చిందని, ఈ నూతన విధానాలను రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు.బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ, అఖిల భారత విద్యా హక్కు వేదికల ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై సమావేశం జరిగింది. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, అఖిల భారత విద్యాహక్కు వేదిక, పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు కె.ఎస్.ప్రదీప్, అల్లూరి విజయ్, ఎం.సోమయ్య, పవన్, గడ్డం శ్యామ్, బి.కృష్ణ, రవికుమార్, పి.మహేష్, నామాల ఆజాద్, ఎం.ఎస్.కృష్ణప్ప తదితరులు హాజరై మాట్లాడారు. దేశంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని, విదేశీ విశ్వవిద్యాలయాలను దేశంలోకి అనుమతించొద్దని అన్నారు. జ్యోతిష్యం, భూతవైద్యం వంటి అశాస్త్రీయ కోర్సులను ప్రవేశపెట్టడం మానుకోవాలని సూచించారు. కేజీ నుంచి పీజీ వరకు అందరికీ సమానమైన నాణ్యమైన ఉచిత విద్య కోసం పూర్తిగా ప్రభుత్వ నిధులతో కూడిన ఉమ్మడి విద్యా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. విద్యా సంస్థలలో అలహాబాద్ హైకోర్టు తీర్పును అమలు చేయాలని వారన్నారు. విద్యను ఉమ్మడి జాబితా నుంచి తిరిగి రాష్ట్ర జాబితాలోకి తీసుకురావాలన్నారు. విద్యా కాషాయీ, హిందూత్వీకరణను వెంటనే నిలిపివేయాలని, కేంద్ర బడ్జెట్‌లో కనీసం 15 శాతం విద్యకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

కొత్తగా వర్టికల్ నీటి శుద్ధి ప్లాంట్లు

(5వ పేజీ తరువాయి)

ప్రతీ రోజు 24 మిలియన్ గ్యాలన్ల నీటిని తీసుకుంటున్నారు. మే లో 40 ఎంజీడీల నీరు వాడుకునేందుకు వాటర్‌బోర్డు ప్రణాళికలు రూపొందించింది.

నాగార్జునసాగర్ నుంచి
1,254 మిలియన్ లీటర్లు

నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 136.47 టీఎంసీల నీరు ఉంది. 131.66 టీఎంసీల వరకు డెడ్ స్టోరేజీ లభ్యత ఉంది. డెడ్ స్టోరేజీ ఉన్నా.. 4.81 టీఎంసీల నీరు వాడుకోవచ్చు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 4 నెలలకుగానూ 5.60 టీఎంసీల నీరు అవసరం కాగా, ప్రస్తుతం రోజుకు 1,254.33 మిలియన్ లీటర్ల నీటిని నగరానికి తరలిస్తుండగా, సాగర్‌లో నీటిమట్టం తగ్గుతున్న నేపథ్యంలో ఎమర్జెన్సీ పంపింగ్‌కు వాటర్‌బోర్డు ఇప్పటికే ఏర్పాట్లు చేసింది. నాగార్జున సాగర్ నుంచి ఈ నెల 15న ప్రారంభించనున్నారు.

ఎల్లంపల్లి నుంచి
741 మిలియన్ లీటర్లు

ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 7.71 టీఎంసీల నీరుండగా, 3.31 టీఎంసీల వరకు డెడ్ స్టోరేజీ లభ్యత ఉంది. అయినా.. 4.40 టీఎంసీల నీరు వాడుకోవచ్చు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 4నెలలకుగానూ 3.33టీఎంసీల గోదావరి జలాలు అవసరం కాగా, రోజుకు 741.45మిలియన్ లీటర్ల నీటిని తరలిస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గుతుండడంతో మే ఒకటో తేదీ నుంచి ఎమర్జెన్సీ పంపింగ్‌ను ప్రారంభించనున్నారు.

గోదావరి జలాలు పూర్తిగా నగరానికే..

గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై పథకంలో భాగంగా ఎల్లంపల్లి నుంచి ప్రతి రోజూ నగరానికి 741.45 మిలియన్ లీటర్లు తరలిస్తుండగా, అందులోనే కొంత నీటిని మిషన్ భగీరథకు మళ్లిస్తున్నారు. యాదాద్రి, మెదక్, మేడ్చల్ జిల్లాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం పూర్తి కాలేదు. దాంతో గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై పథకంలో హైదరాబాద్‌కు తరలించే నీటి నుంచి రోజుకు 149.47 మిలియన్ లీటర్లను మిషన్ భగీరథకు గత ప్రభుత్వ ఆదేశాల మేరకు మళ్లించారు. గజ్వేల్, ఆలేరు, భువనగిరి, మేడ్చల్ ప్రాంతాలకు వాటర్‌బోర్డు నీరే సరఫరా అవుతోంది. మిషన్ భగీరథ పైపులైన్ పనులు ఆ జిల్లాల్లో పూర్తయితే అటు మళ్లించిన నీటిని నగరానికి తరలించే అవకాశాలున్నాయి. దాంతో ఎల్లంపల్లి నుంచి తీసుకొస్తున్న గోదావరి జలాలు పూర్తిగా నగరానికి రానున్నాయి.

గంటల కొద్దీ చార్జింగ్ వద్దు

(5వ పేజీ తరువాయి)

ఎలక్ట్రికల్ బ్యాటరీల నిపుణులు చెబుతున్నారు.

పెరుగుతున్న డిమాండ్..

నగరంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. 2024 ఫిబ్రవరి నాటికి 40 వేల ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు, 600కు పైగా ఆటోలు, 4 వేలకు పైగా కార్లు, 2,500 కమర్షియల్ వాహనాలు తిరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. రెండేళ్లుగా ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ రెట్టింపు అయిందని డీలర్లు వెల్లడించారు. పలు కంపెనీలు విభిన్న రకాల మోడల్స్‌ను మార్కెట్లోకి తెస్తున్నా, క్షేత్రస్థాయిలో బ్యాటరీల నాణ్యత తనిఖీ వ్యవస్థ లేదు. కొంతమంది తక్కువ ధరకు లభించే అసెంబుల్డ్ బ్యాటరీలతో తయారు చేసిన ఎలక్ట్రిక్ వాహనాలను మార్కెట్లోకి తెస్తున్నారని ఎలక్ట్రికల్ ఇంజనీర్ రాజ్ మహరాజ్ తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనాల్లో వాడే బ్యాటరీ భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ప్రముఖ కంపెనీల డీలర్లు కోరుతున్నారు.


70 శాతం ప్రమాదాలు బీఎంఎస్ వల్లే..

ఏ బ్యాటరీలో అయినా లిథియం అయాన్ వాడుతారు. అయితే, బ్యాటరీ ధర ఆధారంగా దాని నాణ్యత ఆధారపడి ఉంటుంది. ఇప్పటి వరకు ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల్లో జరిగిన ప్రమాదాల్లో 70శాతం బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టం(బీఎంఎస్) పనిచేయకపోవడంతో జరగగా, మరో 30 శాతం మానవ తప్పిదాల వల్ల జరిగినట్లు అధికారులు గుర్తించారు. బ్యాటరీలకు ఏఆర్ఏఐ(ఆటోమోటివ్ రీసెర్చ్ ఆఫ్ ఇండియా), ఐ క్యాట్ టెస్ట్ చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తాయి. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ మార్గదర్శకాలు విడుదలైతే బ్యాటరీల తయారీ, నాణ్యతపై ప్రత్యేక దృష్టిసారించే అవకాశాలుంటాయని టీఎస్ రెడ్కోకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు.

చార్జింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● అసెంబుల్డ్, తక్కువ ధర కలిగిన వాహనాల కంటే ధర ఎక్కువైనా బ్రాండెడ్ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు ప్రాధాన్యం ఇవ్వాలి.
● ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలకు ఇళ్లల్లో చార్జింగ్ పెట్టకపోవడం మంచిది.
● చార్జింగ్ పాయింట్లను ఓపెన్ ప్లేస్‌లో ఏర్పాటు చేసుకోవాలి.
● బ్యాటరీ సామర్థ్యం ఆధారంగా మాత్రమే చార్జింగ్ పెట్టాలి.
● గంటల కొద్దీ చార్జింగ్ పెట్టి వదిలేస్తే నాణ్యత సరిగాలేని బ్యాటరీల్లో బీఎంఎస్ పని చేయక పేలిపోయే ప్రమాదముంది.
● బ్యాటరీ లోపల సెల్‌కు, సెల్‌కు మధ్య ఏర్పడే రాపిడి వల్ల తేమశాతం పెరిగి బ్యాటరీలో మంటలు వచ్చే అవకాశముంటుంది.
● చార్జింగ్ పెట్టినప్పుడు బ్యాటరీలపై నీళ్లు పడకుండా చూసుకోవాలి.

హోటల్‌లో అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బంజారాహిల్స్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఫిలించాంబర్‌లోని ఓ హోటల్‌లో అగ్నిప్రమాదం జరిగింది. స్వరుచి రెస్టారెంట్ కిచెన్ డక్‌లో బుధవారం పొగలు వచ్చాయి. కొద్దిసేపటికే కిచెన్‌లో మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు ఫిలింనగర్ అగ్నిమాపక సిబ్బంది రెండు వాహనాలతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్

నార్సింగ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ గ్రామం అంగడిబజార్ చౌరస్తాలో ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్ కారణంగా పేలింది. అక్కడ ఉన్న జనం రోడ్లపైకి పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ కోటిగారి ఉషారాణి అగ్నిమాపక, పోలీస్, ట్రాన్స్‌కో, మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక, ట్రాన్స్‌కో సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

నారెడ్కో తెలంగాణ అధ్యక్షుడిగా విజయసాయి



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) తెలంగాణ నూతన అధ్యక్షుడిగా విజయసాయి మేక ఎన్నికయ్యారు. ఇటీవల నారెడ్కో తెలంగాణ 28వ వార్షిక జనరల్ బాడీ సమావేశం నిర్వహించగా, నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండేళ్లపాటు కొనసాగుతుందని ప్రకటించారు. అధ్యక్షుడిగా విజయసాయి మేక, ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షులుగా కాళీప్రసాద్ దామెర, డాక్టర్ ఎల్ఎస్.వై.కిరణ్, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీధర్ రెడ్డి, కోశాధికారిగా ఆర్.వెంకటేశ్వరరావులు ఎన్నికయ్యారు.

తెలంగాణాలో అందుబాటులోకి బయోలిక్కర్స్

● డాక్టర్ శ్రీనివాస్ అమరనాథ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో బయోలిక్కర్స్ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు బయో లిక్కర్స్ వ్యవస్థాపకులు, తెలుగు ఆయుర్వేద డాక్టర్ శ్రీనివాస్ అమరనాథ్ తెలిపారు. బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో నిర్వహించిన ఓ సమావేశంలో 16 మూలికలతో తయారు చేసిన మద్యాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 18 సంవత్సరాల పరిశోధన ఫలితం తమ లిక్కర్ అన్నారు. తెలంగాణాలో తాము తొలుత టుడేస్ స్పెషల్ బయో విస్కీ, డైలీ స్పెషల్ బయో బ్రాందీ, వైల్డ్ ఫాక్స్ విస్కీ అనే మూడు బ్రాండ్‌లను విడుదల చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే బయో బీరును కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బయో గ్లోబల్ సేల్స్ హెడ్ జీవీ నాయుడు, బయో లిక్కర్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస రాయలు, బయో గ్లోబల్ మార్కెట్ హెడ్ ఆర్ పిళ్లై పాల్గొన్నారు.

బేగంపేటలో యువకుడి హత్య

బేగంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చిన్న పాటి ఘర్షణ యువకుడి హత్యకు దారితీసిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలంరాయి ప్రాంతంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలంరాయిలోని అంబేద్కర్‌నగర్‌లో బి.రాజు, యాదమ్మ దంపతులు నివసిస్తున్నారు. వీరి కుమారుడు తరుణ్(18) ఇంటర్ చదువుతున్నాడు. మంగళవారం రాత్రి 10గంటల సమయంలో తరుణ్ స్థానికంగా ఉన్న పాన్ దుకాణానికి వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ ఉన్న ఓ యువకుడి బుజం తరుణ్‌కు తగలడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో సదరు యువకుడు సమీపంలోని తన గదికి వెళ్లి మరో ముగ్గురిని తీసుకొచ్చాడు. వీరికి తరుణ్‌కు మధ్య ఘర్షణ పెద్దది కావడంతో ముగ్గురిలో ఒక యువకుడు కత్తి తెచ్చి తరుణ్‌ను కడుపులో పొడిచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో తరుణ్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు ఈ విషయాన్ని తరుణ్ తల్లి యాదమ్మకు తెలియజేయడంతో ఆమె అక్కడికు చేరుకుని కుమారుడుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లింది. అయితే, అప్పటికే తరుణ్ చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దీంతో తన కుమారుడిని చంపిన వారిపై యాదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

అద్దెకు తీసుకుని కార్లు అమ్మేస్తున్నారు..!

● ముగ్గురి అరెస్ట్.. పరారీలో ప్రధాన నిందితుడు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అద్దెకు తీసుకున్న కార్లను విక్రయించడంతోపాటు, తాకట్టు పెట్టుకొని సొమ్ము చేసుకుంటున్న ముఠాలోని ముగ్గురు సభ్యులను మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. రామగుండం ప్రాంతానికి చెదిన హరీశ్ కుందారపు, మద్దెల అభిషేక్(24), ఎల్కపల్లి కోమలేశ్వర్(22), ఏలూరి ప్రవీణ్ కుమార్(23) స్నేహితులు. అద్దె కార్లను తీసుకొని, వాటిని విక్రయించాలని పథకం వేశారు. ఇందులో భాగంగా హరీశ్ ఆన్‌లైన్‌లో లాంగ్‌డ్రైవ్‌లో కారు బుక్ చేసేవాడు. అభిషేక్, కోమలేశ్వర్, ప్రవీణ్ తమ ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్‌లు చూపించి, కార్లను తీసుకువచ్చి హరీశ్‌కు అప్పగిస్తే కారును బట్టి రూ.35 వేల నుంచి, రూ.50 వేల వరకు ఇచ్చేవాడు. ఈ కార్లను ఆదిలాబాద్‌కు తీసుకెళ్లి తనకు అత్యవసరంగా డబ్బు కావాలని చెప్పి, కారును తాకట్టు పెట్టడం, విక్రయించడం చేసేవాడు. కారును కొన్నవారికి పత్రాలు త్వరలో తెచ్చిస్తానని కాలయాపన చేస్తూ తప్పించుకుతిరుగుతున్నాడు. ఒక్కో కారును విక్రయించి రూ. 4లక్షల నుంచి రూ. 5లక్షల వరకు తీసుకొని విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడు. గతంలో మాదాపూర్ లాంగ్‌డ్రైవ్ కార్యాలయం నుంచి అభిషేక్ తన వివరాలు సమర్పించి హుందాయ్ క్రెటా కారును తీసుకెళ్లాడు. దాన్ని విక్రయించాడు. దందాలో భాగంగా మార్చి 30న హరీశ్ మాదాపూర్ లాంగ్‌డ్రైవ్ నుంచి మహీంద్రా థార్ కారును బుక్ చేశాడు. దీని కోసం కావాల్సిన అడ్వాన్స్ రూ.25,030ను అభిషేక్‌కు పంపాడు. అభిషేక్ ఆ డబ్బును మాదాపూర్ లాంగ్‌డ్రైవ్ కార్యాలయంలో చెల్లించి కారును తీసుకెళ్లేందుకు వచ్చాడు. లాంగ్‌డ్రైవ్ కార్యాలయ సిబ్బంది అభిషేక్ మహీంద్రా థార్ (టీఎస్ 08కేఈ3353), మహీంద్రా థార్ (టీఎస్ 07 కేబీ 7004), మారుతి ఎర్టిగా (టీఎస్ 09 ఎఫ్‌క్యూ 2058), ఇకో స్పోర్ట్స్ (టీఎస్ 34 జీ 00900), హుందాయ్ క్రెటా (టీఎస్ 08 జేఈ 0406) కార్లను తీసుకెళ్లినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారమందించారు. అభిషేక్‌ను అదుపులో తీసుకున్న పోలీసులు అతడిచ్చిన సమాచారం మేరకు కోమలేశ్వర్, ప్రవీణ్‌లను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు హరీశ్ కుందారపు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ పోలీస్ అధికారి శివానందరెడ్డిపై కేసు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూ దందాలు, అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ పోలీస్ అధికారి శివానందరెడ్డిని అరెస్టు చేయడానికి వెళ్లిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసుల దర్యాప్తును అడ్డుకొని, పారిపోయిన సంఘటనలో ఆయనపై కేసు నమోదైంది. ఏపీలోని నంద్యాలకు చెందిన మాండ్ర శివానందరెడ్డి గతంలో హైదరాబాద్‌లో పోలీస్ అధికారిగా పనిచేశారు. రిటైర్డ్ అయిన తర్వాత రియల్ దందా ప్రారంభించారు. రాజేంద్రనగర్ శివారు ప్రాంతమైన బుద్వేల్ పరిధిలో 1994లో సర్వే నంబర్ 282 నుంచి 299 వరకు ఉన్న 281 ఎకరాల వ్యవసాయ మిగులు భూమిని షెడ్యూల్డ్ కులాల వారికి కేటాయించింది. అనంతరం భూమిని ఆక్రమించుకున్న అసైనీలు ఈ భూములను ఎస్‌కే డెవలప్‌మెంట్‌కు లీజుకు ఇవ్వడంతో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల రెవెన్యూ డివిజన్ అధికారి పట్టాలు రద్దు చేశారు. ఈ భూమిని హెచ్ఎండీఏ, పర్యాటక శాఖకు అప్పగించారు. దీనిపై అసైనీలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండటంతో నిందతులు టీజే ప్రకాష్, కోనేరు గాంధీ, దశరథ రామారావు తదితరులు అసైనీలను సంప్రదించి వివాదాన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీరు స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే దయానంద్‌ను సంప్రదించారు. అతడు 2008లో శివానందరెడ్డిని సంప్రదించాడు. అతడు 2021- 22 మధ్య అసైనీలకు రూ.5 లక్షలు, రూ.10 లక్షల చెక్కులను అందించి, ఆ భూమిని శివానందరెడ్డి భార్య ఉమాదేవి, కనిష్కల పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ తరుణంలో అసైనీలను ప్రలోభపెట్టి, బెదిరించి ప్రభుత్వ నిబంధనలు తారుమారుచేసి ఆ భూమిని పక్కా ప్రణాళికతో లాక్కున్నట్లు సీసీఎస్ పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. అసైనీలతో అగ్రిమెంట్ చేయించుకున్న భూమిని యూఅండ్‌వీ ఇన్‌ఫ్రా పేరుతో రిజిస్టర్ చేయించారు. దీనిపై క్రైం నంబర్ 194/2022, 217/2022, 218/2022, 219/2022 సెక్షన్ 420, 406 ఐపీసీ, 120 (బీ), 34 సెక్షన్‌లతో కేసులు నమోదు చేశారు. కేసు విచారణలో భాగంగా ఆయన్ను తీసుకురావడానికి సీసీఎస్ పోలీస్ బృందం నంద్యాలకు వెళ్లింది. 'ఎలాంటి నోటీస్ లేకుండా నన్ను ఎలా ప్రశ్నిస్తారు' అని ఆయన నిలదీశాడు. దీంతో పోలీసులు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న క్రమంలో పోలీసులను అడ్డుకొని శివానందరెడ్డి అక్కడి నుంచి పారిపోయాడు. దాంతో బ్రాహ్మణ కొట్కూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ఊర్వశీబార్ అండ్ రెస్టారెంట్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

● మేనేజరుతో పాటు108 మందిని అరెస్ట్

బేగంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ఊర్వశీ బార్ అండ్ రెస్టారెంట్‌లో అనధికారికంగా నడుస్తున్న పబ్‌పై మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి పబ్ మేనేజరుతో సహా 108 మందిని అరెస్టు చేశారు. అనధికారికంగా పబ్ నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బేగంపేటలోని ఎయిర్‌పోర్టు పక్కన కొన్ని సంవత్సరాలుగా ఊర్వశీ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. కొన్ని నెలల క్రితం దీని నిర్వహణను ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తీసుకున్నారు. కొన్ని నెలలుగా పెద్ద సంఖ్యలో అమ్మాయిలు, అబ్బాయిలు వస్తున్నారు. అమ్మాయిల అశ్లీల నృత్యాలతో పాటు సౌండ్స్ రావడంతో స్థానికులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారు పట్టించుకోక పోవడంతో ఇదే ప్రాంతంలో ఇల్లు ఉన్న మంత్రి సోదరుని దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఊర్వశి బార్ అండ్ రెస్టారెంట్‌పై దాడి చేసి 108మందిని అదుపులోనికి తీసుకున్నారు. ఇందులో 33 మంది అమ్మాయిలు కాగా, 75 మంది పురుషులు ఉన్నారు. పోలీసులు దాడి చేసిన సమయంలో పబ్‌లో అశ్లీల నృత్య ప్రదర్శన జరుగుతుండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. అనధికారికంగా పబ్ నడుపుతున్న పార్వతి శ్రీశైలంపై కేసులు నమోదు చేశారు.

కౌన్సెలింగ్

ఈ నొప్పులు తప్పించుకోలేనా?

డాక్టర్! నా వయసు 18 ఏళ్లు! 14 ఏళ్ల వయసులో తొలి నెలసరి కనిపించింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ ప్రతి నెలా నెలసరి సమయంలో విపరీతమైన కడుపు నొప్పి, నడుము నొప్పితో ఇబ్బంది పడుతున్నాను. ఎన్నో మందులు వాడాను. కానీ ఈ సమస్య నుంచి ఉపశమనం పొందే సులువైన చికిత్సను సూచించగలరు?

QA

- ఓ సోదరి, కర్నూలు

స్త్రీల జీవితంలో కీలకమైన దశ ఇది. మహిళగా మారే క్రమంలో ఈ దశలోనే పునరుత్పత్తి వ్యవస్థ పూర్తి ఎదుగుదలకు చేరుకుంటుంది. అయితే కొందరు టీనేజీ అమ్మాయిలకు నెలసరి సమయంలో శారీరక అసౌకర్యం కలగడం సహజం. అయితే భావోద్వేగాలు అదుపు తప్పడం, నడుము, కాళ్లలో నొప్పులు, తలనొప్పి, అలసట మొదలైన అసౌకర్యాలు శరీర తత్వాలనుబట్టి మారుతూ ఉంటాయి.

వాత నెలసరి లక్షణాలు

ఈ తత్వం కలిగినవారికి నెలసరి ముందు నుంచి, లేదా నెలసరి మొదలైన వెంటనే విపరీతమైన నొప్పులు మొదలవుతాయి. పొత్తికడుపు, నడుములో తెరలు తెరలుగా నొప్పులు మొదలై కదలలేనంతగా పెరిగిపోతాయి.

పిత్త నెలసరి లక్షణాలు

నెలసరి ముందు కాకుండా రక్తస్రావం పెరిగిన వెంటనే నొప్పులు కూడా మొదలవుతాయి. పెద్ద రక్తపు గడ్డలు కనిపిస్తాయి. రాత్రివేళ విపరీతమైన రక్తస్రావంతో మెలకువ వస్తుంది. రక్తస్రావం సమయంలో తలతిరుగుడు, అయోమయం ఉంటుంది.

కఫ నెలసరి లక్షణాలు

నొప్పి తక్కువగానే ఉన్నా, తల భారంగా ఉంటుంది. మానసిక అయోమయం, గందరగోళం ఉంటుంది. అలసట కనిపిస్తుంది. ఈ లక్షణాలు నెలసరి మొదలైన క్షణం నుంచీ ఉండి, క్రమేపీ తగ్గుతాయి.

నెలసరి నొప్పులు తగ్గాలంటే?

మానసిక, శారీరక అసౌకర్యాలు భరించలేనంతగా ఉంటే, ఉపశమనం కోసం ఆయుర్వేద చిట్కాలను పాటించవచ్చు. అవేంటంటే....




- **నువ్వుల నూనె మర్దన:** ఆయుర్వేద అభ్యంగన స్నానం కోసం ఈ నూనె వాడతారు. దీన్లోని లినోలిక్ యాసిడ్‌కు, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే గుణం కలిగి ఉంటుంది. విషాలను హరించే తత్వం కూడా ఈ నూనెకు ఉంటుంది. కాబట్టి నెలసరి సమయంలో ఈ నూనెతో పొత్తికడుపు మీద సున్నితంగా మర్దన చేయాలి. ఇలా చేస్తే కడుపు నొప్పి తగ్గుతుంది.
- **మెంతుల మహిమ:** కాలేయం, మూత్రపిండాలు, మెటబాలిజంకు మెరుగైన ఔషధం మెంతులు. వీటితో నెలసరి నొప్పులు కూడా తగ్గుతాయి. కాబట్టి 2 టీస్పూన్ల మెంతులను 12 గంటలపాటు నీళ్లలో నానబెట్టి తాగాలి.
- **వేడి కాపడం:** పొత్తికడుపు మీద వేడి కాపడం పెడితే గర్భాశయ కండరాలు ఉపశమనం పొంది నొప్పులు తగ్గుతాయి. కాబట్టి వేడి నీళ్ల నింపిన బాటిల్‌ను పొత్తికడుపు మీద ఉంచి కాపడం పెట్టాలి. వేడి జావ తాగినా, వేడి నీళ్ల స్నానం చేసినా కూడా ఫలితం దక్కుతుంది.
- **వ్యాయామంతో ఉపశమనం:** నొప్పితో మంచానికే అతుక్కుపోయే బదులు, వ్యాయామంతో ఒళ్లు కదిలిస్తే కటి ప్రదేశానికి రక్తప్రసరణ పెరిగి నొప్పులు తగ్గుతాయి. నెలసరి సమయంలో మూత్రాశయ కండరాలు కుంచించుకుపోయేలా చేసే హార్మోన్లను నెమ్మదించేలా చేసే ఎండార్ఫిన్లు వ్యాయామం చేస్తే విడుదలవుతాయి. కాబట్టి ఈ సమయంలో తేలికపాటి వ్యాయామం చేయడం ఎంతో అవసరం. ఆ మూడు రోజులే కాకుండా దైనందిన జీవితంలో వ్యాయామానికి చోటు కల్పిస్తే క్రమేపీ నెలసరి నొప్పులు అదుపులోకి వస్తాయి.
- **శొంఠి, మిరియాల టీ:** శొంఠి, మిరియాల పొడి కలిపిన నీళ్లను వేడి చేస్తే హెర్బల్ టీ తయారవుతుంది. దీన్లో పాలు కలపకుండా తాగితే, నొప్పులకు కారణమయ్యే హార్మోన్ల పరిమాణం తగ్గి నొప్పులు తగ్గుతాయి. ఈ టీ వల్ల నెలసరి సమస్యలు కూడా సరి అవుతాయి. అలసట కూడా వదులుతుంది.
- **జీలకర్ర వైద్యం:** జీలకర్ర వేసి మరిగించిన నీళ్లు తాగినా ఫలితం ఉంటుంది.
- **ఛామొమైల్ టీ:** ఈ పువ్వులు వేసి కాచిన నీళ్లు తాగితే పొత్తికడుపు, నడుము నొప్పులు తగ్గుతాయి. ఈ పూలలోని ఔషధ గుణాలు కూడా గర్భాశయాన్ని కుంచించుకుపోయేలా చేసే హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తాయి.
- కప్పు పాలలో, దంచిన మూడు వెల్లుల్లి రెబ్బలు, పసుపు, తేనె, మిరియాల పొడి వేసి వెల్లుల్లి రెబ్బలు ఉడికేవరకూ కాచాలి. ఈ పాలను తాగి, వెల్లుల్లి రెబ్బలను నమిలేయాలి. ఇలా క్రమంతప్పకుండా 3 రోజులు చేసినా నెలసరి నొప్పులు తగ్గుతాయి.

ఈ జాగ్రత్తలు పాటించాలి!

- భోజనంలో చక్కెర, మైదా, శుద్ధిచేసిన పదార్థాలు, కృత్రిమ రంగులు, రుచులు మానేయాలి.
- బియ్యం, పాస్తా, బ్రెడ్ వాడకం మానేయాలి.
- ఉప్పు వాడకం బాగా తగ్గించాలి. ఉప్పు శరీరంలో నీరు నిల్వ ఉండేలా చేస్తుంది. దాంతో నెలసరి సమయంలో ఒళ్లు మరింత బరువై బద్ధకం ఆవరిస్తుంది.
- కాఫీ కూడా బాగా తగ్గించాలి. కెఫీన్ వల్ల నెలసరి నొప్పులు ఎక్కువవుతాయి.
- ప్రతి రోజూ పరగడుపున నిమ్మరసం తాగడం అలవాటు చేసుకోవాలి.
- నెలసరి ద్వారా పోయే రక్తం ద్వారా క్యాల్షియం శరీరం నుంచి వెళ్లిపోతూ ఉంటుంది. కాబట్టి పాలు, పెరుగు, నువ్వులు, ఆకుకూరలు తప్పక తీసుకోవాలి.
- రోజుకి కనీసం 8 గంటల నిద్ర తప్పనసరి. నిద్రతో శరీరం ఉపశమనం పొందుతుంది. ఫలితంగా నొప్పులూ అదుపులోకి వస్తాయి.
- నట్స్, సీడ్స్ తిని, ఏరోబిక్ వ్యాయామం చేయడం వల్ల ఎండార్ఫిన్లు విడుదలై నొప్పులు తగ్గుతాయి.

డాక్టర్ రాంప్రకాశ్, ఆయుర్వేద వైద్యులు,
సంహిత ఆయుర్వేద చికిత్సా కేంద్రం, హైదరాబాద్.



ఎనిమిదో తరగతి డ్రాపవుట్‌గా మొదలై... హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రసంగం చేసే స్థాయికి ఎదిగారు రుమాదేవి. 22 వేలమందికి పైగా చేనేత కళాకారుల స్థిరమైన ఆదాయానికి ఆమె దోహదం చేశారు. దాదాపు 35 వేల మందికి శిక్షణ అందించారు. 'కుటుంబ, సమాజ శ్రేయస్సుకు మహిళల ఆర్థిక స్వావలంబనే పునాది' అంటున్న రుమాదేవి కథ ఇది.

ఎడారిలో ప్రగతి పూలు పూయిస్తూ...

"రెండు నెలల క్రితం ఢిల్లీలో 'వేదాంత కల్చరల్ ఫెస్టివల్', మార్చిలో 'సూరజ్ కుండ్ ఫెస్టివల్', ఈ నెల 15 వరకూ ఢిల్లీలో 'దస్తకార్ సమ్మర్ మేళా', ఆ తరువాత గ్రేటర్ నోయిడాలో 'సమ్మర్ ఫెస్టివల్'... ఇంకా రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో చిన్న చిన్న ఈవెంట్స్ అస్సలు తీరిక ఉండడం లేదు" అని నవ్వేస్తారు 35 ఏళ్ళ రుమాదేవి. ఉఆగ్రా, తలపై ముసుగుతో సాధారణ రాజస్థానీ గ్రామీణ మహిళలా కనిపించే ఆమె సుప్రసిద్ధ ఫ్యాషన్ డిజైనర్లలో ఒకరని ఎవరూ అనుకోరు. బార్మర్ ప్రాంతానికి చెందిన చేనేత, ఎంబ్రాయిడరీ డిజైన్ల ప్రతిష్టను ఆమె విశ్వవ్యాప్తం చేస్తున్నారు. రుమాదేవి నేతృత్వంలోని 'గ్రామీణ వికాస్ ఇవమ్ చేతన సంస్థాన్' (జీవిసీఎస్) ద్వారా దాదాపు 22 వేల మంది చేతి వృత్తి నిపుణులైన మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయం జరుగుతుంది. దాని కోసం విదేశాల్లో జరిగే మేళాలకు కూడా తన బృందంతో ఆమె వెళ్తూ ఉంటారు.

వంద చొప్పున పోగు చేసి...

రుమాదేవిది రాజస్థాన్ రాష్ట్రం బార్మర్ జిల్లాలోని రవాట్సర్ గ్రామం. థార్ ఎడారి మధ్యలో, పాకిస్తాన్ సరిహద్దుకు చేరువలో ఉండే ఆ ఊరిలో... ఒక సాధారణ కుటుంబంలో ఆమె జన్మించారు. ఆమె తండ్రి సన్నకారు రైతు. రుమాదేవి అయిదో ఏటే ఆమె తల్లి మరణించారు. తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. ఏడుగురు అక్కచెల్లెళ్ళలో పెద్దదైన రుమాదేవి తన అమ్మమ్మ దగ్గర పెరిగారు. కుటుంబ పరిస్థితుల కారణంగా ఎనిమిదో క్లాసులో చదువు ఆపేయాల్సి వచ్చింది. ఇంటి పనులతో పాటు రోజూ కొన్ని కిలోమీటర్ల దూరం నుంచి మంచి నీరు తీసుకువచ్చే బాధ్యత కూడా ఆమెదే.. పదిహేడేళ్ళ వయసులో రుమాదేవికి పెళ్ళయింది. రెండేళ్ళలోపే ఒక బిడ్డకు జన్మనిచ్చారు. కానీ ఊపిరితిత్తుల సమస్య కారణంగా రెండు రోజులు తిరక్క ముందే ఆ బిడ్డ మరణించాడు. "ఆ సంఘటనతో నేను బాగా కుంగిపోయాను. నా జీవితం వ్యర్థంగా అనిపించేది. మరోవైపు ఇంట్లో ఆర్థిక పరిస్థితులు మరింత విషమించాయి. ఏదైనా పనిలో బిజీ అయితే డిప్రెషన్ నుంచి దూరం కావచ్చనుకున్నాను. కానీ పెద్దగా చదువుకోని నాకు అవకాశాలు ఎక్కడ్నించి వస్తాయి? ఎవరింట్లోనయినా పనికి కుదరాలి, లేదంటే దినసరి కూలీగా పని చెయ్యాలి. ఇలా ఆలోచిస్తున్న సమయంలో... కుట్టుపని, ఎంబ్రాయిడరీ చేస్తే బాగుంటుందనిపించింది. చిన్నప్పుడు అవి మా అమ్మమ్మ దగ్గర నేర్చుకున్నాను. దాన్నే ఆదాయ మార్గంగా ఎంచుకున్నాను. చిన్న బ్యాగ్‌లతో ప్రారంభించాను" అని అంటారు రుమాదేవి. మొదటి బ్యాగ్‌ను 70 రూపాయలకు అమ్మారు. అది ఆమె జీవితంలో తొలి సంపాదన. ఆ డబ్బుతో మెటీరియల్ కొన్నారు. కానీ కుట్టు మిషన్ లేకపోవడంతో పని కష్టంగా సాగేది. ఈలోగా ఆమె చేస్తున్న పని గురించి ఇరుగు పొరుగు మహిళలు ఆరా తీశారు. వారి ఆసక్తిని గమనించిన రుమాదేవి పదిమందితో కలిసి ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరి నుంచి వంద రూపాయలు సేకరించి... ఒక కుట్టు మిషన్ కొన్నారు. బ్యాగ్‌లను, పిల్లో కవర్లను తయారు చేసి... చుట్టుపక్కల గ్రామాల్లోని సంతల్లో అమ్మడం మొదలుపెట్టారు. 'ఇంట్లో ఉండాల్సిన మహిళలు వీధుల్లో తిరగడం ఏమిటనే అభ్యంతరాలు వచ్చినా... రుమాదేవి, ఆమె బృందం బెదరలేదు.

"ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో... ఎడారిలో ప్రగతి పూలు పూయిస్తున్న మహిళగా నన్ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. మన చేనేత కళ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటుతున్నావంటూ అభినందించారు.



సమకాలీనతకు ప్రాధాన్యం...

క్రమంగా వారి కుటుంబాలకు స్థిరమైన ఆదాయం రావడంతో... మరింతమంది మహిళలు కూడా ఆ బృందంలో చేరారు. 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్' కు రుమాదేవి విజయగాథ తెలిసింది. 2010లో జిల్లా స్థాయిలో తమ అధ్యక్షురాలుగా ఆమెను నియమించింది. ఆ తరువాత 'రూరల్ డెవలప్‌మెంట్ చేతన సంస్థాన్'కు ఆమె ప్రెసిడెంట్ అయ్యారు. ఇప్పటివరకూ 80 గ్రామాలకు చెందిన 35 వేల మందికి పైగా మహిళలకు శిక్షణనిచ్చి, వారి ఉపాధికి దోహదం చేశారు. వారి కుటుంబాలకు స్థిరమైన ఆదాయం సమకూర్చడంలో విజయవంతమయ్యారు. సంప్రదాయ భారతీయ డిజైన్లకు ప్రాచుర్యం కల్పించడంతోపాటు చేతి వృత్తుల్లో థార్ ఎడారి ప్రాంతంవారు ఉపయోగించే పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రపంచానికి చాటి చెప్పారు. ఆమె రూపొందించిన వ్యాపార నమూనా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రశంసలందుకుంది. 2015లో 'రాజస్థాన్ హెరిటేజ్ వీక్'లో తమ మొదటి ఫ్యాషన్ షో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దేశ, విదేశాల్లో కొన్ని వందల ఈవెంట్స్‌లో తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. జర్మనీ, శ్రీలంక, బ్రిటన్, సింగపూర్, థాయిలాండ్ తదితర దేశాల్లోని ఫ్యాషన్ షోలలో ఆమె డిజైన్లు చోటు చేసుకున్నాయి. "కళాకారుల నైపుణ్యాన్ని మెరుగు పరచడానికి శిక్షణకు, వర్క్‌షాప్‌లకు హాజరయ్యేలా ప్రోత్సహిస్తున్నాను. డిజైన్లలో సమకాలీన ధోరణులకు ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే యువతను అవి ఆకర్షిస్తాయి. కాబట్టి మేము ఎప్పుడూ వాటి మీదే దృష్టి కేంద్రీకరిస్తూ ఉంటాం" అని చెబుతున్న రుమాదేవి తమ ప్రాంతంలోని ఇతర కళారూపాలకు చెందిన వారి కోసం 'అప్లిక్యూ హ్యాండీక్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ'ని ఏర్పాటు చేశారు. దాని ద్వారా వారికీ, మార్కెట్‌కూ అనుసంధానంగా వ్యవహరిస్తూ, వారి నైపుణ్యాలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. రాజస్థాన్ గ్రామీణాభివృద్ధి శాఖ అమలు చేస్తున్న 'రాజీవికా మిషన్'కు బ్రాండ్ అంబాసిడర్.

'ఇదంతా నిజమేనా?' అనిపిస్తుంది...

భారతీయ ఫ్యాషన్ పరిశ్రమకు చెందిన దిగ్గజాలతో కలిసి పని చేస్తున్న రుమాదేవి అనేక గౌరవాలను అందుకున్నారు. 2018లో 'నారీ శక్తి' పురస్కారంతో కేంద్ర ప్రభుత్వం ఆమెను సత్కరించింది. 2019లో 'టిఎఫ్‌ఐ డిజైనర్ ఆఫ్ ది ఇయర్' టైటిల్, అలాగే 'ట్రైబ్స్ ఇండియా గుడ్ విల్ అంబాసిడర్ అండ్ చీఫ్ డిజైనర్' టైటిల్ గెలుచుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రం తరపున సాంస్కృతిక రాయబారిగా జర్మనీ హెచ్ఐఎం టెక్స్‌టైల్ ఫెయిర్, సింగపూర్ క్రాఫ్ట్ ఫెయిర్, ప్రతిష్ఠాత్మకమైన లండన్ ఫ్యాషన్ వీక్‌లలో పాల్గొన్నారు. 2000లో తమ 17 వార్షిక భారతీయ సదస్సుకు వక్తగా హార్వర్డ్ విశ్వవిద్యాలయం రుమాదేవిని ఆహ్వానించింది. ఆ సందర్భంగా వివిధ రంగాల్లో భారతీయ మహిళల విజయాల గురించి ఆమె చేసిన ప్రసంగం అందరి మన్ననలనూ అందుకుంది. 2022లో వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయంలో నిర్వహించిన భారత స్వాతంత్ర్య దినోత్సవాల్లో.. ప్రత్యేక అతిథిగా ఆమె పాల్గొన్నారు. "ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో... ఎడారిలో ప్రగతి పూలు పూయిస్తున్న మహిళగా నన్ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. మన చేనేత కళ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటుతున్నావంటూ అభినందించారు. ఆమె మాటలు ఎన్నటికీ మరచిపోలేను. కనీసమైన చదువు కూడా లేని నాకు లభించిన ఈ గుర్తింపు గురించి ఆలోచిస్తే... 'ఇదంతా నిజమేనా?' అనిపిస్తుంది. ఇది నేను ఒంటరిగా సాధించింది కాదు. ఎందరో మహిళల కృషి ఫలితం. సరైన చదువుకు నోచుకోని, కుటుంబ ఆదాయం పెంచడానికి ఏం చెయ్యాలో తెలియని సామాన్య గ్రామీణ మహిళలకు ప్రతినిధిని నేను" అని వినయంగా చెబుతారు రుమాదేవి.

ఆమెకు ప్రకృతి అంటే ఇష్టం. పర్యావరణ పరిరక్షణ చేయాలనే తలంపు చిన్నప్పటినుంచే ఉంది. అందుకే ఆమె మొక్కలను పెంచుతుంది. అంతేనా సీతాకోకచిలుకలకు ఆమె ఇల్లు ఆవాసంగా మారేట్లు చేసింది. ముంబైలో ఉంటున్న ఆమె పేరు ప్రియాంక సింగ్. ఆ సీతాకోకచిలుకల విశేషాలను ఆమె చెబుతోంది ఇలా...





సీతాకోకచిలుకలే... మా ఇంటికి అతిథులు!

"అందరిలానే చిన్నప్పుడు సీతాకోకచిలుకలు పట్టుకోవాలని ఇష్టం. ఆ రంగు రంగుల సీతాకోకచిలుకల ప్రపంచమే అద్భుతంగా ఉండేది. స్కూల్‌కి వెళ్లినప్పుడు, పార్కుల్లో తిరుగుతుంటే చూసి సంతోషపడేదాన్ని. అలాంటి జీవితం ఉంటే ఎంత బావుంటుందో అనుకుండేదాన్ని. అయితే వేల సీతాకోకచిలుకలు మా ఇంటి బాల్కనీలోకి వస్తాయని ఊహించనేలేదు.

అలా ఆలోచన..

నాకు సామాజిక సేవ అంటే ఇష్టం. ముంబైలో ప్రతి ఇంట్లో రోజుకు నాలుగైదు కేజీల చెత్త ఎవరింట్లో అయినా ఉంటుంది. ఆ చెత్తను కంపోస్టు ఎరువుగా మారిస్తే బావుంటుందని పదుల కొద్దీ సెమినార్లు చేయటంతో పాటు కంపోస్టు ఎరువుగా మార్చి పొలాల్లో వేయించా. ప్రకృతిలో అన్నీ విలువైనవే. చెత్తతోనూ ఉపయోగముంది. బయోడైవర్సిటీ గురించి ఆలోచించినపుడు.. పక్షులు లాగే సీతాకోకచిలుకలు ఎంతో మేలు చేస్తాయి కదా.. అని మా ఇంట్లోని పెద్ద బాల్కనీలో పూల మొక్కలు వేయటం ప్రారంభించా. పూల వాసనకు ఒక్కోటి మా ఇంటికి వచ్చేవి సీతాకోకచిలుకలు. పైగా మా ఇంటికి దగ్గరలో పార్కులు ఉండటం వల్ల వీటి సంఖ్య అనూహ్యంగా పెరిగింది.

వేల సీతాకోకచిలుకలు..

నిమ్మ, మల్లెపూల చెట్టు, మందారం.. ఇలా పలు రకాల మొక్కలను పెంచటం ప్రారంభించా. బాల్కనీతో పాటు ఇంటిమీద కూడా మొక్కలు పెంచా. ఐదారేళ్ల క్రితం మా ఇంట్లోకి రెండువందల దాకా వచ్చేవి. నా కూతురు ఆ రంగురంగుల సీతాకోకచిలుకలను చూసి ఎగిరిగంతేసేది.

సీతాకోక చిలుకలు ఎలాంటి రంగులు వస్తున్నాయో లెక్కేసుకునేవాళ్లం. ఎంతో వేగంగా సమయం గడిచిపోయేది. మా ఇంట్లోవారి సహకారమూ ఉండేది. ఆ తర్వాత మొక్కల సంఖ్య పెరిగింది. ఇప్పుడు దాదాపు యాభై రకాల మొక్కల కంటే ఎక్కువ ఉన్నాయి. సీతాకోకచిలుకలు మా ఇంటికి ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేలల్లో వస్తాయి. ఇదెంతో అద్భుతంగా ఉంటుంది.

అంతకంటే ఏం కావాలి?

మా ఆర్గానిక్ గార్డెన్‌లో సీతాకోకచిలుకలు ఎక్కువగా వస్తుంటాయని 'బటర్‌ఫ్లైయ్ మామ్' అంటూ మా బంధువులు, మిత్రులు పిలుస్తుంటారు. ఈ పిలుపు బావుంటుంది నాకు. సీతాకోకచిలుకలు వచ్చి గుడ్లు పెడుతుంటాయి. ఇక్కడే కొన్ని గొంగళి పురుగులు అవుతాయి. వాటికి హాని కలగకుండా చూస్తాను. పర్యావరణంలో కాలుష్యం, పురుగుమందులు, ఇలా పలురకాల కారణాల వల్ల జీవవైవిధ్యం దెబ్బతింటోంది. ఎక్కడో కొన్ని పార్కుల్లోనో, కొన్ని తోటల్లోనో కనపడే రంగురంగుల సీతాకోకచిలుకలు నా ఇంటికి అతిథులుగా వస్తున్నాయంటే అంతకంటే ఏం కావాలి? ప్రకృతి కోసం నావంతు సహకారం అందించాలనుకున్నా. మా ఆర్గానిక్ గార్డెన్ చిన్నదే కావచ్చు. నా ప్రయత్నం మంచిదే కదా?' అంటుంది ప్రియాంక.



మందారంతో చర్మం మృదువుగా..

మందారం అలంకరణకే కాదు చక్కటి చర్మ సౌందర్యానికి మేలు చేస్తుంది. తక్కువ బడ్జెట్‌లోనే మీ చర్మం కాంతివంతంగా ఉండాలంటే... ఈ చిన్న చిట్కాలు పాటించాల్సిందే మరి..

- రెండు మందారం పూలను మెత్తగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని బౌల్‌లో వేసి రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, ముల్తానీ మట్టి రెండు టేబుల్ స్పూన్లు కలిపి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత మంచి నీళ్లతో కడిగేయాలి. ఇలా చేస్తుంటే చర్మంలో మెరుపు వస్తుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల మందారం పూల పొడి, టీస్పూన్ తేనె, రెండు టేబుల్ స్పూన్ల పాలు కలిపి మెత్తగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేయాలి. ఇలా చేస్తే చర్మ సౌందర్యం మీ సొత్తు.
- రెండు టేబుల్ స్పూన్ల మందారం పూల పొడిలో పేస్ట్‌కు తగినంత రోజ్ వాటర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా తరచుగా చేస్తుంటే ఫేస్‌లో గ్లో వస్తుంది.
- బౌల్‌లో రెండు టేబుల్స్ రోజ్ వాటర్, రెండు టేబుల్ స్పూన్ల మందార పొడి, రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్‌ను బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చర్మంతో పాటు మెడ దగ్గర పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే చర్మంలో ఫ్రెషనెస్ వస్తుంది. ముఖ చర్మం మీద నొప్పులు తగ్గిపోతాయి.



బరువు తగ్గించే...

వంటగదిలో అల్లం లేనిదే కుదరదు. దుంప జాతికి చెందిన ఈ అల్లం వేల ఏళ్లనుంచి సహజమైన మెడిసిన్‌గా ఉపయోగపడుతోంది. అల్లం వల్ల కలిగే ఉపయోగాలేంటో తెల్సుకుందాం...

- కూరల్లో, టీ రూపంలో అల్లం తీసుకోవటం వల్ల కలిగే ఫలితాలు అద్భుతం. ముఖ్యంగా అల్లం టీ తాగినప్పుడు గొంతులోని కఫం, జలుబు, దగ్గు.. లాంటి సమస్యలనుంచి ఉపశమనం లభిస్తుంది.
- కండరాల నొప్పిని తగ్గిస్తుంది. ఏదైనా దెబ్బ తగిలినపుడు మజిల్ రివకరీ వేగంగా జరిగేందుకు అల్లం తోడ్పడుతుంది. మోకాళ్ల నొప్పులు, ఇతర కీళ్లనొప్పుల బాధ తగ్గుతుంది.
- బరువును తగ్గించే గుణం దీనికి ఉంది. అందుకే వెయిట్‌లాస్ అవ్వాలనుకునేవాళ్లు అల్లం టీ, నిమ్మరసంలోకి అల్లం పొడి వేసి తాగొచ్చు.
- వేపనూనెలోకి కాసింత అల్లం పొడి వేసి జుట్టుకు పట్టిస్తే చుండ్రును అరికట్టవచ్చు.
- దీని వల్ల కడుపు శుభ్రం అవుతుంది. జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది.
- ఇది న్యాచురల్ యాంటీ ఇన్ఫ్లమేటరీగా పని చేస్తుంది. పంటి నొప్పి కూడా తగ్గే అవకాశాలెక్కువ.
- రక్తం సాఫీగా ప్రసరించేట్లు చేస్తుంది. రక్తపోటును తగ్గిస్తుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గించటం వల్ల గుండె సమస్యలు దరిచేరవు.
- ఇన్‌ఫెక్షన్లతో పోరాడే వ్యాధినిరోధక శక్తిని అనూహ్యంగా పెంచగలిగేది అల్లం.
- తలనొప్పితో పాటు మైగ్రేన్‌ను అదుపులో ఉంచే చక్కటి ఔషధం.





మీ ఫ్యామిలీకి ఇస్తున్న సమ్మర్ గిఫ్ట్ ఇది

విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా రూపొందిన 'ఫ్యామిలీ స్టార్' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో దిల్ రాజు ఈ సినిమాను నిర్మించారు. మంగళవారం రాత్రి దూలపల్లి మైసమ్మ గూడలోని కాలేజ్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'మీ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఈ సినిమా ఉంటుంది. విజయ్ ఇప్పటివరకూ చేసిన నటన ఒక ఎత్తయితే, ఇందులో ఇచ్చిన పెర్ఫార్మెన్స్ మరో ఎత్తు. అలాగే మృణాళిని కూడా అద్భుతంగా నటించింది. బ్లడ్ అండ్ సోల్ పెట్టి ఈ సినిమా చేశాను. దిల్‌రాజుగారి బేనర్‌లో వర్క్ చేయాలనే కోరిక ఈ చిత్రంతో తీరింది' అన్నారు.

'మీరంతా ఎగ్జామ్స్ రాసి పాసయిన తర్వాత నెక్ట్స్ క్లాస్‌లోకి వెళ్లడమే కాదు ఈ సినిమా చూసి ఫ్యామిలీ స్టార్స్ అవుతారు. ఈ సినిమాలో విజయ్ నటన అమ్మాయిలకు బాగా నచ్చుతుంది. అతని పాత్రను దర్శకుడు పరశురామ్ బాగా డిజైన్ చేశాడు. నవ్విస్తాడు, ఫైట్స్ చేస్తాడు. కోపం వస్తే కొట్టమని హీరోయిన్‌తో తన్నులు తింటాడు. మీరందరూ కూడా బాగా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు దిల్ రాజు.

హీరోయిన్ మృణాళిని మాట్లాడుతూ 'ఇందు పాత్ర పోషించడం మొదటి 15 రోజులు చాలా కష్టంగా అనిపించింది. ఆ తర్వాత ఆ పాత్రను నా కంటే గొప్పగా ఎవరూ చేయలేరన్న సంతోషం కలిగింది. 'ఫ్యామిలీ స్టార్' చిత్రాన్ని మా ఫ్యామిలీ స్టార్ అయిన నాన్నకు అంకితం ఇస్తున్నా' అన్నారు

'ఆరేళ్ల క్రితం నా కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ 'గీత గోవిందం'. అదే దర్శకుడితో 'ఫ్యామిలీ స్టార్' చేశా. నా సినిమా రూ.వంద కోట్లు వసూలు చేయాలనే కల ఆ సినిమాతో తీరింది. మళ్లీ అటువంటి సినిమా నాకు రాలేదు. 'పెళ్లిచూపులు' నుంచి 'ఫ్యామిలీస్టార్' దాకా నేను చేసిన ప్రతి సినిమా ఏదో ఒక కొత్త విషయం నేర్పించింది. ఇబ్బందులు, అవరోధాలు, అవమానాలు ఎదురైనా వాటిని దాటుకుని అనుకున్నది సాధించాలి. అదే నమ్మకంతో నేను పనిచేస్తుంటా. మీ ఫ్యామిలీకి మా టీమ్ ఇస్తున్న సమ్మర్ గిఫ్ట్ 'ఫ్యామిలీ స్టార్'. చూసి ఎంజాయ్ చేయండి' అన్నారు విజయ్ దేవరకొండ.

రామాయణానికి త్రివిక్రమ్ మాట సాయం?



రణ్‌బీర్‌కపూర్, సాయిపల్లవి సీతారాములుగా నటిస్తున్న 'రామాయణం' చిత్రం మంగళవారం ముంబైలో ఘనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. నితీశ్ తివారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి అల్లు అరవింద్ నిర్మాత. మూడు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయం ఒకటి ఇప్పుడు బాగా ప్రచారంలో ఉంది. 'రామాయణం' తెలుగు వెర్షన్‌కు సంభాషణలు అందించే బాధ్యతను మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌కు అప్పగించారనేది మూడేళ్ల క్రితమే వినిపించిన మాట. షూటింగ్ మొదలవడంతో మరోసారి ఈ విషయం చర్చనీయాంశమైంది. కొద్ది మాటల్లో అనంతమైన భావాన్ని పొందికగా చెప్పగల చాతుర్యం త్రివిక్రమ్ సొంతం. రామాయణం లాంటి పౌరాణిక చిత్రానికి ఆయన అందించే సంభాషణలు సినిమా స్థాయిని మరింత పెంచుతాయని మేకర్స్ భావించడమే దీనికి కారణంగా చెబుతున్నారు. మహేశ్‌బాబుతో 'గుంటూరు కారం' చిత్రం చేశాక త్రివిక్రమ్ ఇప్పటివరకూ తన కొత్త ప్రాజెక్ట్ ప్రకటించలేదు. కాబట్టి త్రివిక్రమ్ కూడా దీనికి అంగీకరించి ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే ఇప్పటికే త్రివిక్రమ్ డైలాగ్ వెర్షన్ పూర్తిచేసి ఇచ్చినట్లు కూడా చెబుతున్నారు. ఈనెల 17న శ్రీరామనవమి సందర్భంగా చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ఆ రోజు దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పదికాలాలు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయేవిధంగా తెరకెక్కించడానికి మేకర్స్ చాలా కసరత్తు చేస్తున్నారు. ఐదు భాషల్లో ఈ చిత్రం తెరకెక్కుతోంది.



తెలుసుకోవాల్సిన చరిత్ర



'ఉయ్యాల జంపాల', 'మజ్ను' చిత్రాలతో సెన్సిబుల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు విరించి వర్మ. ఆయన రీసెంట్‌గా దర్శకత్వం వహించిన చిత్రం పొలిటికల్ డ్రామా 'జితేందర్ రెడ్డి'. 1980 కాలంలో జగిత్యాలలో జరిగిన వాస్తవిక సంఘటనల ఆధారంగా స్టూడెంట్ లీడర్ జితేందర్‌రెడ్డి జీవిత కథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. రాకేశ్ వర్రె ఇందులో టైటిల్ రోల్ పోషించారు. జితేందర్‌రెడ్డి సోదరుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. రియాసుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవిప్రకాశ్ ముఖ్య పాత్రలు పోషించారు. మే 3న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం 'జితేందర్ రెడ్డి' గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ "అందరూ తెలుసుకోవాల్సిన చరిత్ర జితేందర్‌రెడ్డి జీవితం. నటుడు రాకేశ్ ఈ సినిమా తర్వాత జితేందర్‌రెడ్డిగా గుర్తింపు తెచ్చుకుంటారు. అంత అద్భుతంగా ఈ పాత్రలో జీవించారు" అని అన్నారు. దర్శకుడు విరించివర్మ మాట్లాడుతూ "జితేందర్‌రెడ్డి లాంటి పవర్‌ఫుల్ వ్యక్తి జీవితాన్ని డైరెక్ట్ చేయడం ఎంతో చాలెంజింగ్‌గా అనిపించింది. ఈ సినిమా కోసం చాలా రీసెర్చ్ చేశాం" అని చెప్పారు. నటుడు రాకేశ్ వర్రె మాట్లాడుతూ "ఈ సినిమా ఫలితంపై నాకు ఎంతో నమ్మకం ఉంది. ఇందులోని ఎమోషన్స్ మీ అందరినీ కట్టిపడేస్తాయి" అని అన్నారు.

కల్ట్ లవ్‌స్టోరీ

దర్శకుడు నక్కిన త్రినాధరావు తన సొంత చిత్రనిర్మాణ సంస్థ నక్కిన నేరేటివ్స్‌లో నిర్మించే రెండో సినిమా షూటింగ్ బుధవారం ప్రారంభమైంది. పలు సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించిన విక్రమ్ సహిదేవ్ లగడపాటి హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో 'దృశ్యం' చిత్రంలో వెంకటేశ్ కుమార్తెగా నటించిన ఎస్తేర్ అనిల్ హీరోయిన్‌గా చేస్తున్నారు. వీరిద్దరిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నిర్మాత శరత్ మరార్ కెమెరా స్విచాన్ చేయగా, హీరో సందీప్‌కిషన్ క్లాప్ ఇచ్చారు. సుమంత్ తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా త్రినాధరావు మాట్లాడుతూ 'ఇది కల్ట్ లవ్ స్టోరీ. టౌన్‌లో జరిగే అందమైన ప్రేమకథ. ఇందులో విక్రమ్ పాత్ర అదిరిపోతుంది. ఎస్తేర్ లో మంచి ప్రతిభ ఉంది. తారక్ పొన్నప్ప కీలక పాత్ర పోషిస్తున్నారు' అని చెప్పారు. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభిస్తాం. అనకాపల్లి, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుగుతుంది. ఎవరూ ఊహించని జానర్‌లో ఈ సినిమా ఉంటుంది' అని దర్శకుడు వంశీకృష్ణ మల్ల చెప్పారు. ఈ చిత్రానికి మాటలు: నరేశ్ తుల, రాజేంద్రప్రసాద్, సంగీతం: దావ్‌జాంద్, ఫొటోగ్రఫీ: మాయ వి, సహ నిర్మాత: ఎన్.వి.ఎస్.ఎస్. సురేశ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీతారామరాజు మల్లెల.

ఆ కోరిక గీతాంజలితో తీరింది



అందాల నటి అంజలి నటించిన 'గీతాంజలి' చిత్రం ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. దానికి సీక్వెల్‌గా వస్తున్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవీవీ సినిమాస్ సంస్థతో కలసి కోన వెంకట్ నిర్మించారు.ఈ సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో కోన వెంకట్ మాట్లాడుతూ 'ఒక తెలుగు అమ్మాయి 50 సినిమాలు చేయడం చాలా గొప్ప విషయం. అందుకే అంజలిని అభినందించాలి. ఆమెకు ఇది 50వ సినిమా. ఈ చిత్రానికి నేను కథ ఇచ్చినా దాన్ని పది మెట్లు ఎక్కించి ముందుకు తీసుకువెళ్లారు భాను, నందు. స్క్రిప్ట్‌లో ఇద్దరూ కీలక పాత్ర పోషించారు. దర్శకుడు శివకు ఇది బెస్ట్ మూవీ అవుతుంది' అన్నారు. హీరోయిన్ అంజలి మాట్లాడుతూ 'నా 50వ సినిమా చాలా స్పెషల్‌గా ఉండాలనుకున్నాను. ఆ కోరిక 'గీతాంజలి మళ్లీ వచ్చింది' చిత్రంతో తీరింది. అందరినీ ఎంటర్‌టైన్ చేయాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా చేశాం. కామెడీ, హారర్ ఎలిమెంట్స్ మిక్స్ చేసిన చిత్రమిది. 'గీతాంజలి' కంటే వంద రెట్లు బాగుంటుంది' అని చెప్పారు సినిమా ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుందనీ, అంతకు మించి సినిమా ఉంటుందని దర్శకుడు శివ చెప్పారు. ఈ చిత్రంలో తను చెనక్కాయల శీను పాత్ర పోషించాననీ శ్రీనివాసరెడ్డి చెప్పారు. 'గీతాంజలి' కంటే ఈ చిత్రం మరింత భయపెడుతుంది, నవ్విస్తుంది అని సత్యం రాజేశ్ తెలిపారు.

నేనే హీరోగా చేస్తాననుకోలేదు



సూర్యతేజ ఏలే హీరోగా పరిచయమవుతున్న 'భరతనాట్యం' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'నేను హీరో కావాలని ఎప్పుడూ అనుకోలేదు. దర్శకత్వం మీద మొదటి నుంచి ఆసక్తి. కాలేజి పూర్తయిన తర్వాత రచన మీద ఇంట్రెస్ట్ ఏర్పడి కథలు రాయడం ప్రారంభించాను. అలా హితేష్‌కు నేను చెప్పిన కథ నచ్చింది. ఆ తర్వాత దర్శకుడు మహేంద్రకు చెప్పాను. ఆయనకు కూడా నచ్చడంతో మీరు ఈ సినిమాను డైరెక్ట్ చేస్తే బాగుంటుందని అడిగితే సరేనన్నారు. ఇందులో నేను హీరోగా చేస్తానని అనుకోలేదు. ఇందులో నా పాత్ర ఏ కొత్త నటుడు చేసినా బాగుంటుంది. కానీ దర్శకనిర్మాతలు అడగడంతో నేనే చేశా. ఇది క్రైమ్ కామెడీ కథాంశం అయినా ఫ్యామిలీ అంతా చూసే విధంగా ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. 'మా నాన్న ధని ఏలే చిత్ర పరిశ్రమలో పాతికేళ్లుగా పబ్లిసిటీ డిజైనర్‌గా ఉన్నారు. నేను కూడా పెయింటింగ్‌లో ఫైన్ ఆర్ట్స్ మాస్టర్స్ చేశా. ఈ సినిమా అయిన తర్వాత కూడా చిత్ర పరిశ్రమలో ఉంటా. రచయితగానా, నటుడిగానా అన్నది కాలం తేల్చాలి. 'భరతనాట్యం' సినిమాతో చాలా అనుభవం వచ్చింది. చాలా నేర్చుకున్నాను. ఇవన్నీ నా తదుపరి చిత్రానికి హెల్ప్ అవుతాయి' అన్నారు.









ప్రపంచ టాప్ 10లోకి అంబానీ

సంపద రూ.9.63 లక్షల కోట్లు.. 8,400 కోట్ల డాలర్లతో ఆసియా నంబర్ 2 అదానీ

» ఫోర్బ్స్ కుబేరుల జాబితా విడుదల

» 10 మంది తెలుగు వారికి స్థానం

న్యూఢిల్లీ: భారత్‌లోని అత్యంత సంపన్నుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ మరోసారి అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. భారత్‌తోపాటు ఆసియాలోని అత్యంత ధనికుడూ ఆయనే. ఈ ఏడాదికిగాను ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచ బిలియనీర్ల జాబితా ప్రకారం.. అంబానీ ఆస్తి 11,600 కోట్ల డాలర్లు. మన కరెన్సీలో దాదాపు రూ.9.63 లక్షల కోట్లు. ప్రపంచ ర్యాంకింగ్‌లో అంబానీ 9వ స్థానంలో నిలిచారు. వరల్డ్ టాప్-10లోని ఏకైక ఆసియా సంపన్నుడూ ఆయనే. అంతేకాదు, జాబితాలో 10,000 కోట్ల డాలర్లకు పైగా సంపద కలిగిన అతికొద్ది (14) మందిలో ఏకైక ఆసియా వ్యక్తి కూడా అంబానీయే. అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ రెండో అత్యంత సంపన్న భారతీయుడిగా ఉన్నారు. అదానీ ఆస్తి 8,400 కోట్ల డాలర్లకు చేరుకుందని, గడిచిన ఏడాది కాలంలో 3,680 కోట్ల డాలర్లు పెరిగిందని ఫోర్బ్స్ వెల్లడించింది. వరల్డ్ ర్యాంకింగ్స్‌లో అదానీ 17వ స్థానంలో ఉన్నారు. మరిన్ని ముఖ్యాంశాలు..

హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్ నాడార్ 3,690 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో మూడో అత్యంత ధనిక భారతీయుడిగా నిలిచారు. జిందాల్ గ్రూప్ చైర్మన్ సావిత్రి జిందాల్‌కు నాలుగో స్థానం దక్కింది. ఆమె ఆస్తి 3,350 కోట్ల డాలర్లు. దేశంలోని అత్యంత ధనిక మహిళ కూడా ఆమె.

సన్‌ఫార్మాకు చెందిన దిలీప్ సంఘ్వీ (2,670 కోట్ల డాలర్లు) ఐదో స్థానంలో నిలవగా.. సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా (2,130 కోట్ల డాలర్లు) ఆరో స్థానంలో ఉన్నారు. డీఎల్‌ఎఫ్‌కు చెందిన కేపీ సింగ్ (2,090 కోట్ల డాలర్లు), ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా (1,970 కోట్ల డాలర్లు), డీ-మార్ట్ సూపర్‌మార్కెట్ల వ్యవస్థాపకుడు రాధాకిషన్ దమానీ (1,760 కోట్ల డాలర్లు), ఆర్సెలార్ మిట్టల్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్ (1,640 కోట్ల డాలర్లు) వరుసగా 7,8,9,10వ స్థానాల్లో ఉన్నారు.

ఈసారి జాబితాలో 10 మంది తెలుగువారికి చోటు లభించింది. దివీస్ లాబ్స్‌కు చెందిన మురళి దివి 620 కోట్ల డాలర్ల సంపదతో అగ్రస్థానంలో ఉన్నారు.

భారత్ నుంచి 200 మంది

ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితాలో 200 మంది భారతీయులకు చోటు దక్కింది. గత ఏడాది జాబితాలో కనిపించిన 169 మందితో పోలిస్తే ఈసారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈసారి లిస్ట్‌లోని భారత బిలియనీర్ల మొత్తం సంపద 95,400 కోట్ల డాలర్లకు (రూ.79.18 లక్షల కోట్లు) పెరిగింది. గత ఏడాది మొత్తం సంపద 67,500 కోట్ల డాలర్లతో పోలిస్తే ఇది 41 శాతం అధికం. ఈ ఏడాది కొత్తగా 25 మందికి చోటు లభించగా.. బైజూస్ రవీంద్రన్, రోహిక మిస్త్రీ స్థానం కోల్పోయారు. కాగా, ఆన్‌లైన్ బ్రోకింగ్ సేవల సంస్థ జీరోధా వ్యవస్థాపకులైన నితిన్, నిఖిల్ కామత్ సోదరులతోపాటు ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకులు సచిన్ బన్సల్, బిన్నీ బన్సల్‌లు అత్యంత పిన్న వయస్కులైన భారత బిలియనీర్లుగా నిలిచారు. వీరిలోనూ 37 ఏళ్ల నిఖిల్ కామత్ అత్యంత పిన్న వయస్కుడు.



ప్రపంచ బిలియనీర్ల మొత్తం ఆస్తి రూ.1,179 లక్షల కోట్లు

ఈ ఏడాది ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితాలో 2,781 మందికి స్థానం దక్కింది. గత ఏడాదితో పోలిస్తే, మరో 141 మందికి కొత్తగా చోటు లభించింది. వీరి సంపద మొత్తం కూడా మరో 2 లక్షల కోట్ల డాలర్లు పెరిగి 14.2 లక్షల కోట్ల డాలర్లకు (రూ.1,179 లక్షల కోట్లు) చేరుకుంది. అమెరికా నుంచి అత్యధికంగా 813 మంది ఈ జాబితాలో నిలిచారు. చైనా (473 మంది), భారత్ (200 మంది) రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 8 నాటికి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఆయా కంపెనీలకు చెందిన షేర్ల ధరలు, కరెన్సీ మారకం విలువల ఆధారంగా బిలియనీర్ల సంపదను లెక్కించినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. ఫ్యాషన్ దిగ్గజం ఎల్‌వీఎంహెచ్ గ్రూప్ చైర్మన్ బెర్నార్డ్ ఆర్నో 23,300 కోట్ల డాలర్ల సంపదతో ప్రపంచంలో నం.1 బిలియనీర్‌గా నిలిచారు. టెస్లా, స్పేస్ ఎక్స్, ఎక్స్ (గతంలో ట్విటర్) కంపెనీ సారథి ఎలాన్ మస్క్ 19,500 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో ఈ సారి రెండో స్థానానికి పరిమితమయ్యారు. అమెజాన్ వ్యవస్థాపకులు జెఫ్ బెజోస్ (19,400 కోట్ల డాలర్లు), ఫేస్‌బుక్ వ్యవస్థాపకులు మార్క్ జుకెర్‌బర్గ్ (17,700 కోట్ల డాలర్లు), ఒరాకిల్ చైర్మన్ ల్యారీ ఎలిసన్ (14,100 కోట్ల డాలర్లు) టాప్-5లోని తర్వాత స్థానాల్లో ఉన్నారు.

తెలుగు సంపన్నుల వివరాలు

ప్రపంచ ర్యాంక్	పేరు	కంపెనీ	బిలియన్ డాలర్లు
469	మురళి దివి	దివీస్ ల్యాబ్స్	6.2
1104	ప్రతాప్ సీ రెడ్డి	అపోలో హాస్పిటల్స్	3
1143	జీఎం రావు	జీఎంఆర్ గ్రూప్	2.9
1143	పీపీ రామ్‌ప్రసాద్ రెడ్డి	అరబిందో ఫార్మా	2.9
1438	జూపల్లి రామేశ్వర్ రావు	మై హోమ్ గ్రూప్	2.3
1438	పీ పిచ్చి రెడ్డి	మేఘా ఇంజనీరింగ్	2.3
1496	పీ వీ కృష్ణా రెడ్డి	మేఘా ఇంజనీరింగ్	2.2
1623	ఎం సత్యనారాయణ రెడ్డి	ఎంఎస్ఎన్ ఫార్మా	2
1764	కే సతీశ్ రెడ్డి	డాక్టర్ రెడ్డీస్	1.8
2046	జీవీ ప్రసాద్	డాక్టర్ రెడ్డీస్	1.5



చుక్కలంటిన పసిడి ధర

» ఢిల్లీలో 10 గ్రాముల ధర రూ.69,200

న్యూఢిల్లీ: బంగారం ధర ఏ రోజుకారోజు కొత్త శిఖరాలకు దూసుకుపోతోంది. ఢిల్లీలో బుధవారం 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.830 పెరిగి రూ.69,200కు చేరింది. ఢిల్లీలో పసిడి ధర కొత్త రికార్డు ఇది. కిలో వెండి ధర కూడా రూ.1,700 లాభంతో రూ.80,700 వద్ద ముగిసింది. మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజ్‌లోనూ మేలో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల పుత్తడి ధర రికార్డు స్థాయిలో రూ.69,500కు చేరింది.

హైదరాబాద్ మార్కెట్: హైదరాబాద్ మార్కెట్‌లోనూ పసిడి, వెండి ధరలు ఢిల్లీ మార్కెట్‌ను మించిపోయాయి. పది గ్రాముల మేలిమి బంగారం ధర బుధవారం రూ.760 పెరిగి రూ.69,870 వద్ద ముగిసింది. కిలో వెండి ధర రూ.2,000 పెరిగి రూ.84,000 వద్ద ముగిసింది.

పసిడి ధర పెరుగుదలకు కారణాలు

- పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు.
- చైనా కేంద్ర బ్యాంకు భారీగా బంగారం కొనడం.
- అమెరికా వడ్డీ రేట్లపై కొనసాగుతున్న అనిశ్చితి.
- సురక్షిత పెట్టుబడిగా పసిడికి ఉన్న డిమాండ్
- డాలర్‌తో క్షీణిస్తున్న రూపాయి మారకం విలువ

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,870 ▲	64,100 ▲	84,000 ▲
ముంబై	69,360 ▲	63,540 ▲	77,590 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ



హైదరాబాద్	375	విజయవాడ	403
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	403	వరంగల్	377
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	139	గోదావరి	138
వరంగల్	139	విజయవాడ	138
కరీంనగర్	139	గుంటూరు	139
మహబూబ్‌నగర్	139	ఒంగోలు	139
కర్నూలు	139	చిత్తూరు	135
విశాఖపట్నం	124		



మోటారోలా ఎడ్జ్ 50 ప్రో ఫోన్

మోటారోలా కంపెనీ ఎడ్జ్ 50 ప్రో పేరిట కొత్త 5 జీ ప్రీమియం స్మార్ట్‌ఫోన్లను మార్కెట్లో విడుదల చేసింది. ప్రపంచ మార్కెట్లోనే ఈ ఫోన్ విడుదల చేయడం ఇదే ప్రథమం. ఏఐ ఆధారంగా పని చేసే ప్రో-గ్రేడ్ కెమెరా, స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 3 ప్రాసెసర్, 12 జీబీ రామ్, 256 జీబీ స్టోరేజి దీని ప్రత్యేకతలు. ప్రారంభ ధర రూ.31,999.



టయోటా క్రూయిజర్ టైజర్ కారు

జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం టయోటా అర్బన్ క్రూయిజర్ టైజర్‌ను మార్కెట్లో విడుదల చేసింది. ఢిల్లీలో దీని ఎక్స్ షోరూమ్ ధర రూ.7.73 లక్షల నుంచి రూ.13.03 లక్షల మధ్యన ఉంది. ఈ కారుకి బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. రూ.11,000 చెల్లించి కారును బుక్ చేసుకోవచ్చు.

శామ్‌సంగ్ బీస్పోక్ ఏఐ గృహోపకరణాలు



కొరియా దిగ్గజం శామ్‌సంగ్ కృత్రిమ మేధతో పని చేసే బీస్పోక్ ఏఐ గృహోపకరణాలు మార్కెట్లో విడుదల చేసింది. వేగంగా విస్తరిస్తున్న ప్రీమియం అప్లయెన్సెస్ మార్కెట్లో ఇవి సంచలనం సృష్టించడంతో పాటు జీవితాన్ని సరళం చేస్తాయని కంపెనీ తెలిపింది. ఈ ఉత్పత్తుల్లో ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు ఉన్నాయి.

40 సంవత్సరాల్లో 3 కోట్ల కార్ల తయారీ

» మారుతి సరికొత్త రికార్డు



న్యూఢిల్లీ: మారుతి సుజుకీ కంపెనీ కార్ల ఉత్పత్తిలో సరికొత్త రికార్డు సృష్టించింది. 1983 డిసెంబరులో ఉత్పత్తి ప్రారంభించిన నాటి నుంచి ఈ మార్చి నెలాఖరు నాటికి కంపెనీ మూడు కోట్ల కార్లను తయారుచేసింది. జపాన్ తర్వాత సుజుకి మోటార్ కార్పొరేషన్ ఈ ఘనత సాధించింది మన దేశంలోనే. అయితే జపాన్‌లో 55 సంవత్సరాల రెండు నెలల్లో ఈ ఘనత సాధిస్తే, మన దేశంలో 40 సంవత్సరాల నాలుగు నెలల్లోనే ఈ ఘనత సాధ్యమైంది.

స్వల్ప నష్టాలతో సరి

ముంబై: లాభాల స్వీకారంతో దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 27.09 పాయింట్ల నష్టంతో 73,876.82 వద్ద ముగియగా, నిఫ్టీ 18.65 పాయింట్ల నష్టంతో 22,434.65 వద్ద ముగిసింది. వడ్డీరేట్ల భవిష్యత్‌పై అమెరికా కేంద్ర బ్యాంకు చైర్మన్ జెరోం పోవెల్ ఈ రాత్రికి ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారోనని మార్కెట్ ఆతృతగా ఎదురు చూస్తోంది. అమ్మకాల ఒత్తిడి కొనసాగినా నిఫ్టీకి 22,350 వద్ద కీలక మద్దతు లభిస్తుందని టెక్నికల్ అనలిస్టుల అంచనా.

వొడాఫోన్ ఐడియా నిధుల సమీకరణ: వొడాఫోన్ ఐడియా రూ.20,000 కోట్లు సమీకరించనుంది. మంగళవారం జరిగిన వాటాదారుల అసాధారణ సర్వసభ్య సమావేశం (ఈజీఎం) ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ తీర్మానాన్ని వాటాదారుల్లో 99.01 శాతం మంది ఆమోదించినట్టు కంపెనీ బీఎస్ఈకి తెలిపింది.

వైద్యానికి రుణం 'కెనరా హీల్'



బెంగళూరు: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ కెనరా హీల్ పేరిట ప్రత్యేక ఆరోగ్య బీమా అనుసంధానిత రుణ పథకం, మరికొన్ని కొత్త స్కీమ్‌లు విడుదల చేసింది. కెనరా హీల్ కింద టీపీఏ ద్వారా బిల్లు సెటిల్ చేసే సమయంలో చికిత్స బిల్లు బీమా పరిమితిని దాటినట్టయితే ఆ సొమ్మును బ్యాంకు రుణంగా ఇస్తుంది. కస్టమర్లు తమకు, తమ కుటుంబ సభ్యులకు అయ్యే చికిత్సలకు ఈ రుణం తీసుకోవచ్చు. రుణంపై ఫ్లోటింగ్ రేటులో 11.55 శాతం, ఫిక్సడ్ రేటులో 12.30 శాతం వడ్డీ వసూలు చేస్తారు. మహిళా కస్టమర్ల కోసం కెనరా ఏంజెల్ పేరిట ప్రత్యేక సేవింగ్స్ ఖాతా విడుదల చేసింది. దీని కింద కేన్సర్ కేర్ పాలసీ, కెనరా రెడీ క్యాష్ పేరిట ప్రీ అప్రూవ్డ్ వ్యక్తిగత రుణం, కెనరా మై మనీ పేరిట టర్మ్ డిపాజిట్లపై ఆన్‌లైన్ రుణం వంటి ఆకర్షణలున్నాయి. కొత్తగా ఖాతా తెరిచే మహిళా కస్టమర్లకు ఇది ఉచితంగానే లభిస్తుంది. ప్రస్తుత కస్టమర్లు కూడా తమ ఖాతాను కెనరా ఏంజెల్‌గా అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. 'కెనరా యూపీఐ 123పే ఏఎస్ఐ" పేరిట పేమెంట్ ఇంటర్‌ఫేస్‌ను, బ్యాంకు ఉద్యోగుల హెచ్‌ఆర్ నిర్వహణ కోసం 'కెనరా హెచ్‌ఆర్ఎంఎస్ మొబైల్ యాప్ ఫర్ స్టాఫ్"ను కూడా విడుదల చేసింది. అలాగే ఆర్‌బీఐ ఇన్నోవేషన్ హబ్ సహకారంతో స్వయంసహాయక బృందాలకు ఇంటిముంగిటికే డిజిటల్ సర్వీసులు తెచ్చిన తొలి బ్యాంక్‌గా కెనరా బ్యాంక్ మారింది. డిజిటల్ ఎస్‌హెచ్‌జి సహాయంతో కస్టమర్లు తమ ఖాతాల్లోకి సొమ్మును డిజిటల్‌గానే క్రెడిట్ చేసుకోవచ్చు. ఆర్‌బీఐ ఇన్నోవేషన్ హబ్ సీఈఓ రాజేష్ బన్సాల్, కెనరాబ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఐపీఎల్ నుంచి శివమ్ మావి అవుట్

లఖ్‌నవూ: ఈ ఐపీఎల్ సీజన్‌లో జోరుమీదున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ శివమ్ మావి ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే లీగ్ మొత్తానికి దూరమయ్యాడు. పక్కటెముకల గాయం నుంచి కోలుకోనందున, అతను ఐపీఎల్ నుంచి వైదొలిగాడని ఫ్రాంఛైజీ బుధవారం ప్రకటించింది. 24 ఏళ్ల శివమ్‌ను రూ. 6.4 కోట్లు వెచ్చించి గతేడాది వేలంలో లఖ్‌నవూ జట్టు సొంతం చేసుకుంది.

ఆర్సీబీ ఓటమికి వాళ్లే కారణం..



న్యూఢిల్లీ: జట్టులోని స్టార్ ఆటగాళ్ల ఒత్తిడికి చిత్తు కావడమే ఆర్సీబీ పరాజయాలకు కారణమని టీమిండియా మాజీ బ్యాటర్ అంబటి రాయుడు విశ్లేషించాడు. ఐపీఎల్ మొదలైనప్పటినుంచి ప్రయత్నిస్తున్నా ఆర్సీబీకి టైటిల్ అందని ద్రాక్షగానే మిగిలింది. ఈసారి ఆ జట్టు పరిస్థితి మెరుగ్గాఏమీ లేదు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 4 మ్యాచ్‌లు ఆడితే మూడింటిలో పరాజయమే ఎదురైంది. దాంతో ఆ జట్టు పాయింట్ల పట్టికలో కింది నుంచి మూడో స్థానంలో ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో రాయుడు స్పందిస్తూ..బెంగళూరు స్టార్ బ్యాటర్లు విరాట్, మ్యాక్స్‌వెల్, కెప్టెన్ డుప్లెసినుద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించాడు. 'ఒత్తిడి సమయాల్లో భారత యువ బ్యాటర్లు, దినేశ్ కార్తీక్ మినహా మరెవరూ రాణించడంలేదు. ఒత్తిడి సందర్భాల్లో బాధ్యత తీసుకోవాల్సి స్టార్లు ఏం చేస్తున్నారు. అప్పటికే వారు అవుటై డ్రెసింగ్ రూమ్ చేరుతున్నారు' అని రాయుడు విమర్శించాడు.

సిరీస్ లంక వశం

రెండో టెస్ట్‌లోనూ ఓడిన బంగ్లా

చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో శ్రీలంక 192 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ క్రమంలో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 511 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా.. ఆటకు ఆఖరి, ఐదో రోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 268/7తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా 318 పరుగులకు ఆలౌటైంది. మెహిదీహసన్ మిరాజ్ (81 నాటౌట్) పోరాటం వృథా అయింది. లాహిరు కుమార 4, కమిందు మెండిస్ 3 వికెట్లు తీశారు. లంక 531, 157/7 డిక్లేర్ చేయగా.. బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగులకు కుప్పకూలింది. మొదటి టెస్ట్‌లో 328 రన్స్‌తో గెలిచిన లంక.. బంగ్లాలో టెస్ట్ ఓడని రికార్డును నిలబెట్టుకొంది.

ఈ నెలాఖరులో బంగ్లా టూర్‌కు అమ్మాయిలు

ఢాకా: భారత క్రికెట్ మహిళల జట్టు ఈనెలాఖరులో బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. ఈనెల 28 నుంచి వచ్చేనెల 9 వరకు బంగ్లాతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది భారత జట్టు. ఈ మేరకు బంగ్లా క్రికెట్ బోర్డు బుధవారం షెడ్యూల్‌ను విడుదలజేసింది. ఏప్రిల్ 28న తొలి టీ20, 30న రెండోది, మే2న మూడోది, 6న నాలుగోది, చివరి మ్యాచ్ మే 9న జరగనున్నాయి. మ్యాచ్‌లన్నీ సిల్హెట్ వేదికగా జరుగుతాయి.

ఫిట్‌నెస్‌లో సూర్య పాస్!

7 లేదా 11 నుంచి జట్టులోకి?



న్యూఢిల్లీ: హ్యాట్రిక్ పరాజయాలతో డీలాపడిన ముంబై ఇండియన్స్‌కు శుభవార్త. ఆ జట్టు స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. హెర్నియాతోపాటు పాదం గాయానికి శస్త్ర చికిత్స చేయించుకొని ప్రస్తుతం బెంగళూరు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పునరావాసంలో ఉన్న టీ20 వరల్డ్ నెం.1 బ్యాటర్ సూర్యకుమార్ అన్ని ఫిట్‌నెస్ పరీక్షల్లో సఫలమైనట్టు సమాచారం. 'ఆటలో మళ్లీ అడుగుపెట్టేందుకు అవసరమైన ఒక్క సాధారణ ఫిటెనెస్ పరీక్ష తప్ప.. మిగిలిన అన్ని పరీక్షలను అతడు విజయవంతంగా పూర్తి చేశాడు. ఆ ఒక్కటి కూడా గురువారం జరగనుంది' అని బీసీసీఐ అధికారి ఒకరు బుధవారం వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదీన ముంబైలో ఢిల్లీతో జరిగే మ్యాచ్ ద్వారా సూర్య పునరాగమనం చేస్తాడని ఆయన తెలిపారు. ఆ మ్యాచ్‌తో గనక సాధ్యపడకపోతే..11న బెంగళూరుతో జరిగే పోరుకు కచ్చితంగా జట్టులోకి వస్తాడని చెప్పారు.

విశాఖ దద్దరిల్లింది

కోల్‌కతా 272/7

ఐపీఎల్‌లో రెండో అత్యధిక స్కోరు

- నరైన్, రఘువంశీ ధనాధన్ ఇన్నింగ్స్
- అదరగొట్టిన రస్సెల్, రింకూ
- 106 పరుగులతో ఢిల్లీ ధమాల్


సునీల్ నరైన్ (39 బంతుల్లో 85)

విశాఖపట్నం: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన కోల్‌కతా నైట్‌రైడర్స్.. ఐపీఎల్‌లో హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సునీల్ నరైన్ (39 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 85) ఊచకోతకు అంక్రిష్ రఘువంశీ (27 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 54) సుడిగాలి ఇన్నింగ్స్ తోడవడంతో.. బుధవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో కోల్‌కతా 106 పరుగుల భారీ తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. తొలుత కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 272 పరుగుల భారీ స్కోరు చేసింది. రస్సెల్ (19 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 41) ధాటిగా ఆడాడు. నోకియా 3, ఇషాంత్ 2 వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో ఢిల్లీ 17.2 ఓవర్లలో 166 పరుగులకే కుప్పకూలింది. రిషబ్ పంత్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 55), స్టబ్స్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 54) వినహా అంతా విఫలమయ్యారు. వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి చెరో 3 వికెట్లు.. స్టార్క్ 2 వికెట్లు కూల్చాడు.

పెవిలియన్‌కు క్యూ..: కొండంత లక్ష్య ఛేదనలో ఢిల్లీ బ్యాటర్లు ముందుగానే చేతులెత్తేశారు. 33 పరుగులకే టాపార్డర్ బ్యాటర్లు వార్నర్ (18), పృథ్వీ షా (10), మిచెల్ మార్ష్ (0), అభిషేక్ పోరెల్ (0)ను కోల్పోయిన క్యాపిటల్స్ పీకల్లోతు కష్టాల్లో పడింది. మార్ష్, వార్నర్‌ను స్టార్క్ అవుట్ చేయగా.. షా, పోరెల్‌ను అరోరా పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో స్టబ్స్, పంత్ ఐదో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. రిషబ్ సిక్స్‌తో ఖాతా తెరవగా.. స్టబ్స్ రెండు బౌండ్రీలు బాదడంతో పవర్‌ప్లేలో ఢిల్లీ 51/4 స్కోరు చేసింది. మధ్య ఓవర్లలో కూడా వీరిద్దరూ ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డులో ఊపుతెచ్చారు. అయితే, వెంకటేష్ అయ్యర్ వేసిన 12వ ఓవర్‌లో 4,6,6,4,4,4తో 28 పరుగులు పిండుకొన్న పంత్ వరుసగా రెండో అర్ధ శతకాన్ని నమోదు చేశాడు. కానీ, రిషబ్, అక్షర్ (0)తోపాటు స్టబ్స్‌ను చక్రవర్తి అవుట్ చేయడంతో ఢిల్లీ పోరాటం ముగిసింది.

బాదుడే.. బాదుడు..: ఓపెనర్ నరైన్, టీనేజర్ రఘువంశీ అదిరే ఆటకు.. రస్సెల్ పవర్ హిట్టింగ్ తోడుకావడంతో కోల్‌కతా పరుగుల వరద పారించింది. ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపించిన నరైన్, రఘువంశీ కేవలం 48 బంతుల్లో 102 పరుగుల భాగస్వామ్యంతో భారీ స్కోరుకు బాటలు వేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న కోల్‌కతాకు ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (18), నరైన్ తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. 4వ ఓవర్‌లో ఇషాంత్ బౌలింగ్‌లో నరైన్ మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 26 పరుగులు పిండుకోవడంతో.. స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. అయితే, ఆ తర్వాతి ఓవర్‌లో సాల్ట్‌ను నోకియా క్యాచవుట్ చేశాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రఘువంశీ.. నరైన్ పోటీపడి మరీ షాట్లు ఆడడంతో రన్‌రేట్ మరింతగా జోరందుకొంది. రసిక్ బౌలింగ్‌లో మూడు ఫోర్లు, సిక్స్‌తో చెలరేగిన సునీల్ అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. ఆరు ఓవర్లకు కోల్‌కతా 88/1తో నిలిచింది. 53 పరుగుల స్కోరు వద్ద నరైన్ ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను నోకియా అందుకోలేక పోవడంతో నరైన్ మరింతగా విజృంభించాడు. మరోవైపు రఘువంశీ కూడా సిక్స్‌లతో చెలరేగడంతో.. 11వ ఓవర్‌లోనే జట్టు స్కోరు 150 మార్క్‌కు చేరుకొంది. అయితే, సునీల్‌ను క్యాచవుట్ చేసిన మార్ష్.. ఎట్టకేలకు ఢిల్లీకి బ్రేక్ ఇచ్చాడు. ఆ వెంటనే ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న రఘువంశీని నోకియా బోల్తా కొట్టించాడు. కానీ, రస్సెల్ ఎడాపెడా షాట్లతో 16వ ఓవర్‌లోనే నైట్‌రైడర్స్ స్కోరు 200 పరుగులు దాటింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (18) మరోసారి షార్ట్ బాల్‌కు అవుట్ కాగా.. ఉన్నంతసేపు మెరుపులు మెరిపించిన రింకూ సింగ్ (8 బంతుల్లో ఓ ఫోర్, 3 సిక్సర్లతో 26)ను నోకియా వెనక్కిపంపాడు. ఆఖరి ఓవర్‌లో రస్సెల్, రమణ్‌దీప్ (2)ను అవుట్ చేసిన ఇషాంత్.. ఇటీవల ఉప్పల్‌లో సన్‌రైజర్స్ నమోదుచేసిన అత్యధిక ఐపీఎల్ స్కోరు రికార్డును కోల్‌కతా దాటకుండా అడ్డుకొన్నాడు.

1 ఐపీఎల్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేసిన పిన్న వయస్కుడిగా రఘువంశీ (18 ఏళ్ల 303 రోజులు). 2008లో శ్రీవత్స్ గోస్వామి (19 ఏళ్లు) అరంగేట్రం మ్యాచ్‌లో 52 పరుగులు చేశాడు.

నేటి మ్యాచ్
గుజరాత్ x పంజాబ్
రా.7.30 నుంచి

టీ20ల్లో జట్టు అత్యధిక స్కోర్లు

ఎవరు	ఎంత	ఎవరిపై	ఎప్పుడు
నేపాల్	314/3	మంగోలియా	2023
అఫ్ఘానిస్థాన్	278/3	ఐర్లాండ్	2019
చెక్ రిపబ్లిక్	278/4	టర్కీ	2019
హైదరాబాద్	277/3	ముంబై	2024
కోల్‌కతా	272/7	ఢిల్లీ	2024


రఘువంశీ (27 బంతుల్లో 54)


రస్సెల్ (41)
రింకూ (26)

స్పోర్ట్స్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

టీనేజర్.. బెరుకులేని బ్యాటర్!

వైజాగ్‌లో.. సీనియర్ ఆటగాడు సునీల్ నరైన్‌తో కలిసి ఓ కుర్రోడు ఢిల్లీ బౌలర్లను ఊచకోత కోశాడు. ఐపీఎల్‌లో బ్యాటింగ్ చేస్తున్నది తొలి మ్యాచైనా ఏ మాత్రం జంకకుండా ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లు బాదుతూ ఫ్యాన్స్‌ను అలరించాడు. అంతేకాదు.. 25 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి అందరి దృష్టిని తనవైపు తిప్పుకొన్నాడు. అతడే ఢిల్లీకి చెందిన 19 ఏళ్ల అంక్రిష్ రఘువంశీ. క్రికెట్‌పై అనురక్తితో రఘు..11 ఏళ్ల వయస్సులో ముంబై తరలివెళ్లి అభిషేక్ నాయర్ ఆధ్వర్యంలో ఆటలో మెళకువలు నేర్చుకున్నాడు. పొడగరి అయిన రఘు 2022లో కరీబియన్ దీవుల్లో జరిగిన అండర్-19 వరల్డ్ కప్‌లో తన బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. 2023-24 సీజన్‌లో ముంబై తరఫున లిస్ట్ 'ఏ', టీ20 అరంగేట్రం చేశాడు. వేలంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ రఘువంశీని రూ. 20 లక్షలకు కొనుగోలు చేసింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో గత మ్యాచ్‌లో అరంగేట్రం చేసినా బ్యాటింగ్ అవకాశం మాత్రం రాలేదు. ఇక ఢిల్లీతో పోరులో మూడో నెంబర్‌లో దిగిన రఘు.. నోకియా, అక్షర్ పటేల్, మిచెల్ మార్ష్ వంటి స్టార్ బౌలర్లను ఓ ఆటాడుకున్నాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	3	3	0	0	6	2.518
రాజస్థాన్	3	3	0	0	6	1.249
చెన్నై	3	2	1	0	4	0.976
లఖ్‌నవూ	3	2	1	0	4	0.483
గుజరాత్	3	2	1	0	4	-0.738
హైదరాబాద్	3	1	2	0	2	0.204
పంజాబ్	3	1	2	0	2	-0.337
బెంగళూరు	4	1	3	0	2	-0.876
ఢిల్లీ	4	1	3	0	2	-1.347
ముంబై	3	0	3	0	0	-1.423

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి) స్టబ్స్ (బి) నోకియా 18, నరైన్ (సి) పంత్ (బి) మార్ష్ 85, రఘువంశీ (సి) ఇషాంత్ (బి) నోకియా 54, రస్సెల్ (బి) ఇషాంత్ 41, శ్రేయాస్ (సి) స్టబ్స్ (బి) ఖలీల్ 18, రింకూ సింగ్ (సి) వార్నర్ (బి) నోకియా 26, వెంకటేశ్ (నాటౌట్) 5, రమణ్‌దీప్ (సి) పృథ్వీ షా (బి) ఇషాంత్ 2, స్టార్క్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 20 ఓవర్లలో 272/7; వికెట్ల పతనం:** 1-60, 2-164, 3-176, 4-232, 5-264, 6-264, 7-266; **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-43-1, ఇషాంత్ 3-0-43-2, నోకియా 4-0-59-3, రసిఖ్ 3-0-47-0, సుమిత్ 2-0-19-0, అక్షర్ 1-0-18-0, మార్ష్ 3-0-37-1.

ఢిల్లీ: వార్నర్ (బి) స్టార్క్ 18, పృథ్వీ షా (సి) వరుణ్ (బి) వైభవ్ 10, మార్ష్ (సి) రమణ్‌దీప్ (బి) స్టార్క్ 0, అభిషేక్ (సి) నరైన్ (బి) వైభవ్ 0, పంత్ (సి) శ్రేయాస్ (బి) వరుణ్ 55, స్టబ్స్ (సి) స్టార్క్ (బి) వరుణ్ 54, అక్షర్ (సి/సబ్) పాండే (బి) వరుణ్ 0, సుమిత్ (సి/సబ్) పాండే (బి) నరైన్ 7, రసిఖ్ (సి) సాల్ట్ (బి) వైభవ్ 1, నోకియా (సి) శ్రేయాస్ (బి) రస్సెల్ 4, ఇషాంత్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 17.2 ఓవర్లలో 166 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-21, 2-26, 3-27, 4-33, 5-126, 6-126, 7-159, 8-159, 9-161, 10-166; **బౌలింగ్:** స్టార్క్ 3-0-25-2, వైభవ్ 4-0-27-3, రస్సెల్ 1.2-0-14-1, నరైన్ 4-0-29-1, వరుణ్ 4-0-33-3, వెంకటేశ్ 1-0-28-0.

పంత్ కారణంగా..

రివ్యూలు తీసుకోవడంలో రిషభ్ పంత్ వైఫల్యం కారణంగా ఢిల్లీ భారీ మూల్యాన్నే చెల్లించుకుంది. 24 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇషాంత్ బౌలింగ్‌లో నరైన్ బ్యాట్ ఎడ్జ్ తీసుకొగా.. పంత్ రివ్యూ తీసుకోవడంలో ఆలస్యం చేశాడు. ఇక, రసిక్ బౌలింగ్‌లో అయ్యర్ క్యాచవుట్ విషయంలో కూడా రివ్యూకు నిరాకరించాడు.

ఆంధ్రజ్యోతి

మాదిగల కోసం నిజాయితీగా పోరాడలేదు

- మంద కృష్ణపై కవ్వంపల్లి సత్యనారాయణ ధ్వజం
- అప్పుల పాలు చేసినందుకే బొందపెట్టారు
- బీఆర్ఎస్‌పై చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్య

హైదరాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మాదిగల కోసం మంద కృష్ణ మాదిగా నిజాయితీగా ఏనాడూ పోరాడలేదని, స్వప్రయోజనాల కోసమే ఆయన పార్టీలు మారుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపించారు. బీజేపీలో దళితులు, ముస్లింలు లేరని, మతతత్వ పార్టీ అని తెలిసీ ఆ పార్టీకి మంద కృష్ణ ఎందుకు మద్దతుగా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. మంద కృష్ణమాదిగను కేసీఆర్ జైల్లో పెడితే ఆదుకున్నది ఎవరన్నది గ్రహించాలన్నారు. కాగా, బీజేపీ మెప్పు కోసమే సీఎం రేవంత్‌రెడ్డిపై మంద కృష్ణమాదిగ వ్యాఖ్యలు చేస్తున్నారని టీపీసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్ ప్రీతం అన్నారు. మంద కృష్ణమాదిగ కుట్రలను తిప్పికొట్టేలా అన్ని జిల్లా, మండల కేంద్రాలలో ప్రెస్‌మీట్ లు పెట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేసీఆర్‌కు రైతులపై నిజంగా ప్రేమే ఉంటే.. ఆయన హయాంలో ఎందుకు ఖమ్మం రైతుల చేతికి బేడీలు వేయించి.. జైలుకు పంపారని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఈ నాలుగు నెలల్లో రాష్ట్రంలో 63 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే.. అందులో సగం మంది రైతులు కానివారే ఉన్నారన్నారు. ఆ రోజున బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్న, చిన్న కాల్వలను పూర్తి చేసుంటే ఈ రోజున తెలంగాణ సస్యశ్యామలమయ్యుండేదని, ఈ పనుల్లో కమీషన్లు రావనే పూర్తి చేయలేదని కాంగ్రెస్ పార్టీ భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజల్ని మభ్యపెట్టి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినందునే ఎన్నికల్లో ఆ పార్టీని బొంద పెట్టారన్నారు.

మంచి మెజార్టీతో వంశీని గెలిపిస్తాం: కాంగ్రెస్

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను పెద్ద మెజారిటీతో గెలిపించుకుంటామని ఆ నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ నివాసంలో మీడియాతో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్, గడ్డం వినోద్, గడ్డం వివేక్ మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మంచి మెజారిటీతో వంశీని గెలిపించాలని పెద్దపల్లి ప్రజలను కోరారు. రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ కాకా లెగసీని వంశీ ముందుకు తీసుకెళతాడని కొనియాడారు. వంశీకృష్ణ మాట్లాడుతూ శ్రీధర్‌బాబు ఆశీస్సులతోనే తనకు టిక్కెట్టు వచ్చిందన్నారు.

కాంగ్రెస్ సమన్వయ కర్తల నియామకం

లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు సీఎం రేవంత్‌రెడ్డి.. సమన్వయ కర్తలను నియమించారు. ఈ మేరకు జాబితాను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ బుధవారం ప్రకటించారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి మూడంచెల సమన్వయకర్తల వ్యవస్థను ఏర్పాటు చేసి లోక్‌సభ ఎన్నికల ప్రచారం, పోల్ మేనేజ్‌మెంట్లో భాగస్వాములను చేయనున్నట్లు ఇటీవల పార్టీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయ కర్తలను నియమించారు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే తెరపైకి ఫోన్ ట్యాపింగ్ కేసులు: డీకే అరుణ



షాద్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనతి కాలంలోనే ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని, ప్రజల దృష్టిని మరల్చేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ కేసులు తెరపైకి తెచ్చారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆమె రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం విడ్డూరమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరువు వచ్చిందని గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీరు కూడా లభ్యం కావడంలేదని, ప్రజల దాహార్తిని తీర్చలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. ప్రస్తుతం దేశంలో నరేంద్ర మోదీ హవా నడుస్తోందని, లోక్‌సభ ఎన్నికల్లోనూ మళ్లీ బీజేపీదే గెలుపని ఆమె ధీమా వ్యక్తంచేశారు.

బిహార్‌లో 11 స్థానాల్లో ఎంఐఎం పోటీ

- కిషన్‌గంజ్ నుంచి అక్తరుల్ ఇమాన్ నామినేషన్..
- యూపీలో 7, మహారాష్ట్రలో 5 సీట్లలో పోటీకి సన్నాహాలు

హైదరాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎంఐఎం దూకుడు పెంచింది. జాతీయ స్థాయిలో సత్తా చాటేందుకు వివిధ రాష్ట్రాల్లో సాధ్యమైనన్ని సీట్లలో పోటీ చేసేందుకు సిద్ధమైంది. బిహార్‌లో 11 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. బిహార్ ఎంఐఎం చీఫ్ అక్తరుల్ ఇమాన్ మరోసారి అక్కడి కిషన్‌గంజ్ నుంచి పార్టీ అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. హైదరాబాద్ నుంచి వెళ్లిన నాంపల్లి శాసనసభ్యుడు మాజిద్ హుస్సేన్‌తో కలసి అక్తరుల్ ఇమాన్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. తొలుత బిహార్‌లో 20 లోక్‌సభ స్థానాల్లో భావించినప్పటికీ పార్టీ పరిశీలకుల సిఫారసు మేరకు 11 స్థానాల్లో అభ్యర్థులను రంగంలోకి దించాలని నిర్ణయించింది. ఇటు ఉత్తరప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీలైన అప్నాదళ్ (కామెరవాడి), ప్రగతిశీల మానవ్‌సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీల కూటమితో ఎంఐఎం పొత్తు కుదుర్చుకుంది. అక్కడి ఏడు స్థానాల్లో అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇక మహారాష్ట్రలోని ఔరంగాబాద్ నుంచి సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్‌ను మరోసారి అభ్యర్థిగా ఇప్పటికే ఎంఐఎం ప్రకటించింది. ఆ రాష్ట్రంలో మొత్తం 5 స్థానాల్లో పోటీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

రూ.18లక్షల నగదు పట్టివేత

హైదరాబాద్ సిటీ షాబాద్, మంచిర్యాల ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో.. పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఠాకూర్ సోహన్ సింగ్(38) అనే వ్యక్తి నుంచి రూ. 11.65 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం తెలిపింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సర్దార్ నగర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో రూ.5 లక్షలు పట్టుబడినట్లు ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి వెల్లడించారు. తిరుపతయ్య అనే వ్యక్తి తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బును తీసుకెళ్తున్న క్రమంలో నగదును సీజ్ చేశామని, నగదును కలెక్టరేట్ అధికారులకు అప్పగించామని చెప్పారు. అలాగే మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తుల నుంచి లక్షన్నర స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మల్కా యశస్వి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌కి చెందిన మల్కా యశస్వి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. మల్కా యశస్వి బిట్స్ పిలానీ దుబాయ్ క్యాంపస్‌లో బీటెక్ పూర్తిచేశారు. అనంతరం అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించారు. ప్రస్తుతం ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్, పల్లవి స్కూల్స్ ఎకో భారత్ కంపెనీ సీఈవోగా కొనసాగుతున్నారు. తన తండ్రి కొమరయ్య స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని, ఈ పదవి తనపై బాధ్యతను మరింత పెంచిందని యశస్వీ అన్నారు.

మత్తు పదార్థాల తయారీ కేసులో తెలంగాణ యూనివర్సిటీ అధ్యాపకుడి అరెస్టు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా తెలంగాణ విశ్వవిద్యాలయంలోని సౌత్ క్యాంపస్(బిక్కనూరు)లో పనిచేస్తున్న కెమిస్ట్రీ విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌ను మత్తు పదార్థాల తయారీ కేసులో బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ శివారులో గల మెడికమ్ ల్యాబ్ సంస్థలో ఇతనికి భాగస్వామ్యం ఉందని ఔషధ నియంత్రణ సంస్థ నిర్ధారణ చేసింది. దీంతో ఓ పక్క తెలంగాణ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ మరోపక్క చట్ట వ్యతిరేక వ్యాపారాన్ని నడుపుతున్న శ్రీనివాస్‌పై చర్యలు తీసుకునేందుకు వర్సిటీ అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఉన్నతాధికారులకు ఇప్పటికే సమాచారాన్ని అందజేశారు.

ప్రశ్నించే గొంతును గెలిపించాలి

- కాంగ్రెస్ హామీలపై నిలదీయాలి
- స్వార్థపరులే పార్టీలు మారుతున్నారు: హరీశ్‌రావు



యాదాద్రి/హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ నేతలు వంద రోజుల్లో హామీలను అమలు చేయకపోగా అబద్ధాలు మాట్లాడుతున్నారు. పైగా ఎన్నికల కోడ్‌ను సాకుగా చెబుతున్నారు. కాంగ్రెస్ హామీలు అమలు కావాలంటే రాష్ట్రంలో ప్రశ్నించే గొంతును గెలిపించాలి. మాట తప్పిన కాంగ్రెస్‌ను ఓడించాలి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనకు వందరోజులు నిండాకే కోడ్ అమల్లోకి వచ్చిందని, ఆరు గ్యారెంటీల్లో తొలి హామీ అయిన మహిళలకు రూ.2500అమలు చేయలేదని విమర్శించారు. రూ.2లక్షల రుణమాఫీ, వడ్లకు రూ.500బోనస్, రూ.4వేల పింఛన్, రూ.15వేల రైతుబంధు, తులం బంగారం, రూ.4వేల నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.5లక్షల బ్యాంకు కార్డు.. వీటిలో ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదన్నారు. రైతులను, నిరుద్యోగులను, మహిళలను, విద్యార్థులను, నిరుపేదలందరినీ కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. దానం నాగేందర్, కడియం కావ్య, రంజిత్‌రెడ్డి, పట్నం సునీతామహేందర్‌రెడ్డిలు పార్టీ మారడాన్ని ప్రజలు హర్షించడం లేదన్నారు. స్వార్థపరులే పార్టీలు మారుతున్నారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని, గ్యాస్, పెట్రోల్, ధరలను భారీగా పెంచిందన్నారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేయడంకాదని, ప్రజలకు చేసిన మేలేంటో బీజేపీ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

రూ.2లక్షలు రైతు రుణమాఫీ చేయండి

రైతు రుణమాఫీ చేస్తామన్న ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని, బ్యాంకుల నుంచి నోటీసులు, ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న రైతులకు తక్షణం రూ.2లక్షలు మాఫీచేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎంకు లేఖ రాశారు. "కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు గత ఏడాది డిసెంబరు 9న రూ.2లక్షలు రుణమాఫీ చేయాల్సి ఉండగా.. నేటికి అమలు పర్చలేదు. తీసుకున్న అప్పులకు వడ్డీతో సహా కిస్తీలు చెల్లించి తీరాల్సిందేనంటూ బ్యాంకులు రైతులకు నోటీసులు ఇస్తూ వేధిస్తున్నాయి. రాష్ట్రంలో 24గంటల ఉచిత విద్యుత్ అందక పంటలు ఎండిపోవడంతో రైతులు నష్టాలపాలవుతున్నారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయండి" అని హరీశ్ కోరారు.

ట్యాపింగ్ జరిగి ఉంటే.. కేసీఆరే బాధ్యుడా?

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే బాధ్యుడిని చేస్తారా? అని ప్రశ్నించారు. అధికారంలో పార్టీలు మారినా.. అధికారులు మారలేదని, ప్రస్తుత డీజీపీ రవిగుప్తా, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు బీఆర్ఎస్ ప్రభుత్వంలో వివిధ హోదాల్లో ఉన్నారని, మరి అందులో ఈ అధికారుల ప్రమేయం ఉండదా? అని నిలదీశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "హీరోయిన్లను నేను బెదిరించానని ఓ మంత్రి అంటున్నారు. ఆ మంత్రికి తలకాయ ఉందో లేదో తెలియదు. అటువంటి దిక్కుమాలిన పని చేయాల్సిన అవసరం నాకు లేదు" అని స్పష్టం చేశారు. ఇల్లీగల్ వ్యవహారాలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అడ్డదిడ్డమైన మాటలు, చెత్త ఆరోపణలు చేస్తే.. మంత్రి అయినా.. ముఖ్యమంత్రి అయినా వదలబోనని హెచ్చరించారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని లీగల్‌గా తాట తీస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 2011లో సీఎంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ ఎంపీల ఫోన్లు ట్యాప్ చేశారని అప్పట్లో కాంగ్రెస్ నేతలు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గడ్డం వివేక్ ఆరోపించారని కేటీఆర్ గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో వచ్చిందని, సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే 2004 నుంచి ఫోన్ ట్యాపింగ్ జరిగిందేమో తీయాలని, అప్పటి నుంచి ఏ కుంభకోణాలు జరిగాయో తేల్చాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు తన యాపిల్ ఫోన్ హ్యాక్ అయినట్లు సందేశం పంపారని వెల్లడించారు. హామీలు నెరవేర్చలేక.. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఇలాంటివి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇలా ఎన్ని రోజులు గడుపుతారని ప్రశ్నించారు.

కడియం, దానం పదవులు ఊస్టింగే

ఒక పార్టీ గుర్తుతో గెలిచి.. మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేలను మూడు నెలల్లోగా అనర్హులుగా నిర్ణయించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్‌ల పదవి మూడు నెలల్లో ఊడిపోవడం గ్యారెంటీ అని, తొందర్లోనే ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాలకు ఉప ఎన్నిక రావడం తథ్యమని అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 40 సీట్లు దాటవని తాను అనలేదని, ఇండియా కూటమికి చెందిన మమతా బెనర్జీయే అన్నారని గుర్తు చేశారు. ప్రతిసారీ మొగోడినైతే అని మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి.. నిజంగా మగాడైతే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ హయాంలో మళ్లీ తాగునీటి తండ్లాట మొదలైందని, ప్రజల గొంతెండిపోతున్నా.. ప్రభుత్వానికి పట్టడం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేయనందుకు హైదరాబాద్ నగరంపై రేవంత్‌రెడ్డి కక్షగట్టారని, అందుకే ప్రాజెక్టుల్లో నీళ్లున్నా తాగునీరు అందించడం లేదని అన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని ఎందుకు సరఫరా చేయాల్సి వస్తోందో సీఎం చెప్పాలన్నారు. కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షతో కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టుగా చూపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరంలో నీళ్లున్నా.. దాచిపెట్టడంతో లక్షల ఎకరాల పంట ఎండిపోయిందన్నారు. పంట పండితే బోనస్ ఇవ్వాలన్న భయంతోనే ఎండ బెట్టారని ఆరోపించారు. రైతుల ఆత్మహత్యల వివరాలను సీఎంకు నేరుగా పంపిస్తామని, అయితే అన్ని వివరాలు తామే ఇస్తే.. ముఖ్యమంత్రి ఎందుకు? ఆయన అధికార యంత్రాంగం ఎందుకు? అని ప్రశ్నించారు.



తెలంగాణ భవన్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో కేటీఆర్

రాముడికి మొక్కుదాం,బీజేపీని తొక్కుదాం

'రాముడికి మొక్కుదాం.. ఎన్నికల్లో బీజేపీని తొక్కుదాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వికారాబాద్‌లో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాముడికి దండం పెడదాం.. మోదీకి ఓటేద్దామంటూ బీజేపీ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని, రాముడికి దండం పెడదాం.. కానీ, మోదీకి ఎందుకు ఓటు వేయాలో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రానికి బీజేపీ ఏమి చేసిందో చెప్పగలరా? అని నిలదీశారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను పిరం చేసిన మోదీ.. పిరమైన ప్రధాని అని విమర్శించారు. మోదీ హవా ఉందని చెప్పే బీజేపీ నాయకులు ఇతర పార్టీల్లో నుంచి అభ్యర్థులను ఎందుకు వెతుక్కుంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అభ్యర్థులు లేరని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు బీజేపీతోనే పోటీ ఉందన్నారు. సీఎం రేవంత్ గుంపు మేస్త్రీ అయితే.. మోదీ తాపీ మేస్త్రీ అని, ఆ ఇద్దరూ కలిసి తెలంగాణలో బీఆర్ఎస్‌కు సమాధి కట్టాలని చూస్తున్నారని అన్నారు. పట్నం మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి.. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దే ద్రోహులని, విశ్వేశ్వర్‌రెడ్డి విశ్వాస ఘాతకుడని అన్నారు.

కొండా సురేఖ, యెన్నం, మహేందర్‌రెడ్డికి లీగల్ నోటీసులు

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనపై తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొంటూ.. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం లీగల్ నోటీసులు పంపించారు. తనపై చేసిన ఆరోపణలకు వారం రోజుల్లోగా క్షమాపణ చెప్పాలని, లేదంటే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. వారితోపాటు పలు మీడియా సంస్థలకు, యూట్యూబ్ చానళ్లకు కేటీఆర్ మరోసారి లీగల్ నోటీసులు పంపారు.

తుక్కు రవాణా బంద్!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించింది. ఈ మేరకు 2022లో టెండర్లు పిలిస్తే ముంబైకి చెందిన హెచ్ఆర్ కంపెనీ రూ.485కోట్లకు టెండర్ పొందింది. దాంతో 2023 ఫిబ్రవరిలో తుక్కును తరలించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ తరలింపులో నిబంధనలు ఉల్లంఘించి తుక్కును తరలిస్తున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన జెన్‌కో సీఎండీ రిజ్వీ కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారం కూల్చివేతకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎంత తుక్కు తరలించారు..? నిబంధనలు ఏమిటి..? అనే అంశాలపై ఆరా తీశారు. అలాగే, కేటీపీఎస్ ఓఅండ్ఎం సీఈ వెంకటేశ్వరరావు కూడా ఈ అంశంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. దీంతో ఉదయం వరకు తుక్కును రవాణా చేసిన కాంట్రాక్టర్ మధ్యాహ్నం నుంచి పనులు నిలిపివేశారని తెలుస్తోంది. కాగా, 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ఈ కథనంపై ఎలక్ట్రానిక్ మీడియాలో చర్చలు నిర్వహించడం గమనార్హం.

10 మంది ఐఏఎస్‌లతో తాగునీటి సరఫరా పర్యవేక్షణ

హైదరాబాద్, ఏప్రిల్ 3: ఎండాకాలం మొదట్లోనే రాష్ట్రంలో భూగర్భజలాలు అడుగంటి తాగునీటికి కటకట ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశంపై దృష్టిసారించింది. తాగునీటి సరఫరాపై పర్యవేక్షణకు 10 మంది ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. జూలై చివరివరకూ ఈ అధికారులందరూ జిల్లాల్లో పర్యటించి.. ఆయా జిల్లాల కలెక్టర్లతో, రాష్ట్ర స్థాయి విభాగాలతో సమన్వయం చేసుకుంటూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ తగినంత తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని పేర్కొంది. జూలై చివరివరకూ వీరంతా సెలవులకు దరఖాస్తు చేయొద్దని.. సీఎస్ శాంతికుమారి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేక అధికారులుగా నియమించినవారిలో.. పాటిల్ ప్రశాంత్ జీవన్, ఎస్.కృష్ణ ఆదిత్య, ఆర్వీ కర్ణన్, అనితా రామచంద్రన్, ఎ.శరత్, బి.విజయేంద్ర, శ్రుతి ఓఝా, బి.గోపి, భారతి హోళికెరి, కె.సురేంద్ర మోహన్ ఉన్నారు.

జనజాతర టార్గెట్..10లక్షలు!

- తుక్కుగూడ సభకు భారీగా జన సమీకరణ
- హాజరు కానున్న రాహుల్, ప్రియాంక, ఖర్గే
- పాంచ్ న్యాయ్ గ్యారెంటీలు, మేనిఫెస్టోను తెలుగులో విడుదల చేసేందుకు సన్నాహాలు
- కాంగ్రెస్‌కు సెంటిమెంట్‌గా మారిన తుక్కుగూడ



హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తుక్కుగూడలో ఈ నెల 6న తలపెట్టిన జనజాతర సభకు కాంగ్రెస్ పార్టీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సభకు ఏకంగా పది లక్షల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. జన సమీకరణ బాధ్యతను ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు అప్పజెప్పింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ప్రకటించిన పాంచ్ న్యాయ్ గ్యారెంటీలు, ఈ నెల 5న విడుదల చేయనున్న ఎన్నికల మేనిఫెస్టోను ప్రాంతీయ భాషల్లో విడుదల చేసేందుకు ఉత్తరాదిన రెండు, దక్షిణాదిన రెండు సభలు నిర్వహించాలని ఏఐసీసీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే పాంచ్ న్యాయ్ గ్యారెంటీలు, పార్టీ ఎన్నికల మేనిఫెస్టో తెలుగు ప్రతులను విడుదల చేసేందుకు ఈ నెల 6న తుక్కుగూడలో జనజాతర సభ నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ హాజరు కానున్నారు. ఈ నెల 6వ తేదీన సాయంత్రం 3.30 గంటలకు ప్రత్యేక విమానంలో రాహుల్, ప్రియాంక హైదరాబాద్ చేరుకోనున్నారు. సాయంత్రం 5.15 గంటలకు తుక్కుగూడ సభా ప్రాంగణానికి చేరుకుని పాంచ్‌న్యాయ్ గ్యారెంటీలు, పార్టీ మేనిఫెస్టో తెలుగు ప్రతులను విడుదల చేయనున్నారు. సభను ఉద్దేశించి ప్రసంగించిన తర్వాత శంషాబాద్ విమానాశ్రయం చేరుకుని, ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు. అయితే ఖర్గే రాకకు సంబంధించి షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదని తెలుస్తోంది.

మోదీని గద్దె దించడమే లక్ష్యంగా..

దక్షిణాదిలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి తుక్కుగూడ సభ.. కిక్ స్టార్ట్‌గా ఉండేలా రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రచిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబరు 17న ఇదే తుక్కుగూడలో భారీ బహిరంగ సభను నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ.. ఆరు గ్యారెంటీలను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ రోజు నుంచి రాష్ట్రంలో ప్రారంభమైన జోష్.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొనసాగడంతో పార్టీ అధికారంలోకి వచ్చింది. దీన్ని సెంటిమెంట్‌గా తీసుకున్న కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్నీ ఏప్రిల్ 6న ఇదే వేదిక నుంచి పూరించనుంది. గతంలో ఆరు గ్యారెంటీలను ప్రకటించి కేసీఆర్‌ను గద్దె దింపినట్టుగానే.. ఇప్పుడు పాంచ్ న్యాయ్ గ్యారెంటీలను ప్రకటించడం ద్వారా మోదీ పాలనకు చరమగీతం పాడుతామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. తుక్కుగూడలో 60 ఎకరాల మేరకు ఉన్న మైదాన ప్రాంతంలో జనజాతర సభను నిర్వహించనున్నారు. వాహనాల పార్కింగ్‌కు మరో 300 ఎకరాల స్థలమూ అందుబాటులో ఉంది. పది లక్షల మంది ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు.

రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే ట్యాపింగ్ కేసును

సీబీఐకి అప్పగించాలి

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లవి డ్రామాలు
- దోషుల్ని తప్పించే యత్నాలు: లక్ష్మణ్
- కేంద్ర ప్రభుత్వమే సుమోటోగా తీసుకోవాలి: మంత్రి దుద్దిళ్ల
- దీనివెనుక ఎవరున్నా వదలం: పొంగులేటి
- ఈ కేసులో కేసీఆర్‌కూ జైలుజీవితం తప్పదు: కొండా సురేఖ



హైదరాబాద్, పటాన్‌చెరు రూరల్, రంగారెడ్డి అర్బన్/మహేశ్వరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై వివిధ పార్టీల నాయకుల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి! ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలాడుతున్నాయని, సూత్రధారులను, దోషుల్ని తప్పించి ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాయని, సీఎం రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీ సీనియర్ నేత, ఎంపీ లక్ష్మణ్ సవాల్ చేశారు!! దుబ్బాక, మునుగోడు, హుజూరాబాద్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ట్యాపింగ్‌కు పాల్పడిందని, కేసీఆర్ ఆదేశాల మేరకే పోలీసులు ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. గత పాలకులు ఇచ్చిన చనువుతో ఒక అడుగు ముందుకేసిన పోలీసులు.. ప్రైవేటు వ్యక్తులు, వ్యాపారులు, బంగారు ఆభరణాల వర్తకులను కూడా వదలకుండా వారి నుంచి డబ్బు వసూలు చేశారని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారం దేశభద్రతను, వ్యక్తుల స్వేచ్ఛను హరించేలా ఉందని ఆందోళన వెలిబుచ్చారు. పోలీసులు తమ వాహనాల్లో డబ్బును తరలించి, బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేయడం దుర్మార్గమన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌ను గతంలో కేసీఆర్ సర్కారు ఓటుకు నోటు కేసులో ఇరికించి జైలుకు పంపినా.. ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఆయన ఎందుకు ఇంత ఉపేక్షిస్తున్నారో అంతుబట్టట్లేదన్నారు. కాంగ్రెస్ సర్కారు ఈ వ్యవహారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బీజేపీ ఆధ్వర్యంలో గవర్నర్‌ను కలిసి జోక్యం కోరతామన్నారు. అయితే.. లక్ష్మణ్ విమర్శలపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. నాటకాలు ఆడుతున్నది బీఆర్ఎస్, బీజేపీలేనని, ఇండియన్ టెలికం చట్టం ప్రకారం చట్టవిరుద్ధంగా ఎవరి ఫోన్ ట్యాప్ చేసినా, నేరుగా కేంద్ర ప్రభుత్వమే చర్య తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ విషయంలో కేంద్రమే తనకున్న అధికారాలను ఉపయోగించుకుని ఈ కేసును సుమోటోగా తీసుకుని చర్యలు ఎందుకు చేపట్టట్లేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వెనుక ఎంతపెద్ద తురుమ్‌ఖాన్‌లు ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. ఈ కేసులో దొంగలు ఎవరు అంటే.. భుజాలు తడుముకోవాల్సిన అవసరం ఏ మాజీ మంత్రికీ అవసరం లేదంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఇక.. ఈ కేసులో కేసీఆర్‌కు సైతం జైలు జీవితం తప్పదని మంత్రి కొండా సురేఖ అన్నారు. లిక్కర్ కేసులో కవితను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా.. బీజేపీతో కేసీఆర్ చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆమె ఆరోపించారు.

పోలీసుల దిగజారుడుకు నిదర్శనం: సీపీఐ

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం పోలీసుల దిగజారుడు విధానాలకు అద్దం పడుతోందని.. పోలీసుల చర్య హేయమైనదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పోలీసు వాహనాల్లో బీఆర్ఎస్‌కు అనుకూలంగా డబ్బు తరలించిన వైనంపై ఈసీ విచారణ చేపట్టాలన్నారు. ఈ విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకుని అక్రమార్కులను చట్టబద్ధంగా శిక్షించాలని కోరారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే అనైతిక కార్యకలాపాలకు పాల్పడడం కంచే చేను మేసిన చందంగా ఉందని ఆయన వాపోయారు. మరోవైపు.. టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటి ముందూ ఒక వాహనాన్ని పెట్టి గత బీఆర్ఎస్ సర్కారు ఆయన ఫోన్‌ను ట్యాప్ చేసిందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన ఆరోపించారు.

హెచ్ఎండీఏ మెడకు మొక్కల నిర్వహణ భారం!

- ఏటా రూ.40 కోట్ల వ్యయం
- ఓఆర్ఆర్ నిర్వహణ ప్రైవేటు సంస్థకు అప్పగింత
- మొక్కల నిర్వహణను ఆ సంస్థకు అప్పగించని వైనం
- దీంతో ఆ భారాన్ని హెచ్ఎండీఏనే భరించాల్సిన పరిస్థితి



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగించారు.. కానీ ఆ రోడ్డు వెంట మొక్కల నిర్వహణ భారం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)మెడకు చుట్టుకునే పరిస్థితి నెలకొంది. ఓఆర్ఆర్‌పై మొక్కల నిర్వహణకు ఏడాదికి రూ.40కోట్లు ఖర్చవుతుండటంతో ఆ భారమెందుకు భరించాలని ప్రభుత్వవర్గాలు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఓఆర్ఆర్‌ను గత ఏడాది ఓ ప్రైవేట్ సంస్థకు లీజుకివ్వడంతో 30ఏళ్లపాటు నిర్వహణ ఆ సంస్థనే చూసుకోవాల్సి ఉంటుంది. కానీ మొక్కల నిర్వహణను ఆ సంస్థకు అప్పగించలేదు. టెండర్ ప్రక్రియలోనూ పొందుపర్చలేదు. గతంలో ఔటర్‌పై వచ్చే ఆదాయం నుంచే మొక్కల నిర్వహణ నిధులను హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్టు విభాగానికి కేటాయించేది. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొక్కల నిర్వహణ వ్యయం ఔటర్ నుంచి వచ్చే పరిస్థితి లేకపోవడంతో సొంతంగా హెచ్ఎండీఏనే ఈ వ్యయాన్ని భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఔటర్‌పై 158 కిలోమీటర్ల మేర ఇరువైపులా, సెంట్రల్ మీడియన్‌లో పెద్ద ఎత్తున మొక్కలు పెంచుతున్నారు. అలాగే ఔటర్ ఇంటర్‌ఛేంజ్‌ల్లోనూ మొక్కలను భారీగా పెంచి ల్యాండ్‌స్కేప్‌లను వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి చేశారు. ఓఆర్ఆర్ హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహణ ఉన్నప్పుడు మొక్కల నిర్వహణ వ్యయాన్ని హెచ్ఎండీఏ భరించేది. హెచ్‌జీసీఎల్‌కు వచ్చే ఆదాయంలో కొంత మేర మొక్కల నిర్వహణకు మళ్లించేది. ఇప్పుడు ఔటర్‌ను ప్రైవేట్ సంస్థకు లీజుకివ్వడంతో మొక్కల నిర్వహణ వ్యయం హెచ్ఎండీఏకు భారంగా మారనుంది. మరోవైపు.. ఓఆర్ఆర్‌పై మొక్కలకు నీటి సరఫరా కోసం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని తెచ్చారు. దాదాపు 1500కిలోమీటర్ల మేర డ్రిప్ పైపులైన్లను ఏర్పాటు చేసి వాటికి 94బోర్లు వేయడంతో పాటు ఔటర్ వెంట వివిధ ప్రాంతాల్లో 92 సంపులను ఏర్పాటు చేశారు. అయితే 94 బోర్లలో వివిధ ప్రాంతాలవారీగా 30శాతానికిపైగా ఎండిపోయాయి. డ్రిప్ పైపులైన్లు కొన్ని ప్రాంతాల్లో మొక్కలకు నీరందించక పోవడంతో ఎండిపోతున్నాయి. దీంతో ఓఆర్ఆర్‌పైకి ట్యాంకర్లను తరలించి మొక్కలకు నీళ్లు పోస్తున్నారు.

సిమెంటు మంట!

(మొదటిపేజీ తరువాయి)



సిమెంటు కంపెనీలకు ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని ఓ స్థానిక కంపెనీ ఉన్నతాధికారి చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ, ఏపీల్లో నెలకు సగటున 26 లక్షల టన్నుల నుంచి 27 లక్షల టన్నుల సిమెంటు వినియోగమవుతోంది. గత నెలలో 27 లక్షల టన్నులను మించింది. దీంతో ధరలు పెంచి కొంతైనా రాబట్టుకునేందుకు ఇదే సరైన సమయమని కంపెనీలు భావిస్తున్నాయి. డీలర్లు మాత్రం దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్, వేసవి ఎండలతో నిర్మాణ రంగం మందగించి సిమెంట్ అమ్మకాలు తగ్గాయని, ఈ సమయంలో ధరలు పెంచితే అమ్మకాలు మరింత పడిపోయే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు.

ముందస్తు అడ్మిషన్లపై ఇంటర్ బోర్డు సీరియస్

- ఆయా కాలేజీలపై చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రకటించకముందే ముందస్తు అడ్మిషన్లు ఇస్తున్న కాలేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా హెచ్చరించారు. కొన్ని కాలేజీలు పీఆర్‌వోలను ఏర్పాటు చేసుకుని అడ్మిషన్లను చేపడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అలాంటి కాలేజీలపై చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు సంబంధించిన షెడ్యూల్‌నే ఇంకా జారీ చేయలేదని పేర్కొన్నారు. షెడ్యూల్ విడుదలైన తర్వాతే.. ఆయా కాలేజీలు అడ్మిషన్లను చేపట్టాల్సి ఉంటుందని గుర్తు చేశారు. గుర్తింపు ఉన్న కాలేజీల జాబితాను త్వరలోనే వెబ్‌సైట్‌లో ఉంచుతామని, ఆ తర్వాతే అడ్మిషన్ల షెడ్యూల్‌నూ విడుదల చేస్తామని వెల్లడించారు. అప్పటి దాకా అడ్మిషన్లు తీసుకోవద్దని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సూచించారు. గుర్తింపు లేని కాలేజీల్లో విద్యార్థులు చేరవద్దని, ఎవరైనా తొందరపడి చేరితే విద్యా సంవత్సరాన్ని నష్టపోవాల్సి ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్-2 పరీక్షలు

జేఈఈ మెయిన్ సెషన్-2 పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 12వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షల నిర్వహణ కోసం ఇప్పటికే ఎన్‌టీఏ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏప్రిల్ 4, 5, 6, 8, 9, 12 తేదీల్లో పరీక్షలు జరగనుండగా, ఇప్పటికే విద్యార్థులు అడ్మిట్ కార్డులను జారీ చేశారు.

మంత్రి తుమ్మలతో క్లైమేట్ సెన్స్ ప్రతినిధుల భేటీ

యూఎస్‌కు చెందిన క్లైమెట్ సెన్స్ కంపెనీ ప్రతినిధులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బుధవారం కలిశారు. వరి పంటలో విడుదలయ్యే కర్బన ఉద్గారాలను తగ్గించటానికి ఎలాంటి విధానాలు పాటించాలి? రైతులకు ఆదాయం ఎంత సమకూరుతుంది? సెన్సార్ల ద్వారా కలిగే ఉపయోగం ఏమిటి? సెన్సార్ల వినియోగంతో ఇతరత్రా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందా? వరి పంటలో వెలువడే గ్రీన్ హౌస్ వాయువులను ఎలా నియంత్రిస్తారు? అనే అంశాలపై కంపెనీ ప్రతినిధులతో మంత్రి చర్చించారు. రైతుల ఉత్పత్తులను పెంచేలా, ఆర్థికంగా బలోపేతం చేసేలా క్లైమెట్ సైన్స్ కంపెనీ పనిచేయాలని, ప్రభుత్వం నుంచి కూడా సహకారం ఉంటుందని తెలిపారు.

సత్యసాయి ఆంగ్ల అనువాదకులు ప్రొఫెసర్ అనిల్‌కుమార్ కన్నుమూత

పుట్టపర్తి, ఏప్రిల్ 3: పుట్టపర్తి సత్యసాయి బాబా ఆధ్యాత్మిక ప్రసంగ అనువాదకులు ప్రొఫెసర్ అనిల్‌కుమార్ (82) అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. ఆయన శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు భగవాన్ సత్యసాయికి అత్యంత సన్నిహితంగా మెలిగారు. సత్యసాయి ప్రసంగాలను ఆంగ్లంలోకి అనువదించేవారు. సత్యసాయి శివైక్యం చెందిన తర్వాత దాదాపు 30 దేశాలు పర్యటించి, సత్యసాయి బోధనలను విశ్వవ్యాప్తం చేశారు.

పలు ప్రత్యేక రైళ్ల పొడిగింపు: రైల్వే

హైదరాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను ప్రయాణికుల డిమాండ్ మేరకు జూన్ నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రతి సోమవారం నడుపుతున్న కాచిగూడ-మధురై(07191) రైలును జూన్ 24 వరకు, ప్రతి బుధవారం నడుపుతున్న మధురై- కాచిగూడ(07192), జాల్నా-చాప్రా(07651) రైళ్లను జూన్ 26వరకు, ప్రతి శుక్రవారం నడుపుతున్న కాచిగూడ- నాగర్‌సోల్(07435), హెచ్ఎస్ నాందేడ్- ఈరోడ్(07189), ఛాప్రా-జాల్నా(07652) రైళ్లను జూన్ 28 వరకు, ప్రతి ఆదివారం నడుపుతున్న నాగర్‌సోల్- కాచిగూడ(07436), ఈరోడ్- నాందేడ్(07190) రైళ్లను జూన్ 30 వరకు పొడిగించినట్లు వారు తెలిపారు.

అన్ని స్థానాల్లోనూ బీజేపీనే గెలవాలి

- మీ కృషి వల్లే ఎన్నికల్లో కొత్త రికార్డులు
- కేంద్రం చేసిన పనులను వివరించండి
- అవినీతిని ఎట్టి పరిస్థితుల్లో సహించం
- యూపీ, బెంగాల్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలతో ప్రధాని నరేంద్ర మోదీ



లక్నో/కోల్‌కతా, ఏప్రిల్ 3: లోక్‌సభ ఎన్నికలైనా, అసెంబ్లీ ఎన్నికలైనా కార్యకర్తల కృషి వల్లే కొత్త రికార్డులు నమోదవుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. త్వరలో ఎన్నికలు జరిగే అన్ని స్థానాల్లోనూ బీజేపీనే గెలవాలని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 10 లోక్‌సభ స్థానాల్లోని 22,648 బూత్‌లకు చెందిన బూత్ స్థాయి పార్టీ కార్యకర్తలతో నమో యాప్ ద్వారా వర్చువల్‌గా ఆయన మాట్లాడారు. 'మీ కృషిని చూసి మేం సంతోషిస్తుంటే.. ప్రత్యర్థి పార్టీల నేతలు మాత్రం ఓర్వలేకపోతున్నారు. ఓటర్ల దృష్టిలో మీరే చాలా బాధ్యతాయుతమైన వ్యక్తి. కొంచెం అహం ప్రదర్శించినా ఓటరు మనకు దూరమవుతాడు. గత పదేళ్లలో కేంద్రం చేసిన పనులను వివరిస్తూ ప్రజలను ఓటేయమని కోరండి. అయోధ్యలో రామమందిరం నిర్మించి రాంలల్లాను ప్రతిష్ఠించాం. ఆర్టికల్ 370 రద్దు చేశాం. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా చట్టం తెచ్చామని వివరించండి' అని దిశానిర్దేశం చేశారు. ఇటు పశ్చిమ బెంగాల్‌కు చెందిన పార్టీ కార్యకర్తలతోనూ మోదీ మాట్లాడారు. అవినీతిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమన్నారు. అవినీతికి పాల్పడే వారికి జైలు లేదా బెయిల్ రెండే ఎంపికలని చెప్పారు. 'బీజేపీ కార్యకర్తలను ఆపడానికి అధికార టీఎంసీ ఎన్ని హింసాత్మక చర్యలకు పాల్పడిందో దేశం మొత్తం చూసింది.. అయినా కాషాయ కార్యకర్తలు బూత్‌లలో నిర్భయంగా నిలబడ్డారు. బెంగాల్‌లో ఎన్నికలకు హింసే అతిపెద్ద సవాల్.. అయితే ఎన్నికల సంఘం భద్రత కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలవండి.. నిర్భయంగా ఓటేయమని చెప్పండి. ఈసారి మనమే ఎక్కువ సీట్లు గెలవబోతున్నాం' అని ధీమా వ్యక్తం చేశారు. పలువురు కార్యకర్తలతోనూ ప్రధాని మాట్లాడారు.

రేప్ బాధితురాలిని దుస్తులు విప్పమన్న రాజస్థాన్ జడ్జీ.. కేసు నమోదు

జైపూర్, ఏప్రిల్ 3: గాయాలు చూసేందుకు అత్యాచారానికి గురైన ఓ దళిత యువతిని దుస్తులు విప్పమన్న రాజస్థాన్‌లోని హిండౌన్ కోర్టు జడ్జిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, మార్చి 19న ఓ 18 ఏళ్ల యువతి సామూహిక అత్యాచారానికి గురైంది. ఈ ఘటనపై మార్చి 27న హిండౌన్ సదర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మార్చి 30న హిండౌన్ కోర్టులో ఈ కేసు విచారణకు వచ్చింది. ఈ కేసును విచారిస్తున్న జడ్జి బాధిత యువతి గాయాలు చూసేందుకు ఆమెను దుస్తులు విప్పమన్నారు. దానికి అంగీకరించని ఆమె కోర్టులో స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం జడ్జిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. జడ్జిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు ఐపీసీ సెక్షన్ 345 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భద్రాచలం వద్ద రెండో వారధి సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

భక్తులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడం పరిపాటిగా మారింది. భద్రాచలం వద్ద రెండో వారధిని అందుబాటులోకి తీసుకురావాలని రెండు దశాబ్దాల క్రితమే అప్పుడు మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు భావించారు. ఆనాటి కేంద్ర మంత్రి వీసీ కందూరితో మాట్లాడి జాతీయ రహదారి నిర్మాణానికి మార్గం సుగమం చేశారు. అనుకోని అవాంతరాలతో ఆ ప్రయత్నం దశాబ్ద కాలం పాటు ముందుకు సాగలేదు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల... మరో సారి బ్రిడ్జి పనులపై దృష్టి సారించారు. రూ.65కోట్ల అంచనా వ్యయంతో 2015 ఏప్రిల్ 1న అప్పటి కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, బండారు దత్తాత్రేయతో కలిసి వారధి పనులకు శంకుస్థాపన చేశారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై సమీక్షిస్తూ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఆ తర్వాత వివిధ కారణాలతో పనుల్లో వేగం మందగించింది. తాజాగా మరో సారి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల.. గత ఏడాది డిసెంబరు 17న వంతెన పనులను పరిశీలించారు. శ్రీరామనవమి నాటికి రెండో వారధిపై వాహనాల రాకపోకలు ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీతోపాటు జాతీయ రహదారుల శాఖ అధికారులతో మాట్లాడి పనులను వేగిరం చేసేందుకు కృషి చేశారు. ఫలితంగా నత్తనడకన సాగుతున్న వారధి పనులు వేగవంతమయ్యాయి. ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై అధికారులతో తుమ్మల సమీక్షలు నిర్వహించారు. దీంతో నాలుగు నెలల్లోనే వారధి పనులు చివరి దశకు చేరుకున్నాయి. 17న శ్రీరామనవమి నాటికి వంతెనను ప్రారంభించేందుకు రంగం సిద్ధమవుతోంది. రెండో వారధి అందుబాటులోకి వస్తే రాములోరి దర్శనానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ కష్టాలు దూరం కానున్నాయి.



భద్రాచలం వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని పరిశీలిస్తున్న తుమ్మల(ఫైల్)

సప్లిమెంటరీ బిల్లులు మళ్లీ పాయె!

మార్చి 31తో గడువు మీరిన బిల్లులు.. పీఆర్సీ బకాయిలు, డీఏ సహా దాదాపు 30 వేల బిల్లులకు కాలదోషం

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి 31 నాటికి సప్లిమెంటరీ బిల్లులను పరిష్కరించాలి. కానీ, 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసినా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులకు మోక్షం లభించలేదు. ఈ నెల 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం (2024-25) అమల్లోకి వచ్చింది. ఏ ఆర్థిక సంవత్సరంలో తయారు చేసిన బిల్లులు ఆ ఏడాదిలోనే క్లియర్ కావాలి. మార్చి 31తో ముగిసిన ఏడాదికి బిల్లులు క్లియర్ కాకపోవడంతో వాటికి కాలదోషం పట్టింది. వాటిని అధికారులు మళ్లీ తయారు చేయాలి. ఈ ప్రక్రియ రెండేళ్లుగా సాగుతూనే ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరం బిల్లులు సకాలంలో క్లియర్ కాకపోవడంతో 2023 మార్చి 31తో ల్యాప్స్ అయ్యాయి. అప్పట్లో వాటిని రీ-షెడ్యూలు చేశారు. అయినా.. 2023-24లోనూ ఆ బిల్లులు మంజూరు కాలేదు. ఇప్పుడు 2024 మార్చి 31 కూడా పూర్తయింది. మళ్లీ రీ-షెడ్యూలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే ఇలాంటి బిల్లులను రీ-షెడ్యూలు చేసుకోవాలంటూ ఆర్థిక శాఖ ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయకపోవడం గమనార్హం. దీనిపై ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వాలు మారినా.. తమ వెతలు తీరడం లేదని వాపోతున్నారు.



ఒకటా.. రెండా..?

పీఆర్సీ, డీఏ బకాయిల బిల్లులు, తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ లైఫ్ ఇన్సూరెన్స్ (టీఎస్‌జీఎల్ఐ), జనరల్ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్) పార్ట్ ఫైనల్, పీఆర్సీ గ్రాట్యుటీ రివైజ్డ్ బకాయిలు, కమ్యూటేషన్, సరెండర్ లీవ్స్, సెలవుల నగదీకరణ, మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ వంటి బిల్లులన్నీ పెండింగే. రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి దాదాపు 30 వేల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సంఘాల నేతలు చెబుతున్నారు. ఇందులో కొన్ని 2021 నుంచి పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా బిల్లులను క్లియర్ చేయలేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా పరిస్థితి మారలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్ కేటాయింపులతో సంబంధం ఉండే పీఆర్సీ, డీఏ బిల్లులకు ప్రతిసారీ కాలదోషం పడుతోంది. ఉద్యోగులకు 2018 సంవత్సరపు 'వేతన సవరణ సంఘం (పీఆర్సీ)' ఫిట్‌మెంట్‌ను 2021 జూన్ నుంచి ప్రభుత్వం అమలు చేసింది. అంటే.. జూన్ నుంచి పెరిగిన వేతనాలను జూలైలో చెల్లించింది. కానీ, ఏప్రిల్, మే జీతాలను 18 వాయిదాల్లో చెల్లిస్తామని చెప్పింది. ఒక్కో ఉద్యోగికి పీఆర్సీ వ్యత్యాస సొమ్ము రూ.75వేల వరకు రావాలి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 3, 4 వాయిదాలను చెల్లించి, నిలిపివేసింది. 18 వాయిదాల ప్రకారం ఈ బకాయిలు 2022 డిసెంబరు నాటికల్లా ముగిసిపోవాలి. వీటికి సంబంధించి అధికారులు బిల్లులు చేసి 'జిల్లా పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్స్ (డీపీఏవో)'కు పంపించారు. ప్రభుత్వం వీటిని నిలిపివేయడంతో 2023 మార్చి 31తో ల్యాప్స్ అయ్యాయి. మళ్లీ బిల్లులు తయారు చేసి, ఆర్థిక శాఖకు పంపినా ఫలితం లేకపోయింది. డీఏ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. 2022 జనవరికి సంబంధించిన డీఏ 3.64 శాతాన్ని ప్రభుత్వం 2023 జనవరిలో ప్రకటించింది. ఈ డీఏ బకాయిలను పాత పెన్షన్(ఓపీఎస్) ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేసింది. సీపీఎస్ ఉద్యోగులకు మాత్రం ఇప్పటికీ చెల్లించలేదు. అధికారులు బిల్లులు పంపుతున్నా క్లియర్ కావడం లేదు.

బిల్లులన్నీ క్లియర్ చేయాలి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులు క్లియర్ కాలేదు. ఈ విషయాన్ని ఉద్యోగ సంఘాలు అప్పట్లో రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లాయి. తాము అధికారంలోకి వస్తే సప్లిమెంటరీ బిల్లులను క్లియర్ చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది కాబట్టి ఈ బిల్లులను క్లియర్ చేయాలి.

\- చావ రవి, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

ఇతర సప్లిమెంటరీ బిల్లులూ అంతే..

పదవీ విరమణ పొందిన ఉద్యోగుల ఆర్జిత సెలవుల బిల్లుల కింద ఒక్కొక్కరికి దాదాపు 10 నెలల జీతం సొమ్ము రావాలి. వీటి బిల్లులను చేసి పంపిస్తున్నా, క్లియర్ కావడం లేదు. గత ప్రభుత్వం బిల్లులను క్లియర్ చేయకుండా పథకాలకు నిధులు మళ్లించింది. పర్యవసానంగా సప్లిమెంటరీ బిల్లులకు మోక్షం లభించలేదు. ఇక 20 ఏళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగి తన జీపీఎఫ్ నుంచి 'పాక్షిక ఉపసంహరణ(పార్ట్ ఫైనల్)' కింద 80 శాతం సొమ్మును తీసుకోవచ్చు. చాలా మంది ఉద్యోగులు పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇళ్ల నిర్మాణం కోసం పాక్షిక ఉపసంహరణ బిల్లులు పెడితే.. అవి కూడా క్లియర్ కావడం లేదు. టీఎస్‌జీఎల్ఐకు సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే బీమా సొమ్మును ఇవ్వాలంటూ చాలా మంది ఉద్యోగులు తమ బాండ్లను జీఎల్ఐ కార్యాలయంలో సమర్పించారు. అవీ క్లియర్ కావడం లేదు. దీని కింద ఒక్కో ఉద్యోగికి రూ.1-4 లక్షల వరకు చేతికందుతాయి. మొదటి పీఆర్సీ సిఫారసు మేరకు ఉద్యోగుల గ్రాట్యుటీ రూ.12 లక్షల నుంచి 16 లక్షలకు పెరిగింది. ఉద్యోగి రిటైరవగానే ఈ సొమ్మును చెల్లించాలి. ఆ బిల్లులు కూడా క్లియర్ కావడం లేదు. ఇక ఉద్యోగుల 'కమ్యూటేషన్' బిల్లులూ విడుదల కావడం లేదు. మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ బిల్లుల సంగతి అయితే చెప్పనక్కర్లేదు.

సిరిసిల్ల ఫస్ట్.. జహీరాబాద్ లాస్ట్!

- పట్టణాల్లో 922కోట్ల ఆస్తి పన్ను వసూలు
- 2023-24కు లక్ష్యం రూ.1300 కోట్లు
- 70.92% వసూలు చేసిన అధికారులు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లలో సిరిసిల్ల మునిసిపాలిటీ మొదటి స్థానంలో నిలవగా, జహీరాబాద్ మునిసిపాలిటీ చివరి స్థానంలో నిలిచింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పట్టణ స్థానిక సంస్థల నుంచి ఆస్తి పన్ను కింద రూ.1300 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, రూ.922 కోట్లను అధికారులు వసూలు చేశారు. మొత్తం పన్ను వసూళ్ల లక్ష్యంలో ఇది 70.92శాతం కావడం గమనార్హం. ఆర్థిక సంవత్సరం ముగింపు వేళ పట్టణ స్థానిక సంస్థల నుంచి ఆస్తి పన్ను వసూళ్లపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. మార్చి నెల చివరి మూడు రోజులు గంట గంటకు ఎంత వసూలు చేశారనే ప్రాతిపదికన పర్యవేక్షించారు. మార్చి 31వ తేదీన ఒక్క రోజే రూ.28 కోట్లు వసూలు చేశారు. 2022-23 ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం రూ.115 కోట్ల అదనంగా వసూలు చేసినట్లు పురపాలక శాఖ సంచాలకురాలు దివ్య తెలిపారు. ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి తొలి పది స్థానాల్లో సిరిసిల్ల, ఇల్లందు, హుజురాబాద్, ఐజా, దేవరకొండ, నర్సాపూర్, జమ్మికుంట, వాడపల్లి, పెద్దపల్లి, కోరుట్ల ఉన్నాయి. సిరిసిల్ల పరిధిలో రూ.5.61 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉంటే.. రూ.5.58 కోట్లు(99.52 శాతం) వసూలు చేశారు. చివరి పది స్థానాల్లో నిలిచిన వాటిలో జహీరాబాద్, నల్లగొండ, నకిరేకల్, జాలపల్లి, మిర్యాలగూడ, మహబూబ్‌నగర్, తాండూరు, భైంసా, ఖానాపూర్, చేర్యాల ఉన్నాయి. జహీరాబాద్‌లో రూ.16.70 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉంటే.. కేవలంరూ.5.81 కోట్లు (34.77 శాతం) వసూలు చేశారు. మొత్తం 140 పట్టణ స్థానిక సంస్థల నుంచి రూ.1300.07 కోట్ల ఆస్తి పన్నుకు గాను రూ.922.03 కోట్ల వసూలు చేయగా ఇంకా రూ.378.04 కోట్ల బకాయిలు ఉన్నాయి.

తనిఖీల తర్వాతే అనుమతులు

- 8 కొత్త మెడికల్ కాలేజీల దరఖాస్తులను ఎన్ఎంసీ తిరస్కరించలేదు
- ఆంధ్రజ్యోతి కథనంపై డీఎంఈ వివరణ

తెలంగాణ ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరానికి గాను 8 కొత్త వైద్యవిద్య కళాశాలల కోసం చేసుకున్న దరఖాస్తులు ఇంకా తిరస్కరించలేదని ఆ శాఖ సంచాలకులు డాక్టర్ వాణి తెలిపారు. ఈ నెల 2న "ఆంధ్రజ్యోతి"లో 'కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతులు లేవు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తా కథనంపై ఆమె వివరణ ఇచ్చారు. కర్ణాటక ప్రభుత్వం అభ్యర్థన మేరకు జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) గతేడాది మార్చి 16న విడుదల చేసిన నోటిఫికేషన్‌పై అక్కడి హైకోర్టు స్టే ఇచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న 8 మెడికల్ కాలేజీ(గద్వాల్, నారాయణ్ పేట్, ములుగు, నర్సంపేట్, మెదక్, భువనగిరి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్)ల దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని, గత నెల 14న తమకు ఎన్ఎంసీ లేఖ కూడా పంపిందని ఆమె తెలిపారు. ఎన్ఎంసీ తనిఖీలు పూర్తయిన వెంటనే అనుమతులు లభిస్తాయని వెల్లడించారు. కాగా 'ఆంధ్రజ్యోతి' తన కథనంలో కొత్త కాలేజీల దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు పేర్కొలేదు. ఎన్ఎంసీ తీసుకొచ్చిన కొత్త డాక్యుమెంట్‌పై కర్ణాటక హైకోర్టును ఆశ్రయించిందని, దాని కారణంగా దేశవ్యాప్తంగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న మెడికల్ కాలేజీలకు అనుమతులు నిలిచిపోయాయని మాత్రమే ప్రచురించింది. అంతేతప్ప ఒక్క తెలంగాణ సర్కారు దరఖాస్తు చేసుకున్న కాలేజీలకే అనుమతులు రాలేదని ఎక్కడా పేర్కొనలేదు.

మిర్చి ధర ఢమాల్!

- మార్కెట్లలో సీజన్ కనిష్ఠానికి రేట్లు
- ఖమ్మంలో ఒక్కరోజే 1,000 కిందకు
- వరంగల్, గుంటూరులోనూ ఇదే పరిస్థితి

ఖమ్మం మార్కెట్, ఏప్రిల్ 3: రైతుల ఏటా సిరులు కురిపిస్తున్న ఎర్ర బంగారం మిర్చి.. ఈ సంవత్సరం ఊరించి ఉసూరుమనిపించింది. సీజన్ ప్రారంభంలో ఆశాజనకంగా ప్రారంభమైన ధరలు క్రమంగా తగ్గుముఖం పట్టి ప్రస్తుతం కనిష్ఠానికి పడిపోయాయి. సాధారణంగా పంట తగ్గినప్పుడు ధర పెరగాల్సి ఉండగా... ఈ ఏడాది దిగుబడి తగ్గడంతో పాటు ధర కూడా తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది ఖమ్మం మార్కెట్‌లో సీజన్ ప్రారంభంలో గరిష్ఠంగా రూ.24 వేలు పలుకగా సీజన్ చివరిలో రూ.20 వేల వరకు చేరింది. ఇక సీజన్ ప్రారంభమైన డిసెంబరులో క్వింటాల్ రూ.22 వేల గరిష్ఠ ధర లభించగా.. ప్రస్తుతం రూ.18,700 జెండాపాటకు చేరుకుంది. వ్యాపారులు నాణ్యతను బట్టి రూ.15 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ లెక్కన సీజన్ ప్రారంభంతో పోల్చుకుంటే ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.5 వేల వరకు నష్టపోతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



రెండు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి..

మిర్చి ధరల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఒకే పరిస్థితి కనిపిస్తోంది. ఖమ్మం మార్కెట్‌లో బుధవారం తేజా రకం మిర్చికి ఒక్కరోజే రూ.1,000 ధర పడిపోయింది. మార్కెట్‌లో క్వింటాల్ డీలక్స్ క్వాలిటీ మిర్చికి రూ.18,700 జెండాపాట పలుకగా మిగితా రకాలను వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాల్ రూ.11 వేల నుంచి రూ.16,500 వరకు కొనుగోలు చేశారు. ముందురోజు క్వింటాల్ రూ.19,500 పలికిన మిర్చి ధర బుధవారం ఒక్కసారిగా రూ.1,000 తగ్గింది. వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో క్వింటాల్ తేజా మిర్చి రూ.18,600 జెండాపాట నిర్ణయించగా, గుంటూరు మార్కెట్‌లో క్వింటాల్ రూ.19 వేలు, కర్నూలులో గరిష్ఠంగా రూ.14,519 పలికింది. కర్నూలు జిల్లాలోని ఆదోని మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.12,101 లభించగా సగటు ధర రూ.8,001 పలికింది. ఈ నేపథ్యంలోనే రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధరలు దక్కకపోవడంతో మళ్లీ అప్పుల పాలవుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యత తగ్గిన మూడో కోత పంట..

మార్కెట్‌లో మిర్చి ధరలు ఇంత భారీస్థాయిలో తగ్గడానికి పంట నాణ్యత తగ్గడమే కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మిర్చి పంటపై సీజన్ ప్రారంభంలో తామర పురుగు విజృంభించగా, కాత పూత దశలో మిచౌంగ్ తుఫాన్‌తో పంట దెబ్బతిన్నది. మరోవైపు పంట ద్వితీయార్థంలో తీవ్ర సాగు నీటి ఎద్దడి నెలకొనడంతో దిగుబడులు, పంట నాణ్యతపై ప్రభావం చూపింది. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న మూడో కోత కాయలకు చైనా, సింగపూర్, మలేసియా తదితర దేశాలు ఆర్డర్లు తీసుకోవడం లేదు. అక్కడ డిమాండ్ లేకపోవడంతోనే ధరలు దిగొస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఖమ్మం పరిసరాల్లో ఉన్న ముదిగొండ, మన్నెగూడెం గ్రామాల వద్ద ఉన్న చైనాకు చెందిన (మిర్చి నుంచి ఆయిల్ తీసే) ఫ్యాక్టరీలు సైతం ఈ ఏడాది తెరవకపోవడంతో మిర్చి ధరలపై ప్రభావం చూపిందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే రైతులు కోల్డ్ స్టోరేజీల్లో తమ పంటను నిల్వ చేయడానికి మొగ్గు చూపుతున్నారు.

సమస్యల వలయంలో స్టడీ సర్కిళ్లు

- అధ్యాపకులు, స్టడీ మెటీరియల్‌కు కొరత
- రెగ్యులర్ విధానంలో లేని డైరెక్టర్లు
- లక్షల్లో ఉద్యోగార్థులు.. వందల్లోనే సీట్లు
- రాష్ట్రంలో గ్రూప్ 1, గ్రూప్ 2, డీఎస్సీ, బ్యాంకింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు
- స్టడీ సర్కిళ్లలో సీట్ల సంఖ్యను పెంచి, సౌకర్యాలు కల్పించాలంటున్న నిరుద్యోగులు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న గ్రూప్ 1, గ్రూప్ 2, అధ్యాపక పోస్టులతో పాటు భారీ సంఖ్యలో బ్యాంకు ఉద్యోగాల భర్తీకి ఓ వైపు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. మరోవైపు, ఉద్యోగార్థులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వాల్సిన ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల పరిధిలోని స్టడీ సర్కిళ్లు అరకొర సౌకర్యాలతో, సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అన్ని స్టడీ సర్కిళ్లు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య అధ్యాపకుల కొరత. గ్రూప్ 1 సాధనకు అవసరమైన నైపుణ్యం ఉన్న అధ్యాపకులు స్టడీ సర్కిళ్లలో అందుబాటులో లేరని నిరుద్యోగులు వాపోతున్నారు. దీనికి తోడు చాలా కేంద్రాల్లో స్టడీ మెటీరియల్ కూడా పూర్తి స్థాయిలో లేదు. స్టడీ సర్కిళ్లను పర్యవేక్షించే డైరెక్టర్లు కూడా రెగ్యులర్ విధానంలో లేకపోవడం గమనార్హం. బీసీ శాఖ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా 13 స్టడీ సర్కిళ్లున్నాయి. వీటిలో ఒక్క హైదరాబాద్ పరిధిలో ఉన్న సెంటర్లో మాత్రమే పూర్తి స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంది. ఈ 13లో 12 సర్కిళ్లకు డైరక్టర్లను కాంట్రాక్ట్ పద్ధతిలోనే నియమించారు. ఇక, ఉస్మానియా యూనివర్శిటీ ప్రాంగణంలో ఉన్న స్టడీ సర్కిల్‌లో సివిల్స్ పరీక్షలకు అవసరమైన శిక్షణ మాత్రమే ఇస్తుండగా ఇక్కడ కేవలం 70-80మంది అభ్యర్థులకు మాత్రమే శిక్షణ పొందే అవకాశం ఉంది. మిగతా పరీక్షలకు ఇక్కడ కోచింగ్ ఇవ్వట్లేదు. ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల పరిధిలోని స్టడీ సర్కిళ్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

ప్రైవేట్ కోచింగ్‌కు లక్షలు

స్టడీ సర్కిళ్లలో వసతులు అలా ఉంటే.. ఒక్కో స్టడీ సర్కిల్‌లో కేవలం 100-150 మందికి మాత్రమే శిక్షణనిస్తున్నారు. ఉద్యోగార్థులు మాత్రం లక్షల్లో ఉన్నారు. దీంతో, అభ్యర్థులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ప్రైవేటు సెంటర్లలో కోచింగ్ తీసుకుంటున్నారు. ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలన్న నిరుద్యోగుల ఆశను చూసి నిర్వాహకులు లక్షల్లో ఫీజులను వసూలు చేస్తున్నారు. అధిక ఫీజులతో నిరుద్యోగులను హడలెత్తిస్తున్న కోచింగ్ సెంటర్లపైనా ప్రభుత్వం దృష్టి సారించాలని నిరుద్యోగ అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసిన ప్రభుత్వం.. స్టడీ సర్కిళ్లను పెంచి, వాటిల్లో సీట్లను పెంచి సౌకర్యాలను కల్పిస్తే ఎంతోమంది నిరుద్యోగులకు మేలు జరుగుతుందని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

స్టడీ సర్కిళ్లను బలోపేతం చేయండి

'గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఆ కారణంగానే రాష్ట్రంలోని స్టడీ సర్కిళ్లన్నీ అరకొర సౌకర్యాలు, అనుభవజ్ఞులైన శిక్షకులు లేక సతమతమవుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నాం. కానీ స్టడీ సర్కిళ్లలో మాత్రం సౌకర్యాలను పెంచలేదు. ముఖ్యంగా స్టడీ సర్కిళ్లల్లో సీట్ల సంఖ్యను భారీగా పెంచాలి. సౌకర్యాల కల్పనకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలి. స్టడీ సర్కిళ్లను బలోపేతం చేయాలి' అని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు.



సీఎం రేవంత్‌ను కలిసిన వినోద్ కుమార్, అనిల్ కుమార్ తదితరులు

త్వరలో గల్ఫ్‌కు రాష్ట్ర మంత్రుల బృందం!

- ప్రవాసీయులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న ప్రవాసీయుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ వినోద్ కుమార్, ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గల్ఫ్ ప్రవాసీయుల బృందం ముఖ్యమంత్రిని బుధవారం కలిసింది. గల్ఫ్ దేశాల్లో మరణించిన తెలంగాణ పౌరులకు చెందిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు పరిహారం ఇవ్వడాన్ని హర్షిస్తూ సీఎంకు ధన్యవాదాలు తెలియజేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గల్ఫ్ పర్యటనకు రావాలని ప్రవాసీయుల బృందం సీఎంను ఆహ్వానించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన వారు గల్ఫ్ దేశాల్లో అత్యధికంగా నివసిస్తున్నారని, ఎన్నికల్లో బీజేపీ ప్రధాన పోటీదారు కావడడంతో గల్ఫ్ రావాలని కోరింది. అయితే, ప్రస్తుతం గల్ఫ్ పర్యటనకు రాలేనన్న సీఎం రేవంత్ రెడ్డి.. తనకు బదులుగా మంత్రులు, ఎమ్మెల్యేల బృందాన్ని త్వరలోనే పంపిస్తానని చెప్పారని ప్రవాసీయుల బృందం తెలియజేసింది. అంతేకాక, గల్ఫ్ దేశాలకు చెందిన ప్రవాసీ ప్రముఖులతో త్వరలో సమావేశం అయ్యేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారని పీసీసీ గల్ఫ్ ఎన్ఆర్ఐ విభాగం కన్వీనర్లు మంద భీంరెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి తెలిపారు.

హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్

శివబాలకృష్ణకు బెయిల్

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అరెస్ట్ చేసిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణకు ఏసీబీ ప్రత్యేక కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్ష పూచీకత్తు, ఇద్దరు షూరిటీలు డిపాజిట్ చేయాలని ఆదేశించింది. కేసు దర్యాప్తులో ఉన్నందున దేశం వదిలి వెళ్లరాదని, దర్యాప్తు అధికారులకు అందుబాటులో ఉండి విచారణకు సహకరించాలని పేర్కొంది. ఇదే కేసులో అరెస్ట్ అయిన శివబాలకృష్ణ సోదరుడు శివ నవీన్ కుమార్‌కు కూడా న్యాయస్థానం బుధవారం షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది.

బండి సంజయ్‌ను అరెస్ట్ చేయొద్దు

- చెంగిచెర్ల కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చెంగిచర్ల ఘటనకు సంబంధించి నమోదైన కేసుల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌పై అరెస్ట్ సహా ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 11 వరకు సంజయ్ సహా మరో ఐదుగురు బీజేపీ నేతలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని.. సీఆర్పీసీ 41ఏ ప్రకారం పిటిషనర్లందరికీ నోటీసులు జారీ చేయాలని.. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు స్పష్టం చేసింది. హోలీ సందర్భంగా చెంగిచర్ల పిట్టలబస్తీ వద్ద రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగిన సందర్భంగా బండి సంజయ్ సహా ఇతర బీజేపీ నాయకులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని..పోలీసులకు గాయాలయ్యే విధంగా ఘర్షణకు దిగారని పేర్కొంటూ ఉప్పల్ మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. రోహింగ్యాల దాడిలో గాయపడ్డ బాధితులను పరామర్శించడానికి మాత్రమే వెళ్లామని.. తమపై పోలీసులు అక్రమంగా నమోదు చేసిన కేసులను కొట్టేయాలని కోరుతూ బండి సంజయ్ సహా పలువురు నాయకులు హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై బుధవారం విచారణ చేపట్టిన జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం.. పిటిషనర్లను ఈ నెల 11 వరకు అరెస్ట్ చేయరాదని పేర్కొంది.

ఎల్వోసీ కొట్టేయండి.. హైకోర్టులో రహీల్ పిటిషన్

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తనపై పంజాగుట్ట పోలీసులు జారీ చేసిన లుక్అవుట్ సర్క్యులర్(ఎల్వోసీ)ని కొట్టేయాలని కోరుతూ ప్రజాభవన్ ర్యాష్ డ్రైవింగ్ కేసులో ప్రధాన నిందితుడు, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్ అమీర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రజా ఆస్తుల విధ్వంస నిరోధక చట్టం కింద కేసు పెట్టాల్సినంత పెద్ద అంశం కాకపోయినా, తాను నేరం చేసినట్లు ఎలాంటి ఆధారాలు లేకపోయినా పోలీసులు ఎల్వోసీ ఇవ్వడం చెల్లదని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ కేసులో సహ నిందితుడిగా ఉన్న తన తండ్రి షకీల్ భారత్ రావడానికి.. దర్యాప్తులో పోలీసులకు సహకరించడానికి హైకోర్టు అంగీకరించిందని.. వెన్నెముక సమస్యతో బాధపడుతున్న తన తండ్రికి తన సహాయం అవసరమని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తన తండ్రి సహా ఇతర నిందితుల తరహాలో తనకు సైతం భారత్‌కు వచ్చి దర్యాప్తునకు సహకరించే అవకాశం కల్పించాలని కోరారు.

జాతీయ రహదారిపై దొంగల బీభత్సం

- ఆటోలో ఎక్కించుకుని కత్తులతో బెదిరించి దోపిడీ
- అనంతరం బయటకు తోసివేత..ఓ ప్రయాణికుడి మృతి

కంది, ఏప్రిల్ 3 : సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధి 65 నంబరు జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి దారి దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. ఆటోలో ప్రయాణికుల్ని ఎక్కించుకుని, వారిని కత్తులతో బెదిరించి డబ్బు లాక్కున్నారు. అంతేగాక వేగంగా వెళ్తున్న ఆటోలోంచి ఆ ప్రయాణికుల్ని బయటకు తోసేశారు. దీంతో వారిలో ఒకరు అక్కడికక్కడే మృత్యువాత పడగా, మరో ఇద్దరు గాయాలతో బయటపడ్డారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మోహినుద్దీన్, సైఫ్‌ఖాన్, కైఫ్, మహమ్మద్ ఇసాక్, అర్జున్ గౌతమ్ పటాన్‌చెరు మండలం రుద్రారంలో ఉంటూ అక్కడే ఓ సిమెంట్ పలకలు తయారుచేసే కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ నెల 2న సాయంత్రం చిమ్నాపూర్‌లో సిమెంట్ పలకలను అన్‌లోడ్ చేసి వస్తూ.. కంది శివారులోని ఓ దాబా వద్ద భోజనం చేశారు. అనంతరం అక్కడి నుంచి రుద్రారం వెళ్లేందుకు జాతీయ రహదారిపై ఆటో ఎక్కారు. ఆటో మామిడిపల్లి చౌరస్తా వద్ద నిర్మానుష్య ప్రాంతంలోకి రాగానే ఆటోడ్రైవర్‌తో పాటు లోపల సీట్లో కూర్చొని ఉన్న మరో వ్యక్తి ఒక్కసారిగా కత్తులు చూపించి వారిని బెదిరించారు. వారి వద్ద ఉన్న డబ్బు లాక్కుని ఆటోలో నుంచి తోసేసి పరారయ్యారు. ఈ ఘటనలో మోహినుద్దీన్(31) తల పగిలి, తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కైఫ్, మహమ్మద్ ఇసాక్‌లకు గాయాలయ్యాయి.

బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య 13

దుమ్ముగూడెం ఏప్రిల్ 3: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల సంఖ్య 13కు పెరిగింది. మంగళవారం సాయంత్రానికి 11 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమవ్వగా.. బుధవారం ఉదయం మరో రెండు మృతదేహాలను కనుగొన్నట్లు పోలీసులు తెలిపారు. 13 మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బీజాపూర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని లేంద్ర-కొర్చోలి అటవీప్రాంతంలో మంగళవారం పోలీసులు-నక్సల్స్ మధ్య ఎదురుకాల్పులు జరిగిన విషయం తెలిసిందే. మృతులంతా పీఎల్‌జీఏ రెండో కంపెనీకి చెందినవారని పోలీసులు భావిస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో రోగి మరణిస్తే ఐదేళ్ల శిక్ష

- జూలై 1 నుంచి కొత్త న్యాయ చట్టాలు అమల్లోకి
- వైద్యులకు అవగాహన కల్పించాలని కేంద్రం లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వైద్యం చేసి రోగి మరణానికి కారణమయితే వైద్యులు ఇకపై కఠిన శిక్ష ఎదుర్కోవాల్సిందే. గతేడాది కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చి మూడు న్యాయ చట్టాలు ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. దాంతో కొత్త చట్టాలపై వైద్యులకు అవగాహన కల్పించాలని అన్ని రాష్ట్రాల సీఎస్, హెల్త్ సెక్రటరీలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అతుల్ గోయల్ లేఖ రాశారు. లేఖలో ఆ చట్టాల్లోని సెక్షన్ల వివరాలను అందులో తెలిపారు. మెడికో లీగల్ కేసుల్లో ఎటువంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని లేఖలో హెచ్చరించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు కింద వైద్య సంబంధిత కేసుల విషయంలో ఈ మూడు క్రిమినల్ చట్టాలు, వాటి నిబంధనలపై వైద్యులందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో నిర్లక్ష్యపు వైద్యం కారణంగా రోగి చనిపోతే సదరు వైద్యుడికి రెండేళ్ల జైళ్ల శిక్ష లేదా జరిమానా విధించేవారు. కొన్నిసార్లు రెండూ విధించేవారు. కొత్త చట్టం భారతీయ న్యాయ సంహితలో.. నేరపూరిత ఉద్దేశంతో లేదా నిర్లక్ష్యం కారణంగా మనిషి చావుకు కారణమైతే విధించే శిక్షను రెండేళ్ల నుంచి ఐదేళ్లకు పెంచారు. న్యాయ సంహితలోని సెక్షన్ 106 ప్రకారం వైద్యులకు ఇదే శిక్ష వర్తిస్తుంది.

బాలింతల కిట్లకు బ్రేక్?

మూడు నెలలుగా నిలిచిన పథకం.. కొత్త సర్కార్ వచ్చాక ఎంసీహెచ్ కిట్లుగా మార్పు

- అయినా బాలింతలు, గర్భిణులకు అందని సాయం
- గతంలో న్యూట్రిషియన్ కిట్ల కొనుగోలులో అవినీతి!
- ఆ కారణంగానే కిట్లు, సాయం పంపిణీ నిలిపివేత?
- లోక్‌సభ ఎన్నికల తర్వాతే సాయం అందే అవకాశం



హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాలింతలు, గర్భిణులకు ఇచ్చే కిట్లకు బ్రేక్ పడింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ రెండు రకాల కిట్లను అందించగా.. రాష్ట్రంలో కొత్త సర్కారు వచ్చిన తర్వాత కిట్ల పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ ఉండటంతో కేసీఆర్ కిట్ పేరును 'మదర్ అండ్ చైల్డ్ హెల్త్ కిట్(ఎంసీహెచ్ కిట్)'గా మార్చారు. పేరు మారినా బాలింతలు, గర్భిణులకు కిట్లు మాత్రం ఇవ్వడం లేదు. కాంగ్రెస్ సర్కారు కేసీఆర్ కిట్ల పేరును మార్చేసి.. ఆ పథకాన్ని కొత్త పేరుతో పునఃప్రారంభించాలని యోచించింది. ఆ మేరకు ఐదారు పేర్లతో సర్కారుకు వైద్యశాఖ ప్రతిపాదనలు కూడా పంపింది. 'ఇందిరమ్మ' పేరుతో కిట్లను పంపిణీ చేసే అవకాశాలున్నాయని వైద్యశాఖ వర్గాలద్వారా తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండటంతో ఆ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు సమాచారం. ప్రభుత్వాస్పత్రుల్లోప్రసవాల సంఖ్యను పెంచేందుకు, మాతాశిశు మరణాలను తగ్గించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ సర్కారు 2017లో కేసీఆర్ కిట్ల పథకాన్ని ప్రారంభించింది. ప్రసవం అనంతరం బాలింతలకు ఈ కిట్లను అందజేసేవారు. ఒక్కో కిట్‌లో 16 రకాల వస్తువులుండేవి. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో కలిపి ప్రతీనెల సగటున 45-48 వేల మధ్య ప్రసవాలు జరుగుతుంటాయి. ఇందులో 50-52 శాతం ప్రసవాలు సర్కారీ దవాఖానాల్లో, మిగిలినవి ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు జరిగిన అనంతరం బాలింతలకు కిట్లను అందజేసేవారు. గత ఏడాది రాష్ట్రంలో 5.51 లక్షల కాన్పులు జరగ్గా అందులో 52% సర్కారీ దవాఖానాల్లోనే చేశారు.

అవినీతి కారణంగానే నిలిపివేత?

గత ప్రభుత్వం గర్భిణులకు అందించే న్యూట్రిషియన్ కిట్ల పథకాన్ని సరిగ్గా ఎన్నికలకు ఏడాది ముందు అంటే 2022 డిసెంబరులో ప్రారంభించింది. గర్భిణుల్లో రక్తహీనతను నివారించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని 6.84 లక్షల గర్భిణులకు రెండు మార్లు.. మొత్తం 13.08 లక్షల న్యూట్రిషియన్ కిట్లను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో కిట్‌ను రూ. 2 వేల చొప్పున టీఎస్ఎంఎస్ఐడీసీ కొనుగోలు చేసింది. వాస్తవానికి ఆ కిట్ ధర వేయి రూపాయలలోపే ఉంటుందని, కానీ ఎక్కువ ధరకు కొనుగోలు చేశారని ఆరోపణలు వచ్చాయి. అయితే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సన్నిహితంగా ఉండే ఓ ఎమ్మెల్సీ తమ్ముడు చక్రం తిప్పి.. ఓ కంపెనీ కోసమే ఆ కిట్లను అధిక ధరకు కొనుగోలు చేశారని, ఆ విషయాన్ని అప్పట్లోనే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. అయినప్పటికీ ఆ దందా ఆగలేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఈ అంశంపై దృష్టిసారించింది. న్యూట్రిషియన్ కిట్ల కొనుగోలులో అవినీతి చోటుచేసుకుందన్న వార్తల నేపథ్యంలో వాటి ప్రొక్యూర్‌మెంట్‌ను నిలిపివేయించింది. అలాగే సదరు సరఫరాదారుడికి బిల్లులను కూడా ఆపేసింది. పార్లమెంటు ఎన్నికల తర్వాత మరింత మెరుగ్గా ఈ న్యూట్రిషియన్ కిట్ల పంపిణీ చేపట్టే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

గత ప్రభుత్వ హయాంలోనే అందని కిట్లు!

వాస్తవానికి గత ప్రభుత్వం హయాంలోనే కిట్ల పంపిణీ సరిగా జరగలేదు. పథకం ప్రారంభమైన మూడే నాలుగేళ్ల వరకు బాగానే నడిచింది. ఆ తర్వాత పథకం నిర్వహణ గాడి తప్పింది. కొందరికి అసలే కిట్లను ఇవ్వలేదు. మరికొందరికి ప్రసవం అయిన కొన్ని నెలలకు అందజేశారు. కిట్ల సరఫరాదారుడికి సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేశారు. పథకంలో భాగంగా లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ.12 వేలను అందజేసేవారు. ఆడపిల్ల పుడితే అదనంగా మరో వెయ్యి ఇచ్చేవారు. గర్భం దాల్చిన ఐదు నెలల్లోపు వైద్యుల పరీక్ష అనంతరం రూ.3 వేలు, ప్రసవ సమయంలో ఆడ శిశువైతే రూ.5 వేలు, మగశిశువైతే రూ.4 వేలు, వ్యాధి నిరోధక టీకాల సమయంలో మరో రూ.3 వేలు (14 వారాల వయసులో), అలాగే పుట్టిన బిడ్డకు పది నెలలు నిండిన తర్వాత మిగిలిన రూ.2 వేలు ఇచ్చేవారు. ఈ నగదు బదిలీని గర్భిణులు, బాలింతల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు అందజేసేవారు. అయితే ఈ నగదు బదిలీ కూడా గడిచిన మూడేళ్లుగా సక్రమంగా అందించడం లేదు. ఈ బాపతు పెండింగ్ బకాయిలు వందల కోట్లకు చేరుకున్నాయి. ఒకదశలో అసలీ పథకం ఉందా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి. మరోవైపు కొన్నిచోట్ల ప్రైవేటు ఆస్పత్రుల్లో అయిన డెలివరీలను కూడా సర్కారీ దవాఖానాల్లో జరిగినట్లు చూపించి, కిట్లను ఇచ్చారన్న ఆరోపణలొచ్చాయి. మొత్తంగా గత సర్కారు హయాంలోనే ఈ పథకం గాడి తప్పిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దివ్యాంగ నిరుద్యోగులకు

ప్రభుత్వ సహకారమేది!

రెండేళ్లుగా ప్రభుత్వ కోచింగ్ బంద్

- ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో లక్షల్లో ఫీజు
- ఫీజులు భరించలేక శిక్షణకు దూరం

ఓల్డ్ మలక్‌పేట ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొలువుల సాధనలో దివ్యాంగ నిరుద్యోగులకు ప్రభుత్వ సహకారం కరువయింది. ప్రభుత్వం అందించే ఉచిత కోచింగ్ ఆగిపోవడంతో కోచింగ్ సెంటర్లలో లక్షల రూపాయల ఫీజులు కట్టలేక పేద దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. నిరుద్యోగులైన దివ్యాంగులకు ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో 2016లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే దివ్యాంగుల కోసం ఉచిత కోచింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌తో దివ్యాంగుల కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆ శిక్షణ కార్యక్రమం నిర్వహించేవారు. జిల్లాలలో డీడబ్ల్యూవో కార్యాలయాలు ఉచిత శిక్షణ నిర్వహణ బాధ్యతలు చూసేవి. దరఖాస్తు చేసుకున్న వారిని ఉచిత కోచింగ్‌కు మెరిట్ ఆధారంగా ఎంపిక చేసేవారు. అందుకు 40 శాతం వైకల్యం ఉన్నవారు మాత్రమే అర్హులు. ఒక్కో అభ్యర్థి కోసం ఇన్సిడెంటల్ అలవెన్స్‌ల కింద రూ. 20 వేలు, స్టైపెండ్ కింద రూ.7 వేలు.. కోచింగ్‌సెంటర్లకు ప్రభుత్వం చెల్లించేది.

రెండేళ్లుగా ఉచిత కోచింగ్‌కు నిధులు శూన్యం

ఈ ఉచిత కోచింగ్‌కు గతంలో ప్రతియేటా రూ. కోటి బడ్జెట్ కేటాయించేది. కానీ రెండేళ్లుగా దీనికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడం లేదు. దాంతో నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాలకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల ఫీజులు భరించలేక ఆర్థిక పరిస్థితులు బాగాలేని దివ్యాంగులు నియామక పరీక్షల్లో రాణించలేకపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్ష మంది దివ్యాంగ అభ్యర్థులు ప్రభుత్వ కోచింగ్ కోసం ఎదురుచూస్తున్నట్లు ఆయా జిల్లాల నుంచి వచ్చిన దరఖాస్తుల ద్వారా తెలుస్తోంది. ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించి తమను ఆదుకోవాలని దివ్యాంగ నిరుద్యోగులు కోరుతున్నారు.

వలంటీర్లు లేని రాష్ట్రాల్లోనూ

పెన్షన్ ఇస్తున్నారు కదా?

- ఆ బాధ్యతల నుంచి తొలగించడం సబబే
- ఈసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది
- పంపిణీ ఏర్పాట్లపై సంతృప్తి చెందాం
- అనారోగ్య సమస్యలు, బయటకు రాలేని వారికి ఇళ్ల వద్దే అందజేస్తామన్నారు
- ఇందులో జోక్యం చేసుకోం: ఏపీ హైకోర్టు
- ప్రజా ప్రయోజన వ్యాజ్యం కొట్టివేత

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై హైకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. వలంటీర్ వ్యవస్థ లేని ఇతర రాష్ట్రాలలో పెన్షన్ల పంపిణీ జరుగుతోందని, లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పెన్షన్లు తీసుకుంటున్నారు కదా? అని వ్యాఖ్యానించింది. రాష్ట్రంలో పెన్షన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లను నిలువరిస్తూ ఈసీ జారీ చేసిన ఉత్తర్వులలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన రావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. పెన్షన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లను నిలువరిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం గత నెల 30న జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా కుంచెనపల్లి, మున్నంగికి చెందిన వంగా వరలక్ష్మీ, బిందు, అల్లు సునీత హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది జి.శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈసీ ఉత్తర్వులతో వృద్ధులు, దివ్యాంగులు, పక్షవాత, కిడ్నీ రోగులు సచివాలయాల వద్దకు వచ్చి పెన్షన్లు తీసుకొనేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. వలంటీర్ వ్యవస్థలేని ఇతర రాష్ట్రాలలో పెన్షన్ల పంపిణీ జరుగుతోంది కదా? అని వ్యాఖ్యానించింది. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ... పెన్షన్‌దారులకు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. అనారోగ్య సమస్యలున్న, ఇంటి నుంచి బయటకురాలేని లబ్ధిదారుల ఇళ్లకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వెళ్లి పెన్షన్లు అందజేస్తారన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈసీ చెప్పిన వివరాలతో తాము సంతృప్తి చెందామని ప్రకటించింది. పిల్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ దశలో పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ... తన వాదనలు నమోదు చేయాలని ధర్మాసనాన్ని కోరారు. రాజకీయ ప్రోద్బలంతో సిటిజన్ ఫర్ డెమొక్రసీ వలంటీర్లపై ఈసీకి ఫిర్యాదు చేసిందన్నారు. ఈ వాదనలపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలకే పరిమితం కావాలని స్పష్టం చేస్తూ వ్యాజ్యాన్ని కొట్టివేసింది.

పోలీసుల అదుపులో వేణుగోపాల్

ఫోన్‌ట్యాపింగ్ కేసులో 11 గంటల పాటు విచారణ.. నేడోరేపో అరెస్టు

- ఏడేళ్లుగా ఎస్ఐబీలో ఓఎస్డీగా విధులు
- వారంపాటు పోలీసు కస్టడీకి రాధాకిషన్
- రాధాకిషన్‌పై కూకట్‌పల్లిలో కేసు



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ అదనపు ఎస్పీ వేణుగోపాల్‌రావును పంజాగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదనపు ఎస్పీ హోదాలో రిటైర్ అయ్యాక.. ఆయన ఎస్ఐబీలో ఓఎస్డీ హోదాలో పనిచేయడం గమనార్హం..! బుధవారం ఉదయమే ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. సాయంత్రం 5 గంటల వరకు విచారించారు. ఈ సందర్భంగా ఆయన నుంచి కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలిసింది. ట్యాపింగ్ చేసిన తీరును వేణుగోపాల్ వివరించినట్లు సమాచారం. ఇటీవల అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును విచారించిన సందర్భంలో వేణుగోపాల్ పేరు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే..! ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసిన 'స్పెషల్ టాస్క్' టీంలలో.. వేణుగోపాల్ సైబరాబాద్ బృందాలకు నేతృత్వం వహించినట్లు రాధాకిషన్ రిమాండ్ రిపోర్ట్ చెబుతోంది.

నేటి నుంచి పోలీసు కస్టడీకి రాధాకిషన్

ఈ కేసులో అరెస్టయిన రాధాకిషన్‌రావును ఏడు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి న్యాయస్థానం బుధవారం తీర్పునిచ్చింది. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌ను పంజాగుట్ట పోలీసులు గురువారం ఉదయం కస్టడీకి తీసుకోనున్నారు. ఈ కేసులో గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ కోసం ఎన్నికల్లో నగదు తరలింపు, ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కీలక అంశాలపై ఆయనను ప్రశ్నించే అవకాశాలున్నాయి.

రాధాకిషన్‌పై కూకట్‌పల్లిలో కేసు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుపై కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తనను టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో నిర్బంధించి, తన ఫ్లాట్‌ను బలవంతంగా రిజిస్టర్ చేయించుకొన్నారంటూ కూకట్‌పల్లి సప్తగిరికాలనీకి చెందిన సుదర్శన్ కుమార్ అనే వ్యక్తి కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2017లో రాజరాజేశ్వర కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన రాజా అనే బిల్డర్ సనత్‌నగర్ జెక్‌కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తుండగా.. తాను రూ.60 లక్షలు పెట్టి, 10% వాటాదారుడిగా చేరినట్లు ఆయన వివరించారు. బిల్డర్ తన పేరిట ఓ ఫ్లాట్‌ను రిజిస్టర్ చేశారని, దాన్ని 2019లో తన కూతురి పేరిట సేల్‌డీడ్ చేయించానని పేర్కొన్నారు. కొంతకాలం తర్వాత బిల్డర్ రాజా తనకు ఫోన్‌చేసి, అదనంగా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, దానికి అంగీకరించడంతో.. అప్పటి టాస్క్‌ఫోర్స్ అధికారి రాధాకిషన్ ద్వారా తనను రెండ్రోజులు నిర్బంధించారని తెలిపారు. తమ ఫ్లాట్‌ను తిరిగి బిల్డర్ రాజా పేరిట రిజిస్టర్ చేయించారని.. లేని పక్షంలో బిల్డర్ రాజా తమను సుపారీ కిల్లర్స్‌తో హత్య చేయించే ప్లాన్‌లో ఉన్నాడని హెచ్చరించారన్నారు. దాంతో.. ఆ ఫ్లాట్‌ను బిల్డర్ రాజా పేరిట రిజిస్టర్ చేసినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాధాకిషన్ అరెస్టుతో ధైర్యం చేసుకుని, ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

ఆ 22 మంది ఐపీఎస్‌లను పక్కకు తప్పించండి

- వీరంతా వైసీపీ జేబులో మనుషులుగా మారారు
- ఆ అధికారులతో 'ఓటుకు చేటు'
- ఈసీకి ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి ఫిర్యాదు
- నిర్దిష్టంగా పేర్లు, ఆరోపణలతో లేఖ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీతో అంటకాగుతున్న ఐపీఎస్ అధికారులపై బీజేపీ గురిపెట్టింది. కీలక స్థానాల్లో ఉన్న ఈ ఐపీఎస్‌లు ఎన్నికల్లో వైసీపీ గెలుపుకోసం పని చేస్తున్నారని మండిపడింది. వీరిని పక్కకు తప్పిస్తేనే ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికంగా, సజావుగా సాగుతుందని స్పష్టం చేసింది. ఇన్‌చార్జి డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి నుంచి నాన్ కేడర్ ఎస్పీ ఆనంద్ రెడ్డి వరకు ఏకంగా 22 మంది పేర్లు, వారిపై ఉన్న అభియోగాలు, అవినీతి చర్యలు, వైసీపీతో ఉన్న సంబంధం, విపక్షాలను వేధిస్తున్న వైనం... ఇవన్నీ వివరిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాశారు. 'వీరిని విధుల నుంచి పక్కకు తప్పించాలని గట్టిగా భావిస్తున్నాం' అని తెలిపారు. ఆయా అధికారులు అనేక సందర్భాల్లో తమ మాటలు, చేతల ద్వారా వైసీపీ పట్ల తమకున్న భక్తిని చాటుకున్నారని చెప్పారు. గత నెల 26వ తేదీన పురందేశ్వరి ఎన్నికల కమిషన్‌కు ఈ ఫిర్యాదు చేశారు. కాగా... ఈ జాబితాలోని ఆరుగురు ఐపీఎస్‌లను ఈసీ ఇప్పటికే పక్కకు తప్పించిన సంగతి తెలిసిందే. ముందుందు మరెందరిపై చర్యలు ఉంటాయో వేచి చూడాల్సిందే! పురందేశ్వరి తన ఫిర్యాదులో పేర్కొన్న అధికారులు వీరే.. రాజేంద్రనాథ్ రెడ్డి (డీజీపీ); పి.సీతారామాంజనేయులు(ఇంటెలిజెన్స్ డీజీ); పీవీ సునీల్ కుమార్(డీజీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్); సంజయ్(సీఐడీ అదనపు డీజీ); కె.రఘురామిరెడ్డి(విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీ); క్రాంతిరాణా టాటా(విజయవాడ పోలీసు కమిషనర్); పాల్ రాజ్(గుంటూరు రేంజ్ ఐజీ); విశాల్ గున్నీ(విశాఖ రేంజ్ డీఐజీ); విజయారావు(డీఐజీ, కర్నూలు రేంజ్); అమ్మిరెడ్డి(డీఐజీ, అనంతపురం రేంజ్); అన్బురాజన్(ఎస్పీ, అనంతపురం); రిషాంత్‌రెడ్డి(ఎస్పీ, కౌంటర్ ఇంటెలిజెన్స్); పరమేశ్వర్ రెడ్డి(ఎస్పీ, ప్రకాశం జిల్లా); రవిశంకర్‌రెడ్డి(ఎస్పీ, పల్నాడు జిల్లా); ఫక్కీరప్ప(జాయింట్ సీపీ, విశాఖపట్నం); జి.కృష్ణకాంత్(ఎస్పీ, కర్నూలు జిల్లా); సిద్దార్థ్ కౌశల్(ఎస్పీ కడప జిల్లా); రఘువీరా రెడ్డి(ఎస్పీ, నంద్యాల జిల్లా); జాషువా(ఎస్పీ, చిత్తూరు); తిరుమలేశ్వరరెడ్డి(ఎస్పీ, నెల్లూరు); రాధిక(ఎస్పీ, శ్రీకాకుళం); ఆనంద్ రెడ్డి(ఎస్పీ, నాన్ కేడర్)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● గురువారం 4 ఏప్రిల్ 2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- 'జాయింట్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(జిప్‌మ్యాట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ఐఐఎం బోధ్‌గయ, ఐఐఎం జమ్మూ ఉమ్మడిగా అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం)లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఇందులో లాంగ్వేజ్ స్కిల్స్, ఓరల్ కమ్యూనికేషన్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు సంబంధించిన ఫౌండేషనల్ సబ్జెక్టులు, ఎథికల్ అండర్‌స్టాండింగ్ అంశాలు బోధిస్తారు.

జిప్‌మ్యాట్



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూపులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైనవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి స్థాయిలో కూడా కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్)/స్టేట్ బోర్డ్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి ఇంగ్లీష్ సహా ఏవేని అయిదు సబ్జెక్టులతో సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

జిప్‌మ్యాట్ 2024 వివరాలు: దీనిని సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 33, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 33, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 34 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2000; ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **పరీక్ష ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఏప్రిల్ 22
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 23 నుంచి 25 వరకు
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 2
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం
- **జిప్‌మ్యాట్ 2024 తేదీ:** జూన్ 6
- **వెబ్‌సైట్:** exams.nta.ac.in/JIPMAT/

డేటా సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో జాయింట్ ప్రోగ్రామ్

ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంఐ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఐ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ డేటా సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ (ఎంఎస్‌డీఎస్ఎం)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఇది రెండేళ్ల వ్యవధిగల ఆన్‌లైన్ మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు అనుకూలంగా ఉంటుంది. రెగ్యులర్ అభ్యర్థులు, విదేశీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. జాతీయ పరీక్ష స్కోర్/సంస్థ నిర్వహించే డీమ్యాట్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అడ్మిషన్స్ ఇస్తారు.



ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. బేసిక్ కోర్సులు, అడ్వాన్స్‌డ్ కోర్సులు పూర్తిచేయాల్సి ఉంటుంది. మొదటి నాలుగు ట్రైమెస్టర్లలో అడ్వాన్స్‌డ్ మెషిన్ లెర్నింగ్, అల్గారిథమ్స్, బిజినెస్ అనలిటిక్స్, బిజినెస్ రీసెర్చ్, డేటా స్ట్రక్చర్స్, డేటా విజువలైజేషన్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, డిజైన్ థింకింగ్, ఎథిక్స్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, జనరేటింగ్ బిజినెస్ వేల్యూ విత్ స్టోరీ టెల్లింగ్ అండ్ ఇన్‌సైట్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఫర్ మేనేజర్స్, ఇంట్రడక్షన్ టు ఏఐ, లీగల్ యాస్పెక్ట్స్ ఆఫ్ బిజినెస్, లీనియర్ ఆప్టిమైజేషన్, మెషిన్ లెర్నింగ్ ఫౌండేషన్స్, మేనేజీరియల్ కమ్యూనికేషన్, మేనేజీరియల్ ఎకనామిక్స్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, మేథమెటికల్ అండ్ స్టాటిస్టికల్ మెథడ్స్ ఫర్ డేటా సైన్స్ 1&2, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, ప్రొబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, ప్రోగ్రామింగ్ ఫండమెంటల్స్ ఫర్ డేటాసైన్స్, రీసెర్చ్ మెథడాలజీ, స్ప్రెడ్ షీట్ మోడలింగ్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ అండ్ ఫంక్షన్స్ ఆఫ్ ఫైనాన్స్ కోర్సులు ఉంటాయి. నాలుగు, అయిదు ట్రైమెస్టర్లలో రెండు సంస్థలు అందించే అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో కొన్నింటిని ఎలక్టివ్స్ కింద ఎంచుకోవాల్సి ఉంటుంది. ఆరో ట్రైమెస్టర్‌లో రెండు సంస్థల ఫ్యాకల్టీ మెంబర్ల ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

- వారానికి 14 నుంచి 15 గంటల ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. ప్రతి రోజూ సాయంత్రం ఏడు గంటలనుంచి ఎనిమిది గంటల వరకు; ఎనిమిది గంటల పదిహేను నిమిషాల నుంచి తొమ్మిది గంటల పదిహేను నిమిషాల వరకు సెషన్స్ ఉంటాయి. శనివారాల్లో మాత్రం ఉదయం పది గంటల నలభై అయిదు నిమిషాల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 900 గంటల సెషన్స్ నిర్దేశించారు. నెలరోజులపాటు క్యాంపస్ టీచింగ్ ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్/బీఫార్మసీ/బీఆర్క్/బీడిజైన్/బీఎఫ్‌టెక్/నాలుగేళ్ల బీఎస్సీ /ఎమ్మెస్సీ/ఎంసీఏ/ఎంబీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గత మూడేళ్లలో నిర్వహించిన క్యాట్/గేట్/జీమ్యాట్/జీఆర్ఈ/జామ్ పరీక్షల్లో ఒకదానిలో అర్హత పొంది ఉండాలి. లేదంటే ఐఐటీ ఇండోర్ నిర్వహించే డేటా సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీమ్యాట్) 2024 రాయాల్సి ఉంటుంది.

డీమ్యాట్ 2024 వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం 90 నిమిషాలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** భారత అభ్యర్థులకు రూ.12 లక్షలు; విదేశీ అభ్యర్థులకు రూ.15.6 లక్షలు
- **దరఖాస్తు ఫీజు:** భారత విద్యార్థులకు రూ.1770; విదేశీ విద్యార్థులకు రూ.2300; డీమ్యాట్ 2024 రాసే అభ్యర్థులు అదనంగా రూ.590లు చెల్లించాల్సి ఉంటుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఏప్రిల్ 10 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 10
- **డీమ్యాట్ 2024 తేదీ:** జూన్ 23
- **అడ్మిషన్ రిజిస్ట్రేషన్:** ఆగస్టు 8 నుంచి
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 10 నుంచి
- **వెబ్‌సైట్:** msdsm.iiti.ac.in, msdsm.iimi.ac.in

సీఐటీడీలో డిప్లొమాలు

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ)- డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు పదిహేను నుంచి పందొమ్మిదేళ్ల మధ్య ఉండాలి. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

కోర్సులు

- నాలుగేళ్ల డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్ (డీటీడీఎం)
- మూడేళ్ల డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (డీఈసీఈ)
- మూడేళ్ల డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజనీరింగ్ (డీఏఆర్ఈ)
- మూడేళ్ల డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్ (డీపీఈ)

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి నిర్దేశిత డాక్యుమెంట్స్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 20
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** మే 26
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ప్రిన్సిపల్ డైరెక్టర్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్-500037
- **వెబ్‌సైట్:** www.citdindia.org



ఎన్ఐఏఎంటీలో అడ్వాన్స్‌డ్ డిప్లొమా

రాంచీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ(ఎన్ఐఏఎంటీ)-అడ్వాన్స్‌డ్ డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. మూడు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబ్ వర్క్‌లు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, ప్లాంట్ ట్రెయినింగ్, ఇంటర్న్‌షిప్ ఉంటాయి. ఫౌండ్రీ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 58 సీట్లు, ఫోర్జ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 57 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.3000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీఈ/బీటెక్/డిప్లొమా(ఆటోమొబైల్/ మెకానికల్/ మెటలర్జికల్/ మాన్యుఫాక్చరింగ్/ ప్రొడక్షన్/ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్)/బీఎస్సీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/కంప్యూటర్ అప్లికేషన్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

రిటెన్ టెస్ట్: ఇందులో మేథమెటికల్ స్కిల్స్, సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లీష్, జనరల్ అవేర్‌నెస్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూన్ 9
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కోల్‌కతా, న్యూఢిల్లీ, పుణె, రాంచీ
- **రిటెన్ టెస్ట్ తేదీ:** జూన్ 30
- **ఫలితాలు విడుదల:** జూలై 12
- **అడ్మిషన్స్:** జూలై 23 నుంచి 26 వరకు
- **తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.niamt.ac.in



జాబ్ కార్నర్

హెచ్ఎస్‌సీసీలో ఎగ్జిక్యూటివ్‌లు

నోయిడాలోని హాస్పిటల్ సర్వీసెస్ కన్సల్టెన్సీ కార్పొరేషన్ లిమిటెడ్ రెగ్యులర్ ప్రాతిపదికన 38 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక: రాత, నైపుణ్య పరీక్షలు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటరాక్షన్ తదితరాల ఆధారంగా.



దరఖాస్తు రుసుము: రూ.1000. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రుసుము చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 20

వెబ్‌సైట్: http://www.hsccltd.co.in/

ఖాళీల వివరాలు

1. ఎగ్జిక్యూటివ్(సివిల్): 5
2. ఎగ్జిక్యూటివ్(హెచ్ఆర్ఎం): 2
3. ఎగ్జిక్యూటివ్(బయో మెడికల్): 2
4. ఎగ్జిక్యూటివ్(ఫార్మసీ): 1
5. ఎగ్జిక్యూటివ్(లీగల్): 2
6. ఎగ్జిక్యూటివ్(ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్): 1
7. ఎగ్జిక్యూటివ్(మెకానికల్): 2
8. ఎగ్జిక్యూటివ్(ఎలక్ట్రికల్): 2
9. ఎగ్జిక్యూటివ్(సిస్టమ్): 2
10. డిప్యూటీ మేనేజర్(సివిల్): 3
11. డిప్యూటీ మేనేజర్(బయో మెడికల్): 1
12. డిప్యూటీ మేనేజర్(ఫార్మసీ): 1
13. డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్): 1
14. డిప్యూటీ మేనేజర్(కార్పొరేట్ కమ్యూనికేషన్): 1
15. డిప్యూటీ మేనేజర్(కంపెనీ సెక్రెటరీ): 1
16. మేనేజర్(సివిల్): 2
17. మేనేజర్(హెచ్ఆర్ఎం): 1
18. మేనేజర్(బయో మెడికల్): 1
19. మేనేజర్(ఫార్మసీ): 1
20. మేనేజర్(ఫైనాన్స్): 1
21. మేనేజర్(లీగల్): 1
22. సీనియర్ మేనేజర్(సివిల్): 1
23. సీనియర్ మేనేజర్(హెచ్ఆర్ఎం): 1
24. సీనియర్ మేనేజర్(బయో మెడికల్): 1
25. డిప్యూటీ జనరల్ మేనేజర్(సివిల్): 1

నాగ్‌పూర్, ఎన్ఈఈఆర్ఐలో ప్రాజెక్టు జూనియర్ రీసెర్చ్ ఫెలో

నాగ్‌పూర్, నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ప్రాజెక్టు జూనియర్ రీసెర్చ్ ఫెలో: 1

అర్హత: ఎంఎస్సీ, బీటెక్ ఉత్తీర్ణతలతోపాటు గేట్, నెట్ స్కోర్ తప్పనిసరి.

జీతం: నెలకు రూ.31,000

వయసు: 35 సంవత్సరాలు మించకూడదు

దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 13

వెబ్‌సైట్: recruitment.neeri.res.in/appform/

బీహెచ్ఈఎల్, హైదరాబాద్‌లో డిప్యూటీ మేనేజర్ పోస్టులు

భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, హైదరాబాద్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

డిప్యూటీ జనరల్ మేనేజర్: 1

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతలు.

జీతం: నెలకు రూ.80,000 - 2,20,000

వయసు: 50 ఏళ్లకు మించరాదు.

దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 19

వెబ్‌సైట్: https://www.bhel.com/

నిట్, కాలికట్‌లో సీనియర్ మెడికల్ ఆఫీసర్లు



కేరళలోని కాలికట్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

1. టెక్నికల్ అసిస్టెంట్: 12
2. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: 4

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీసీఏ, బీఎస్సీ, బీటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ.

జీతం: టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు రూ.30,000; సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.35,000.

వయసు: 55 సంవత్సరాలు మించకూడదు.

దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 8

వెబ్‌సైట్: https://nitc.ac.in/recruitments/

లిటిల్స్




ఎలుగుబంటి, చిట్టెలుక!

ఒక అడవిలో ఎలుగుబంటి ఉండేది. దానికి కొంచెం కోపం ఎక్కువ. తేనె అంటే మహా ఇష్టం. తాను తినాలనుకున్న తేనెతుట్టె జోలికి వెళ్తే దానికి కోపం తలకెక్కేది. ఆ అడవిలోకి ఓ వేటగాడు వచ్చాడు. తేనెటీగల శబ్దం చూసి తేనె వెతకసాగాడు. ఓ రాయి తొర్రలో ఉండే తేనె కనపడింది. పొగబెట్టి తేనెటీగలను తరిమేసి తినేయాలని అనుకున్నాడు. నిప్పుకోసం రెండు రాళ్లు తీసుకొచ్చాడు. అంతలోనే చిట్టెలుక అక్కడికి వచ్చింది. 'ఎవరు స్వామి నువ్వు' అనడిగింది. 'నేను.. వేటగాడ్ని. పులిని



సైతం వేటాడే సత్తా నాది. ఈ ప్రాంతంలోని తేనె రుచిగా ఉంటుందని ఎవరో అనుకుంటే ఇటొచ్చా' అన్నాడు వేటగాడు. 'వేటగాడా.. దయచేసి ఆ రాయి తొర్రలో తేనెను కదపకండి. అది నా స్నేహితుడిది' అన్నది చిట్టెలుక. 'అయితే.. నేనేం చేయాలి. తేనె ఎవరి సొత్తు కాదు' అన్నాడు. 'ఎక్కడో ఉండే నువ్వు.. ఈ రాయి తొర్రలో ఉండే తేనెమీద పేరు రాయలేదు కదా. మా మిత్రుడు అసలే కోపిష్టి. తేనెటీగలు వాలినప్పటినుంచి ఎదురు చూస్తున్నాడు. ఈ లోపు నువ్వు వచ్చి తేనెను తీసుకుపోతే ఎలా?' అన్నది చిట్టెలుక. కోపంతో చిట్టెలుకను రాయితో కొట్టాడు. అది తప్పించుకుంది. ఇంతలోనే వేటగాడు, చిట్టెలుక వాదులాడుతుంటే చూశానంటూ ఎలుగుబంటి దగ్గరకు వెళ్లి ఓ పావురం సమాచారం అందించింది. వాయు వేగంతో ఎలుగుబంటి తేనెతుట్టె ఉండే రాయి దగ్గరకు వచ్చింది. వేటగాడు పొగబెట్టాడు. తేనెటీగలు కుడుతుంటే.. దూరంగా పరిగెత్తాడు. ఇదే అదను అనుకుని రాయి దగ్గరకు వెళ్లి ఒక్క ఉదుటున ఎలుగుబంటి తేనెతుట్టెను లాక్కొని పరిగెత్తింది. వేటగాడు బాణాన్ని ఎక్కుపెట్టాడు. ఇంతలోనే వేటగాడి కాలిని చిట్టెలుక గట్టిగా కొరికింది. గురితప్పింది. పైగా కోపంతో చిట్టెలుకను కాలితో రక్కాలని ప్రయత్నించి కిందపడ్డాడు. ఈ లోపు చిట్టెలుక తప్పించుకుంది. ఎలుగుబంటి తేనెతుట్టెను ఒక రాయిమీద ఉంచి వేగంగా వేటగాడి మీదకు దూకింది. గోళ్లతో రక్కింది. వేటగాడు బతుకుజీవుడా అనుకుంటూ పారిపోయాడు. ఆ తర్వాత ఎలుగుబంటి, ఎలుక తేనెను తిన్నాయి.


8 తేడాలు గుర్తించండి



జత ఉన్న బొమ్మ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 272

		6			9			8
				8			7	6
				3	6	9	5	
		7						5
	1		4	9	5		2	
9						6		
	3	5	6	4				
2	6			1				
7			3			1		

సుడోకు - 271 సమాధానం

3	7	4	8	9	6	2	5	1
8	2	1	7	4	5	6	9	3
5	6	9	1	3	2	7	4	8
7	4	6	9	5	3	1	8	2
9	3	2	6	1	8	5	7	4
1	8	5	4	2	7	3	6	9
6	1	7	3	8	4	9	2	5
4	5	3	2	6	9	8	1	7
2	9	8	5	7	1	4	3	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.